www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 220

సోమవారం | 25-11-2024 | పేజీలు: 12

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 1.02 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తర రా. 1.24 తదుపరి హస్త; వర్జ్యం: ఉ. 6.24-8.12; దుర్ముహూర్తం: మ. 12.24-1.08, మ. 2.37-3.21; అమృతఘడియలు: సా. 5.15-7.04; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పంత్‌కు కాసుల పంట

- టీమ్ ఇండియా వికెట్ కీపర్ బ్యాటర్‌కు రూ.27 కోట్లు
- ఐపీఎల్ మెగా వేలంలో రికార్డు ధరతో లఖ్‌నవూ సొంతం
- రూ.26.75 కోట్లకు శ్రేయా్‌సను దక్కించుకున్న ఢిల్లీ క్యాపిటల్స్
- వెంకటేశ్ అయ్యర్‌కు 23.75 కోట్లు, అర్షదీప్, చహల్‌కు 18 కోట్లు
- రూ.12.25 కోట్లతో గుజరాత్‌కు పేసర్ సిరాజ్.. నేడూ వేలం

10

పెర్త్ టెస్ట్‌పై భారత్ పట్టు
సెంచరీలతో చెలరేగిన జైస్వాల్, విరాట్ కోహ్లీ
కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా దెబ్బకు ఆస్ట్రేలియా విలవిల



ఆ భేటీల మర్మమేమి?

ఒప్పందంతో సంబంధం లేకుంటే 3సార్లు కలిసిందెందుకు?

2021 డిసెంబరు 1వ తేదీన 7000 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం జరిగింది. అంతకుముందు... 2021 ఆగస్టు 7వ తేదీన, సెప్టెంబరు 12వ తేదీన, నవంబరు 20వ తేదీన అప్పటి సీఎం జగన్‌తో తాడేపల్లిలో అదానీ ప్రత్యేకంగా మూడుసార్లు భేటీ అయ్యారు. ఈ ఒప్పందంతో అదానీకి సంబంధం లేకుంటే.. మరి ఎందుకు కలిశారు?

నాడు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది సెకీతోనే అయినా విద్యుత్తు సరఫరా చేస్తామన్నది అదానీ, అజూర్ సంస్థలు. ఆ తర్వాత అజూర్ వైదొలిగితే.. ఆ సంస్థ సరఫరా చేయాల్సిన విద్యుత్తు కూడా తానే చేస్తానని అదానీ ముందుకొచ్చింది. దీంతో సెకీతో జగన్ సర్కారు అనుబంధ ఒప్పందం చేసుకుంది. ఈఆర్‌సీ ఈ విషయాన్ని స్పష్టంగా వెల్లడించింది. ఒప్పందం కోసం జగన్‌కు అదానీ 1,750 కోట్లు ముడుపులు ఇచ్చినట్టు అమెరికా దర్యాప్తు సంస్థలు కూడా తేల్చాయి.

జగన్‌కు ముడుపులు ఇచ్చేందుకు అదానీ జరిపిన సంప్రదింపుల ప్రక్రియ అజూర్‌కు నచ్చలేదని, అందుకే విద్యుత్తు సరఫరా ఒప్పందం నుంచి వైదొలిగిందని అమెరికా దర్యాప్తు సంస్థల అభియోగం. నాడు చోటు చేసుకున్న పరిణామాలన్నీ పూసగుచ్చినట్లుగా అజూర్ చెప్పిందని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. అజూర్ ఉప్పందించడంతోనే అసలు విషయం బయటకు వచ్చిందని అభియోగ పత్రంలో పేర్కొన్నాయి.

అమెరికా కేసుపై భారత సంస్థలతోనూ దర్యాప్తు

సుప్రీంలో పిటిషన్

నేడు బెంచ్ ముందు ప్రస్తావన

- 2021 డిసెంబరు 1న 'విద్యుత్' ఒప్పందం
- అంతకు ముందు ఆగస్టు, సెప్టెంబరు, నవంబరులో జగన్‌తో అదానీ భేటీ
- లంచాల లింకు లేకుంటే భేటీలెందుకో?
- సెకీతో అనుబంధ ఒప్పందం మాటేంటి?
- అదానీ గురించి ఈఆర్‌సీ సైతం ప్రస్తావన
- 'ముడుపుల' బాగోతం నచ్చకే అజూర్ వైదొలిగిందన్న అమెరికా దర్యాప్తు సంస్థలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందంలో అక్రమాలు జరిగాయని ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికా వరకు చెబుతుంటే జగన్ మాత్రం బుకాయిస్తున్నారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో ఒప్పందం చేసుకుంటే అదానీకి ఏం సంబంధం అంటూ జగన్, ఆయన పార్టీ నేతలు అడ్డగోలుగా వాదిస్తున్నారు. నిజాలు

మిగతా 11వ పేజీలో...

ఆ లంచాల్లో ఇద్దరు ఐపీఎస్‌ల కీలక పాత్ర: పీవీ రమేశ్ 11

అదానీ పవర్ కోసం గిరిజన చట్టాలు తుంగలోకి! జగన్ సర్కార్ నిర్వాకమిది



జామా మసీదు వద్ద ఆందోళనకారులపైకి బాష్పవాయువు ప్రయోగిస్తున్న దృశ్యం

జామా మసీదు సర్వేలో ఉద్రిక్తత

- పోలీసుల కాల్పుల్లో ముగ్గురు మృతి
- తొలుత రాళ్లు రువ్విన ఆందోళనకారులు
- ఎయిర్ పిస్టళ్లతో దుండగుల కాల్పులు
- దాంతో బాష్పవాయు ప్రయోగం.. లాఠీచార్జి
- ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో ఘటన
- అక్కడ హరిహర దేవాలయం ఉండేది
- కోర్టులో పిటిషన్.. సర్వేకు జడ్జి ఆదేశాలు

లఖ్‌నవూ, నవంబరు 24: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో షాహీ జామా మసీదు సర్వే సందర్భంగా ఆదివారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో పోలీసులు బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. ఈ ఘటనల్లో ముగ్గురు ఆందోళనకారులు మృతిచెందగా.. 30 మంది పోలీసులు గాయపడ్డారు. షాహీ జామా మసీదు ప్రాంతంలో హరిహర ఆలయం ఉండేదని పేర్కొంటూ సుప్రీంకోర్టు న్యాయవాది విష్ణుశంకర్ జైన్(జ్ఞానవాపి కేసులో హిందువుల తరఫు లాయర్) స్థానిక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1529లో ఆలయాన్ని కూల్చిన మొఘల్ చక్రవర్తి బాబర్.. ఇక్కడ షాహీ జామా మసీదును నిర్మించినట్లు కోర్టుకు వెల్లడించారు. మొఘలుల కాలం నాటి పుస్తకాలు-- 'బాబర్ నామా', 'ఆయినే-ఇ-అక్బర్'ను ఆధారాలుగా చూపించారు. ఈ కేసులో

మిగతా 2వ పేజీలో...

కల్తీ నెయ్యిపై కదిలిన సిట్



డీఎస్పీల స్థాయిలో విచారణ ప్రారంభం

- శ్రీవారి లడ్డు ప్రసాదాలకు నెయ్యి సరఫరా చేసిన వైష్ణవి, ఏఆర్ డెయిరీ, చెన్నై ల్యాబ్‌కు బృందాలు
- అన్ని కోణాల్లో వివరాలు సేకరించిన అధికారులు
- రెండు డెయిరీల నుంచీ కీలక పత్రాలు స్వాధీనం
- ఏఆర్ డెయిరీలో 13 గంటల పాటు సోదాలు



తిరుపతి/చెన్నై, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎట్టకేలకు విచారణ మొదలుపెట్టింది. సిట్ కీలక సభ్యులు ఇంకా తిరుపతి చేరుకోనప్పటికీ కింది స్థాయిలో డీఎస్పీల ఆధ్వర్యంలో విచారణ ప్రారంభమైంది. మొత్తం నలుగురు డీఎస్పీలుండగా వారిలో ముగ్గురి ఆధ్వర్యంలో సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడ్డారు. ఆదివారం ఒక బృందం వైష్ణవి డెయిరీకి, మరో బృందం తమిళనాడులోని దిండుగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీకి, ఇంకోటి చెన్నైలోని ఎస్ఎంఎస్ ల్యాబ్‌కు వెళ్లాయి. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఆర్ డెయిరీ తాము పంపిన నెయ్యి నాణ్యమైనదిగా పేర్కొంటూ ఈ ల్యాబ్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను సమర్పించడంతో సిట్ బృందం దానిపై దృష్టి సారించింది. ఏఆర్ డెయిరీ నెయ్యి నాణ్యతపై ఆ ల్యాబ్ ఇచ్చిన సర్టిఫికెట్ నిజమా? కాదా? దేని ఆధారంగా నెయ్యి నాణ్యతను సర్టిఫై చేశారు? ఎలా పరీక్షించారు? ఏయే పరికరాలు


మిగతా 12వ పేజీలో...

రైల్వే జోన్ కార్యాలయాలకు టెండర్లు

- రూ.149 కోట్ల అంచనాతో పిలుపు.. డిసెంబరు 27 వరకు గడువు 12
- 29న ప్రధాని పర్యటనలో శంకుస్థాపనకు చాన్స్.. ప్రహరీకి పునాదులు

'పోలవరం' సొరంగాలకు ముప్పు!

- వైసీపీ ప్రభుత్వంలో నోచుకోని లైనింగ్ పనులు
- నీటి ఊట కారణంగా కూలుతున్న పైభాగాలు
- సొరంగాలు పూర్తిగా మూసుకుపోయే ప్రమాదం
- మళ్లీ తవ్వాలంటే అదనపు వ్యయ భారం



మూసుకుపోయిన తోటగొంది-మామిడిగొంది ఎడమ సొరంగం



అసంపూర్తిగా తోటగొంది-మామిడిగొంది కుడి సొరంగం

(పోలవరం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టులో కీలకమైన జంట సొరంగాలు ముప్పు ముంగిట నిలిచాయి. లైనింగ్ పనులు చేపట్టకుండా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిండమే ఇందుకు కారణం! సొరంగాలు లైనింగ్ పనులకు నోచుకోకపోవడంతో నీటి ఊట కారణంగా నేడు అవి కూలి, మూసుకుపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. కొండలపై ఊట నీటి ప్రభావంతో సొరంగం లోపల పైభాగాన రాళ్ల మధ్య ఉన్న మట్టి, ఊట నీటితో కలిసి కిందకు జారి, పైభాగాలు కుప్పకూలుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే జంట సొరంగాలు పూర్తిగా మూసుకుపోయి, వాటిని మళ్లీ తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనికి అదనపు వ్యయం చేయాల్సి ఉంటుంది.

వీటి ఉపయోగం ఏంటి?

ఈ సొరంగాల సాయంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్మించిన కుడి కాలువ నుంచి కృష్ణా, ఉమ్మడి పశ్చిమ గోదావరి, రాయలసీమకు 80 టీఎంసీల జలాలతో 7 లక్షల ఎకరాలకు సాగునీరు, 540 గ్రామాల్లో 28 లక్షల మందికి తాగునీరు అందుతాయి. పోలవరం ప్రాజెక్టు కుడివైపున తోటగొంది, మామిడిగొంది

మిగతా 12వ పేజీలో...

41.15 మీటర్ల ఎత్తు ప్రతిపాదన జగన్‌దే!



- 2021లో పంపితే నిరుడు ఆమోదించాం
- పోలవరం కాంటూరుపై తేల్చిచెప్పిన కేంద్ర జలశక్తి శాఖ

12

అబద్ధాల్లో తగ్గేదేలే

ఫీజులపై జగన్ పచ్చి అబద్ధాలు



- 2023-24లో మూడు క్వార్టర్లు పెండింగ్
- ఒక్క క్వార్టరే బకాయి అని అసత్యాలు
- క్వార్టర్ ముగిసిన వెంటనే విడుదల చేశారట
- అలాగైతే తల్లిదండ్రులు ఎందుకు కట్టారు?
- ఒక్కసారీ సకాలంలో విడుదలకాని ఫీజులు
- బకాయిల కారణంగానే సర్టిఫికెట్ల నిలిపివేత

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజుల చెల్లింపు విషయంలో సీఎంగా ఉన్నప్పుడు జగన్ ఎలాంటి అబద్ధాలు చెప్పారో, ఇప్పుడు కూడా అచ్చం అవే చెబుతున్నారు. తన హయాంలో ఫీజులు పెండింగ్ పెట్టిన విషయాన్ని అంగీకరించకుండా మొత్తం ఇచ్చేసినట్లుగా కలరింగ్ ఇస్తున్నారు. తాను సీఎంగా ఉన్నప్పుడు విద్యాసంవత్సరంలో క్వార్టర్ ముగియగానే విద్యార్థులకు ఫీజులు విడుదల చేశానని చెప్పుకొచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్ ఆదివారం 'ఎక్స్'లో ఓ ట్వీట్ చేశారు. గత ప్రభుత్వంలో ఫీజులు విడుదల కాక సొంత డబ్బులు కట్టామని విద్యార్థులు, తల్లిదండ్రులు గగ్గోలు పెడుతుంటే జగన్ మాత్రం తాను ఒక్క రూపాయి పెండింగ్ పెట్టలేదని, ఉన్న మొత్తం బకాయిలు కూటమి ప్రభుత్వానివేనని చెప్పుకొచ్చారు. అయితే, ఇక్కడే జగన్ అడ్డంగా దొరికిపోయారు. ఇంకా 6 నెలలు కూడా పూర్తికాని కూటమి ప్రభుత్వంలో రూ.2,800 కోట్ల మేర ఫీజుల బకాయిలు ఎలా ఏర్పడతాయనే విషయాన్ని మరిచి ఆయన వితండ వాదనకు దిగారు. ఫీజులు విడుదల చేయకపోవడంతో సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు జగన్ వాదన విని అవాక్కవుతున్నారు. నిజంగా సకాలంలో ఫీజులు విడుదల చేసి ఉంటే సర్టిఫికెట్ల కోసం కాలేజీల చుట్టూ ఎందుకు తిరుగుతామని

మిగతా 11వ పేజీలో...



2

మలేరియాకు దోమకాటే మందు!

- మలేరియా కారక పరాన్నజీవుల్లో జన్యు మార్పిడి
- వాటిని దోమల శరీరాల్లోకి ప్రవేశపెట్టి ప్రయోగాలు
- అవి కుట్టినవారి శరీరంలో యాంటీబాడీల ఉత్పత్తి
- లండన్ శాస్త్రవేత్తల ప్రయోగాలు సఫలం

ఇన్సులిన్ ఇంజెక్షన్లకు ఆ మాత్రతో చెల్లు!

- సూక్ష్మ సూదుల అవసరం లేకుండానే..
- కడుపు గోడల్లోకి మందు ప్రవేశపెట్టే గోలీ
- స్క్విడ్ చేపలు కదిలే తీరు ఆధారంగా..
- అభివృద్ధి చేసిన ఎంఐటీ శాస్త్రవేత్తలు 2
- మార్కెట్లోకొస్తే మధుమేహులకు ఊరట

వైద్యులకూ సాఫ్ట్‌వేర్ సిండ్రోమ్!

12

- 45 ఏళ్లకే బీపీ, షుగర్, గుండె జబ్బుల బారిన
- సుప్రసిద్ధ కార్డియాలజిస్ట్ సోమరాజు ఆందోళన

పార్లమెంటు ముందుకు



16 బిల్లులు!

- వీటిలో వక్ఫ్(సవరణ) కూడా..
- జమిలి బిల్లునూ చేర్చే అవకాశం
- నేటి నుంచి శీతాకాల సమావేశాలు
- బీజేపీలో 'మహా' ఉత్సాహం
- కాంగ్రెస్‌కు అదానీ అస్త్రం!
- నిలదీసేందుకు విపక్షాల కసరత్తు
- మణిపూర్‌పై చర్చకు డిమాండ్
- వాయు కాలుష్యం ముప్పైనా..
- అఖిలపక్ష సమావేశానికి 30 పార్టీల నాయకులు హాజరు



అఖిలపక్ష భేటీకి వస్తున్న కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అనుప్రియ, రిజిజు

న్యూఢిల్లీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 16 బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్రం కసరత్తు చేసింది. అందులో వక్ఫ్ (సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ(సవరణ) సహా కీలక బిల్లులు ఉన్నాయి. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో కేంద్రం ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఉభయ సభల్లోని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశమయ్యారు. ఈ భేటీకి రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. ఆ 16 బిల్లులకు

మిగతా 2వ పేజీలో...



ఫడణవీస్, ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్

నేడు కొలువుదీరనున్న 2

'మహా' సర్కారు?

- సీఎం ఎవరనేదానిపై సస్పెన్స్.. ఇద్దరికి ఉప ముఖ్యమంత్రి పదవి
- మంత్రులుగా తొలుత పదిమంది!.. కూటమిలో పదవుల పంపిణీ
- బీజేపీకి 22-24, సేనకు 10-12.. అజిత్ వర్గానికి 8-10!

నేడు కొలువుదీరనున్న 'మహా' సర్కారు?

ముంబై, నవంబరు 24: మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం సోమవారం కొలువుదీరనుంది.! ప్రస్తుత శాసనసభ కాలపరిమితి మంగళవారంతో ముగియనుంది. దాంతో సోమవారమే కొత్త సర్కారును ఏర్పాటు చేయడం అనివార్యమైంది. ముఖ్యమంత్రి, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు, ఆరు లేదా ఏడుగురు మంత్రులు ప్రమాణం చేయవచ్చని తెలుస్తోంది. తదుపరి విస్తరణలో.. బీజేపీకి చెందిన 22-24 మంది ఎమ్మెల్యేలకు చోటుదక్కుతుందని సమాచారం. శిందే వర్గానికి 10-12, అజిత్ వర్గానికి 8-10 మంత్రి పదవులు దక్కుతాయని తెలుస్తోంది.

కౌన్ బనేగా సీఎం?

కొత్త ముఖ్యమంత్రి ఎవరనేదానిపైనా మహాయుతి కూటమిలో చర్చలు, సంప్రదింపులు కొనసాగుతున్నాయి. సొంతంగానే అత్యధిక స్థానాలు సాధించి, అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన బీజేపీ, తమ పార్టీ నాయకుడు, ఇప్పటి వరకు ఉపముఖ్యమంత్రిగా ఉన్న దేవంద్ర ఫడణవీస్ వైపే మొగ్గు చూపుతోంది. అదే సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే పనితీరును బీజేపీ పెద్దలు ప్రశంసిస్తున్నారు. మరోవైపు.. శివసేన(శిందేవర్గం) నాయకులు శిందేకు.. ఎన్సీపీ(అజిత్‌వర్గం) నేతలు అజిత్‌పవార్‌కు సీఎం పదవి ఇవ్వాలని కోరుతున్నారు. అయితే.. సీఎంగా ఎవరిని నియమించాలనేదానిపై సంప్రదింపుల వేదిక ఇప్పుడు ముంబై నుంచి ఢిల్లీకి మారింది. కూటమి అగ్రనేతలు ఢిల్లీకి పయనమయ్యారు. సోమవారం ఉదయానికల్లా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశాలున్నాయి. ఫడణవీస్‌కు న్యాయంగా సీఎం పీఠం దక్కాలని ఆరెస్సెస్ అభిప్రాయపడుతోంది. మహారాష్ట్ర ప్రజలు ఇంత భారీ మెజారిటీని కట్టబెట్టిన నేపథ్యంలో.. బీజేపీ సొంత పార్టీ నేతకే సీఎం పగ్గాలు అప్పగించడం సబబనే సందేశాన్ని పరోక్షంగా బీజేపీ అగ్రనాయకులకు పంపినట్లు విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి. అయితే కులపరమైన సమీకరణలు ఫడణవీస్ అభ్యర్థిత్వానికి ప్రతికూలతలుగా పరిణమించవచ్చని తెలుస్తోంది. మహారాష్ట్రలో ప్రాబల్యం అధికంగా ఉన్న మరాఠాలు తమ వర్గానికే ముఖ్యమంత్రి పదవిని ఇవ్వాలనే డిమాండ్‌ను గట్టిగా వినిపిస్తున్నారు. కాదని.. బీజేపీ అధినాయకత్వం ఫడణవీస్ వైపు మొగ్గుచూపితే.. ఇంతకాలం సీఎంగా ఉన్న శిందే ఆయన వద్ద ఉపముఖ్యమంత్రిగా పనిచేసేందుకు సునాయాసంగా అంగీకరిస్తారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

'మహా' అసెంబ్లీకి 21 మంది మహిళలు

ముంబై, నవంబరు 24: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 21 మంది మహిళా అభ్యర్థులు విజయం సాధించారు. అత్యధికంగా బీజేపీ నుంచి 14 మంది మహిళా అభ్యర్థులు గెలవగా, వీరిలో 10 మంది తిరిగి ఎన్నికయిన వారు కావడం గమనార్హం. శివసేన(ఏక్‌నాథ్ వర్గం) నుంచి ఇద్దరు, ఎన్సీపీ(అజిత్ వర్గం) నుంచి నలుగురు మహిళా అభ్యర్థులు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి ఒక్క మహిళా అభ్యర్థి గెలపొందారు. కాగా, 'మహా' ఎన్నికల్లో ఈసారి చిన్న పార్టీలు ఎంత మాత్రం ప్రభావం చూపలేకపోయాయి. సమాజ్‌వాదీ పార్టీ రెండు సీట్లు, ఏఐఎంఐఎం ఒక సీటు గెలుకోగా, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన, వంచిత్ బహుజన్ అఘాడీ, బీఎస్పీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయాయి.

28న సోరెన్ ప్రమాణ స్వీకారం

రాంచీ, నవంబరు 24: ఝార్ఖండ్ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం నేత హేమంత్ సోరెన్ ఈ నెల 28న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం ఆయన తన కారులో రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ సంతోష్ కుమార్ గాంగ్వార్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కూటమి భాగస్వామ్య పక్షాల మద్దతు లేఖను అందజేశారు. దాంతో ప్రభుత్వ ఏర్పాటుకు సోరెన్‌ను గవర్నర్ ఆహ్వానించారు. అప్పటి వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని కోరారు. ఝార్ఖండ్ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

ఏడు రాష్ట్రాల్లో ప్రతిపక్షం నిల్!

న్యూఢిల్లీ, నవంబరు 24: ఏ రాజకీయ పార్టీకి ప్రతిపక్ష హోదా లేని అసెంబ్లీల జాబితాలో తాజాగా మహారాష్ట్ర చేరింది. ఇప్పటికే ఇలా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, గుజరాత్, మణిపూర్, నాగాలాండ్, సిక్కిం ఉన్నాయి. ఇప్పుడు మహారాష్ట్ర చేరడంతో వీటి సంఖ్య ఏడుకు చేరింది. అసెంబ్లీలో ఒకపార్టీకి ప్రతిపక్ష హోదా దక్కాలంటే ఆ రాష్ట్ర శాసనసభ స్థానాల్లో పది శాతం సీట్లను సంపాదించుకోవాల్సి ఉంటుంది. శనివారం వెలువడిన మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాల్లో.. మహావికాస్ అఘాడీలోని ఏ పార్టీకి ప్రతిపక్ష హోదా దక్కేలా సీట్లు రాలేదు. ఈ కూటమిలోని శివసేన (యూబీటీ)కు 20 సీట్లు, కాంగ్రెస్‌కు 16, ఎన్సీపీ (శరద్ పవార్)కి 10 స్థానాలు వచ్చాయి. అసెంబ్లీలోని మొత్తం 288 సీట్లలో పది శాతం అంటే 29 సీట్లు గెలుచుకోవాల్సి ఉంటుంది.

భారత ఎన్నికల ప్రక్రియపై మస్క్ ప్రశంసలు

వాషింగ్టన్, నవంబరు 24: భారత ఎన్నికల ప్రక్రియపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పొగడ్తలు కురిపించారు. 64 కోట్ల మంది ఓట్లను ఒక్కరోజులో లెక్కించే వేగాన్ని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో నవంబరు 5న జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి కాలిఫోర్నియాలో ఇంకా ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోందని గుర్తు చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో మెయిల్ ద్వారా కూడా ఓటు వేసే అవకాశం ఉండటంతో ఒక్క కాలిఫోర్నియాలోనే లక్షల మంది ఈ విధానం ఎంచుకున్నారు. ఇంకా 3 లక్షల ఓట్లను లెక్కించాల్సి ఉంది. భారత్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అమెరికా జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్‌గా జై భట్టాచార్య!



వాషింగ్టన్, నవంబరు 24: అమెరికా జాతీయ ఆరోగ్య సంస్థ.. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్(ఎన్ఐహెచ్) డైరెక్టర్ పదవి భారతీయ మూలాలున్న జై భట్టాచార్యకు దక్కడం దాదాపుగా ఖాయమైంది. బయో మెడికల్ విభాగంలో అమెరికా చేసే పరిశోధనలన్నీ 50 బిలియన్ డాలర్ల విలువైన ఎన్ఐహెచ్ ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి. ఎన్ఐహెచ్ డైరెక్టర్ పదవి విషయంలో ముగ్గురి పేర్లు ప్రముఖంగా వినిపిస్తుండగా దేశ అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మాత్రం భట్టాచర్యకు మొగ్గు చూపుతున్నారని వాషింగ్టన్ పోస్ట్ ఓ కథనాన్ని ప్రచురించింది. 1968లో కోల్‌కతాలో జన్మించిన జై భట్టాచార్య.. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో ఎండీ, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా, నేషనల్ బ్యూరో ఎకనమిక్ రీసెర్చ్‌లో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేస్తున్నారు.

5 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీలో సాగునీటి సంఘాలకు డిసెంబరు 5 నుంచి ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కొత్త షెడ్యూల్‌ను జలవనరుల శాఖ విడుదల చేసింది. ఇప్పటికే ఈ ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉన్నా.. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వాయిదా పడ్డాయి.

అణువణువునా మహాయుతి

మహారాష్ట్రలోని ప్రతి ప్రాంతంలో అధికార కూటమి ప్రభంజనం

- మరాఠ్వాడా, విదర్భల్లో చాపకింద నీరులా సంఘ్ ప్రచారం
- ఓబీసీలను సంఘటితం చేసిన బీజేపీ
- హిందూ ఓట్లపై సంఘ్ ప్రభావం!



ముంబై, నవంబరు 24: లోక్‌సభ ఎన్నికల్లో పరాభవాన్ని తట్టుకొని నిలబడిన మహాయుతి కూటమి మహారాష్ట్రలోని ప్రతి ప్రాంతంలోనూ తన సత్తా చాటింది. 288 స్థానాల శాసనసభలో ఏకంగా 234 సీట్లు పొందింది. అఘాడీ 49 స్థానాల్లో మాత్రమే గెలవగా.. మిగతా సీట్లు చిన్నాచితకా పార్టీ ఖాతాల్లో చేరాయి. ఇంత భారీ విజయం ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లోనూ తన ఆధిపత్యం ప్రదర్శించింది.

మరాఠ్వాడా..

లోక్‌సభ ఎన్నికల్లో ఈ ప్రాంతంలోని 8 స్థానాలకు గాను మహాయుతి ఒక్కటే గెలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 46 సీట్లలో ఏకంగా 41 చోట్ల గెలిచింది. బీజేపీ ఓబీసీలను సంఘటితం చేయడం.. ఆరెస్సెస్‌కు ఈ ప్రాంతంలో మంచి పరపతి ఉండడం దీనికి ప్రధాన కారణం. మరాఠా రిజర్వేషన్ ఉద్యమ నేత మనోజ్ జరాంగే-పాటిల్ చివరి నిమిషంలో తన అభ్యర్థులను పోటీ నుంచి తప్పించడంతో మహాయుతి విజయానికి మార్గం సుగమమైంది. 20 చోట్ల పోటీచేసిన బీజేపీ 19, శిందే సేన 16కి గాను 13, అజిత్ ఎన్సీపీ 9కి గాను 8 స్థానాల్లో గెలవడం గమనార్హం. లోక్‌సభ ఎన్నికల సమయంలో జారంగే-పాటిల్ మహాయుతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం అఘాడీకి నాడు కలిసి వచ్చింది. మరోవైపు, లాతూర్, ఒస్మానాబాద్, నాందేడ్ జిల్లాల్లో సంఘ్ ప్రాబల్యం బలంగా ఉంది. హిందూ ఓట్లు చీలిపోకుండా చాపకింద నీరులా ప్రచారం చేసింది. రాష్ట్రం నలుమూలల నుంచీ వచ్చిన పలువురు సాధుసంతులు కూడా ఇందులో పాలుపంచుకున్నారు.

విదర్భ..

ఈ ప్రాంతంలో 62 స్థానాలకు గాను మహాయుతి 49 చోట్ల గెలిచింది. ఇందులో బీజేపీ వాటా 39. ఒకప్పుడు ఈ ప్రాంతం కాంగ్రెస్‌కు కంచుకోట. 2019లో 15 చోట్ల గెలిచిన ఈ పార్టీ ఈ సారి ఎనిమిదికే పరిమితమైంది. ఉపముఖ్యమంత్రి, బీజేపీ వ్యూహకర్త దేవేంద్ర ఫడణవీస్ నాగపూర్ నైరుతి స్థానంలో ఘన విజయం సాధించగా.. అఘాడీ సీఎం అభ్యర్థిగా భావించిన పీసీసీ అధ్యక్షుడు నానా పటోలే సకోలీ స్థానంలో కేవలం 208 ఓట్లతో అతికష్టమ్మీద నెగ్గారు.

కొంకణ్ బెల్ట్-ముంబై మెట్రోపాలిటన్..

అఘాడీ ఈ ప్రాంతంలో చావుదెబ్బ తింది. మొత్తం 39 స్థానాలకు గాను మహాయుతి 35 చోట్ల ఘనవిజయం సాధించింది. ఇక్కడ గట్టిపట్టు ఉన్న ఉద్ధవ్ సేన ఒక్క చోట మాత్రమే గెలవడం ఆ పార్టీ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రాంతంలోనూ సంఘ్ ప్రభావం బాగా ఉంది. అంతేగాక శిందే సేన అధిపతి, సీఎం ఏక్‌నాథ్ శిందేకు స్థానికంగా ఎంతో బలం, పలుకుబడి ఉండడం, చీలిక తర్వాత శివసేన కార్యకర్తల్లో అత్యధికులు ఆయనకే మద్దతివ్వడం పాలక కూటమికి కలిసివచ్చింది. పాల్ఘర్ జిల్లాలో మూడు స్థానాలకు గాను మూడు చోట్లా అఘాడీ ఓడిపోయింది.

పశ్చిమ మహారాష్ట్ర..

కాంగ్రెస్, శరద్ పవార్ ఎన్సీపీలకు ఇది పెట్టని కోట. ఈ ప్రాంతంలో 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. మహాయుతి 53 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. అఘాడీ 12 సీట్లకే పరిమితమైంది. ఈ స్థాయిలో ప్రభంజనం ఉంటుందని తాము ఊహించనే లేదని ఉపముఖ్యమంత్రి, అజిత్ ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. ఈ ప్రాంతంలోని కొల్హాపూర్ జిల్లాలో మొత్తం 10 స్థానాల్లోనూ మహాయుతే గెలిచింది.

ఉత్తర మహారాష్ట్ర..

ఈ ప్రాంతం కాంగ్రెస్‌కు కంచుకోట. కానీ ఇక్కడి 47 అసెంబ్లీ స్థానాలకు గాను 44 మహాయుతి కైవసమయ్యాయి. పీసీసీ అగ్ర నేతలు బాలాసాహెబ్ తోరట్ (సంగమనేర్), కేసీ పాడ్వీ (అక్కల్‌కువా) సైతం పరాజయం చవిచూశారు. తోరట్ 1985 నుంచి, పాడ్వీ 1990 నుంచి ఆయా స్థానాల్లో గెలుస్తూ వచ్చారు. ఇక యెవ్‌లా స్థానంలో ఒకప్పటి తన నమ్మినబంటు, అజిత్ ఎన్సీపీకి చెందిన ఛగన్ భుజ్‌బల్‌ను ఓడించడానికి శరద్ పవార్ విశ్వప్రయత్నాలు చేశారు. మరాఠా రిజర్వేషన్ ఉద్యమ నేత జరాంగే పాటిల్ కూడా ఆయన్ను టార్గెట్ చేశారు. అయినా ఈ బీసీ నేత విజయం సాధించారు. శివసేనకు ఒకప్పటి కంచుకోటయిన సింధ్‌దుర్గ్ జిల్లాలో మూడు స్థానాలనూ మహాయుతే గెలుచుకుంది. మరోవైపు, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున సరిగా ప్రచారం చేయలేదని కర్ణాటక హోం మంత్రి, మహారాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకుడు జి.పరమేశ్వర ఆదివారం ఆరోపించారు. మహారాష్ట్రలో కొన్ని చోట్ల ఈవీఎంలు హ్యాక్ అయ్యాయన్నారు.

'మహాయుతి'ని గెలిపించింది మహిళలే



కరాడ్, నవంబరు 24: మహారాష్ట్రలో 'మహాయుతి' కూటమిని గెలిపించింది మహిళలేనని శరద్ పవార్ అన్నారు. మహిళలకు నేరుగా ఆర్థిక సాయం అందించే లడ్కీ బహిన్ పథకం, పెద్ద సంఖ్యలో మహిళలు ఓటింగ్‌లో పాల్గొనడం వల్లనే బీజేపీ కూటమి విజయం సాధించిందని అభిప్రాయపడ్డారు. మతపరమైన విభజన కూడా కొంత కారణమని చెప్పారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి దారుణ ఫలితాలు ఎన్నడూ చూడలేదని అన్నారు. ఆదివారం కరాడ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ కూటమి బాగా కష్టపడిందని, ఫలితాలు మాత్రం భిన్నంగా వచ్చాయని చెప్పారు. దీనిపై పార్టీలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈవీఎంల కారణంగానే ఓడిపోయినట్టు వస్తున్న విమర్శలపై స్పందిస్తూ అధికారిక సమాచారం లేకుండా దీనిపై మాట్లాడబోనని అన్నారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి విరమిస్తారా అన్న ప్రశ్నకు జవాబిస్తూ దీనిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కొత్త నాయకత్వాన్ని తయారు చేసి ప్రజల ముందుకు వెళ్తామని అన్నారు.

మా పరాజయానికి మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ కారణం



ముంబై, నవంబరు24: మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ పరాజయానికి మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ కారణమని శివసేన(యూబీటీ) నేత సంజయ్‌రౌత్ ఆరోపించారు. 2022లో తిరుగుబాటు చేసిన శివసేన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన పిటిషన్‌లపై జస్టిస్ చంద్రచూడ్ వెంటనే నిర్ణయించలేదని రౌత్ ఆరోపించారు. దీనివల్ల పార్టీ ఫిరాయింపుదారుల్లో చట్టం అంటే భయం లేకుండా పోయిందన్నారు. చంద్రచూడ్ పేరు చరిత్రలో నల్ల అక్షరాలతో లిఖిస్తారని రౌత్ చెప్పారు. 2022లో శివసేనలో తిరుగుబాటు జరిగి ఏక్‌నాథ్ శిందే సారథ్యంలో మెజార్టీ ఎమ్మెల్యేలు వేరుకుంపటి పెట్టారు. బీజేపీతో చేతులు కలిపి మహారాష్ట్రలో అధికారం చేపట్టారు. శిందే సీఎం కూడా అయ్యారు. శిందేదే అసలైన శివసేన అని ఈసీ కూడా ప్రకటించింది.

లోకం తీరు



జీపీఎస్‌ను నమ్ముకుని ముగ్గురి మృత్యువాత!

బరేలీ(యూపీ), నవంబరు 24: ఉత్తర్‌ప్రదేశ్‌లో జీపీఎస్ నావిగేషన్ సాయంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అసంపూర్తిగా ఉన్న వంతెనపై నుంచి పడి మృత్యువాత పడ్డారు. బరేలీ, బూదాన్ జిల్లాల మధ్య శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. బాధితులు దాతాగంజ్ నుంచి ఫరీద్‌పూర్ ప్రయాణించేందుకు నావిగేషన్ మ్యాప్‌ను ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. వంతెన అసంపూర్తిగా ఉన్న విషయం తెలియకపోవడం, కారు వేగంగా ప్రయాణిస్తుండడంతో అదుపు కాక 25 అడుగుల ఎత్తు నుంచి రామ్‌గంగా నదిలో నీళ్లు లేని చోట గుంతలో పడిందని తెలిపారు. మృతులు మెయిన్‌పురికి చెందిన కౌశల్ కుమార్, ఫరూఖాబాద్‌కు చెందిన వివేక్ కుమార్, అమిత్ కుమార్‌లుగా గుర్తించారు. 2022లో వచ్చిన వరదలకు ఈ వంతెనలో సగభాగం కొట్టుకుపోయింది. ఈ విషయం జీపీఎస్‌లో అప్‌డేట్ కాలేదు.

ఏఆర్ రెహ్మాన్‌పై దుష్ప్రచారం వద్దు

- తమిళ మీడియాకు సైరాభాను వినతి

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ రెహ్మాన్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలని ఆయన సతీమణి సైరాబాను తమిళ మీడియా, యూట్యూబర్లను కోరారు. ఈ మేరకు ఆదివారం ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. 2నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న తాను చికిత్స నిమిత్తం ప్రస్తుతం ముంబైలో ఉన్నానని ఆమె వెల్లడించారు. ఏఆర్ రెహ్మాన్‌కు ఉన్న విపరీతమైన పని ఒత్తిడి వల్లే తాను ఆయనకు దూరంగా వెళ్లినట్టు వివరించారు. అద్భుతమైన వ్యక్తి, మానవతావాది అయిన రెహ్మాన్‌పై తమిళ మీడియా, యూట్యూబర్లు తప్పుడు ఆరోపణలు, విమర్శలు చేయడం సరికాదని అన్నారు. రెహ్మాన్‌ను ప్రాణం కంటే మిన్నగా విశ్వసిస్తున్నానని, ఆరాధిస్తున్నానని తెలిపారు.

జామా మసీదు సర్వేలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జామా మసీదు కమిటీ, సంభాల్ జిల్లా కలెక్టర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. జామా మసీదు కమిటీ 1991 నాటి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను, చట్టాన్ని ఉటంకిస్తూ.. 1947 నుంచి ప్రార్థన మందిరాలు ఎలా ఉన్నాయో.. అలాగే ఉంచాలనే ఆదేశాలున్నాయంటూ వాదనలను వినిపించింది. వాదోపవాదాలు, పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు.. మంగళవారం అడ్వొకేట్ కమిషనర్ సమక్షంలో మసీదు సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో.. జిల్లా యంత్రాంగం శనివారం నుంచే సర్వేకు ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం 7 గంటల తర్వాత అధికారులు ఆ మసీదు వద్దే సర్వే ప్రారంభించారు. ఈలోగా సర్వేను నిలిపివేయాలని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ పలువురు ఆందోళనకారులు మసీదు వెలుపల గుమికూడారు. అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించగా.. ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. అక్కడే ఉన్న వాహనాలకు నిప్పుపెట్టారు. "దుండగులు ఎయిర్ పిస్టళ్లతో కాల్పులు జరిపారు. రాళ్లదాడిలోనూ మరికొందరు పోలీసులు గాయపడ్డారు. మొత్తం 30 మంది పోలీసులకు గాయాలయ్యాయి" అని సంభాల్ ఎస్పీ కృష్ణకుమార్ విష్ణోయ్ వెల్లడించారు. పోలీసులు లాఠీచార్జ్ చేసి, బాష్పవాయు గోళాలను, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించారని చెప్పారు. ఈ ఘటనల్లో ముగ్గురు ఆందోళనకారులు చనిపోయారని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు మహిళలు సహా.. 10 మంది ఆందోళనకారులను అరెస్టు చేశారు. కాగా, ఈ ఘటనను ఎస్పీ చీఫ్ అఖిలేశ్ ఖండించారు. సర్వేను ఆయన తప్పుబట్టారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి కుతంత్రాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

పార్లమెంటు ముందుకు 16 బిల్లులు!



(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన వివరాలను అన్ని పార్టీల నేతలకు అందించారు. అయితే, మరికొన్ని బిల్లులను కూడా ప్రవేశపెట్టాలని కొందరు సభ్యులు కోరినట్టు తెలిసింది. అలాగే, కేంద్రం మరికొన్ని బిల్లులను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మహారాష్ట్ర ఎన్నికల్లో గెలుపుతో జోష్‌లో ఉన్న ఎన్డీయే జమిలి ఎన్నికలపైనా కసరత్తు చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే, ఈ సమావేశాల్లోనే ఆ బిల్లు పెడతారా? లేదా తదుపరి సమావేశాల వరకు నిరీక్షిస్తారా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అఖిలపక్ష సమావేశానికి 30 రాజకీయ పార్టీలకు చెందిన 42 మంది నేతలు హాజరయ్యారు. డిసెంబరు 20వ తేదీ వరకు సమావేశాలు జరగనున్నాయి. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 26న పార్లమెంటు సమావేశాలు జరగవని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఆ రోజున పాత పార్లమెంట్ భవనంలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.

శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని భావిస్తున్న బిల్లులు ఇవీ..

భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లు, విపత్తు నిర్వహణ(సవరణ) బిల్లు, గోవా అసెంబ్లీలో షెడ్యూల్ తెగల ప్రాతినిధ్య పునర్నిర్మాణం బిల్లు, ది బిల్స్ ఆఫ్ లాడింగ్ బిల్లు, ది క్యారేజ్ ఆఫ్ గూడ్స్ బై సీ బిల్లు, రైల్వే(సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాల(సవరణ) బిల్లు, ముసల్మాన్ వక్ఫ్(రద్దు) బిల్లు, వక్ఫ్(సవరణ) బిల్లు, చమురు క్షేత్రాల(నియంత్రణ, అభివృద్ధి) సవరణ బిల్లు, బాయిలర్స్ బిల్లు, రాష్ట్రీయ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు, పంజాబ్ కోర్టుల(సవరణ) బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ఇండియన్ పోర్ట్స్ బిల్లు.

కాంగ్రెస్‌కు 'అదానీ' అస్త్రం...

అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించాలని కాంగ్రెస్ సహా విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అదానీ లంచాలపై అమెరికాలో కేసు నమోదు చేయడం విపక్షాలకు అస్త్రంగా మారింది. అలాగే మణిపూర్ హింస, ప్రాణాంతకంగా మారిన వాయు కాలుష్యం తదితర అంశాలపై అధికార పార్టీని ఇరుకున పెట్టాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. అఖిలపక్ష సమావేశంలోనూ అదానీ వ్యవహారంపై చర్చ జరగాలని కోరినట్టు కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ మీడియాకు తెలిపారు. మహారాష్ట్ర ఎన్నికలపైనా పార్లమెంట్‌లో చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఆరోపించారు.

బీజేపీ మరింత దూకుడే...

దేశంలోనే మినీ ఇండియా పోరుగా పిలిచిన మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ విజయాన్ని నమోదు చేసుకోవడం పార్లమెంట్ సమావేశాల ముందు బీజేపీలో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఇటీవలే హర్యానా గెలుపు, ఇప్పుడు మహారాష్ట్ర విజయం బీజేపీకి తిరుగులేని ఉత్సాహాన్ని ఇచ్చాయి. దీంతో పార్లమెంట్ సమావేశాల్లో బీజేపీ మరింత దూకుడును ప్రదర్శించే అవకాశం ఉంది. ప్రధాని మోదీ నేతృత్వంలో మరిన్ని కొత్త నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది. జమిలి ఎన్నికలపైనా ఉభయ సభల్లో చర్చ జరగనుందని సమాచారం. కాగా, వక్ఫ్ బిల్లుపై పార్లమెంట్ సంయుక్త కమిటీ ఈ నెల 29న తన నివేదికను సమర్పించే అవకాశం ఉంది. కమిటీలోని విపక్ష సభ్యులు తమకు మరికొంత సమయం కావాలని అడిగే అవకాశం ఉంది.

రాజ్యాంగానికి 75 ఏళ్లు

రేపు పాత పార్లమెంట్ భవనంలో వేడుక

న్యూఢిల్లీ, నవంబరు 24: భారత రాజ్యాంగాన్ని ఆమోదించి మంగళవారానికి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక వేడుకను నిర్వహించనున్నట్లు మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. పాత పార్లమెంట్(సంవిధాన్ సదన్) భవనంలోని సెంట్రల్ హాల్‌లో జరగనున్న ఈ వేడుకకు రాష్ట్రపతి ముర్ము, ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్మారక నాణం, పోస్టల్ స్టాంప్‌తో పాటు 'మేకింగ్ ఆఫ్ ది కాన్‌స్టిట్యూషన్: ఏ గ్లింప్స్', 'మేకింగ్ ఆఫ్ ది కాన్‌స్టిట్యూషన్ అండ్ ఇట్స్ గ్లోరియెస్ జర్నీ' అనే రెండు పుస్తకాలను విడుదల చేయనున్నారు. కాగా, 1949 నవంబరు 26న భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించింది.

మలేరియాకు దోమకాటే మందు!



లండన్: దోమ కుడితే మలేరియా వస్తుంది! ఇది మనందరికీ తెలిసిందే!! అదే మలేరియాకు చెక్ పెట్టే టీకాను దోమ కాటు ద్వారా ఇస్తే? 'లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్' శాస్త్రజ్ఞులకు వచ్చిన వినూత్న ఆలోచన ఇది! అనాఫిలిస్ దోమ కుట్టినప్పుడు దాని శరీరంలోని "ప్లాస్మోడియం ఫాల్సిపారం" అనే మలేరియా కారక పరాన్నభుక్కులు మన శరీరంలోకి ప్రవేశించి నేరుగా కాలేయంలోకి ప్రవేశించి, ఎర్ర రక్త కణాల్లో ఇన్ఫెక్షన్‌ను కలుగజేస్తాయి. దానివల్ల మనకు బాగా జ్వరం వస్తుంది. దీన్నే మలేరియా అంటారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా 25 కోట్ల మందికిపైగా ఈ రకంగా మలేరియా బారిన పడుతున్నారు. ఎలాగూ ఆ జీవులు దోమకాటు ద్వారానే మనుషుల్లోకి ప్రవేశిస్తున్నాయి కాబట్టి.. ఆ పరాన్నజీవుల జన్యువుల్లో మార్పులు చేసి, వాటిని బలహీనపరిచి, అదే దోమ కాట్ల ద్వారా వాటిని వ్యాపింపజేస్తే మనుషుల్లో మలేరియాకు రోగనిరోధకత పెరుగుతుందని లండన్ శాస్త్రజ్ఞులు భావించారు. తమ ఆలోచనను ఆచరణలో పెట్టి ప్రయోగాలు కూడా నిర్వహించారు. ఆ ట్రయల్స్‌లో పాల్గొన్న 90 శాతం మంది.. నిజంగా మలేరియా కారక పరాన్ని జీవి బారిన పడినా జ్వరం రాలేదు. ఈ నేపథ్యంలో.. మలేరియా టీకా అభివృద్ధి దిశగా ఈ ట్రయల్ పెద్ద ముందడుగు అని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ ఇమ్యూనాలజిస్ట్ జూలియస్ హఫల్లా తెలిపారు. ఈ అధ్యయన ఫలితం 'ద న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' తాజా సంచికలో ప్రచురితమైంది. ప్రస్తుతానికి రెండు మలేరియా టీకాలు మనకు అందుబాటులో ఉన్నప్పటికీ వాటి ప్రభావం 75 శాతమే. ఆ టీకాలు కూడా ఒక్క డోసు వేయించుకుంటే చాలదు. బూస్టర్ డోసులు వేయించుకోవాల్సి ఉంటుంది. అందుకే శాస్త్రవేత్తలు వాటికి ప్రత్యామ్నాయంగా కొత్త టీకాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా లండన్ శాస్త్రజ్ఞులు మలేరియా పరాన్నజీవుల్లో రెండు రకాల జన్యుమార్పులు చేశారు. మొదటి రకం జీఏ1 కాగా.. రెండో రకం జీఏ2. వీటిలో మొదటి రకం పరాన్నజీవులు మనిషి కాలేయంలోకి ప్రవేశించిన తర్వాత దాదాపు 24 గంటల దాకా తమ సంఖ్యను పెంచుకోలేవు. రెండో రకం (జీఏ2) జీవులు కాలేయంలోకి ప్రవేశించిన ఆరు రోజుల దాకా అలాగే అచేతనంగా ఉండిపోతాయి తప్ప తమ సంఖ్యను పెంచుకోలేవు. ఆరు రోజులంటే.. వాటిపై దాడి చేసి చంపేయడానికి మన రోగ నిరోధక వ్యవస్థకు బోలెడంత సమయం దొరికినట్టు!! ట్రయల్‌లో భాగంగా 10 మందిని జీఏ1 రకం పరాన్నజీవి ఉన్న దోమతో కుట్టించారు. మరో 10 మందిని.. జీఏ2 రకం పరాన్నజీవి ఉన్న దోమతో కుట్టించారు. మూడువారాల తర్వాత.. వారికి పరీక్షలు చేయగా రెండు బృందాలవారిలోనూ మలేరియా యాంటీబాడీలు ఉన్నట్టు వెల్లడైంది. ఆ తర్వాత వారిని.. నిజమైన మలేరియా కారక జీవులను మోస్తున్న అనాఫిలిస్ దోమలతో కుట్టించారు. మొదటి బృందంలో తొమ్మిది మంది మలేరియా బారిన పడగా.. రెండో బృందంలో ఒక్కరు మాత్రమే పడ్డారు.

మాత్రతో ఇన్సులిన్ ఇంజెక్షన్లకు చెల్లు!

సూక్ష్మ సూదుల అవసరం లేకుండానే కడుపు గోడల్లోకి మందు ప్రవేశపెట్టే గోలీ

- స్క్విడ్ చేపలు కదిలే తీరు ఆధారంగా అభివృద్ధి చేసిన ఎంఐటీ శాస్త్రవేత్తలు

న్యూయార్క్: సముద్రంలో స్క్విడ్ చేప కదిలే విధానాన్ని ఎప్పుడైనా గమనించారా? అది ప్రమాద సమయంలో చాలా వేగంగా వెళ్తుంది. అందుకు అది వాడే టెక్నిక్.. జెట్ ప్రొపల్షన్. అది తన శరీరపు పైపొర ద్వారా నీటిని లోపలికి పీల్చుకుని.. కడుపు పైభాగంలో ఉండే ఒక నాళం ద్వారా బయటికి వేగంగా వదులుతుంది. ఆ క్రమంలో పుట్టే శక్తి ద్వారా వేగంగా ముందుకు కదులుతుంది. ఇదే టెక్నిక్ ఆధారంగా సూక్ష్మ సూదుల అవసరం లేకుండానే మన కడుపులోకి, పేగుల్లోకి ఔషధాన్ని ప్రవేశపెట్టగలిగే గుళికలను (క్యాప్సూల్) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. ట్రయల్స్ పూర్తయి ఈ క్యాప్సూల్స్ అందుబాటులోకి వస్తే నిత్యం పొట్ట భాగంలో ఇన్సులిన్ ఇంజెక్షన్లు చేసుకోవాల్సిన మధుమేహ బాధితులు, అదే రీతిలో నిత్యం ఇంజెక్షన్లు చేసుకోవాల్సినవారికి ఎంతో ఉపయోగపడతాయి. నిజానికి ఇలా ఇన్సులిన్ తరహా ఔషధాలను నోటి ద్వారా తీసుకున్నప్పుడు.. ఔషధం మన ఆహారనాళం గుండా కడుపులోకి చేరి పనిచేసేలోగా చాలా రసాయనిక మార్పులకు గురవుతుంది. అందుకే వాటిని తప్పనిసరిగా ఇంజెక్షన్ రూపంలోనే ఇస్తారు. అలా కాకుండా వాటిని కూడా నోటి ద్వారా తీసుకునే వీలు కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు చాలాకాలంగా కృషి చేస్తున్నారు. ఆ క్రమంలో వారికి తోచిన ఆలోచన.. జీర్ణ రసాలకు ప్రభావితం కాని విధంగా ఔషధాన్ని గుళికల్లో ఉంచి, వాటిని నోటి ద్వారా శరీరంలోకి పంపి.. ఆ క్యాప్సూల్స్‌కు ఉన్న అతి సన్నని సూదుల ద్వారా మందు విడుదల చేసేలా చూడడం. ఆ సూదులు కడుపు గోడల్లోకి చొచ్చుకుపోయి మందును విడుదల చేస్తాయి. అంటే.. బయటి నుంచి ఇంజెక్షన్ చేయడానికి బదులుగా కడుపులోపల ఇంజెక్షన్ చేయడమన్నమాట. అలా కడుపు లోపల సైతం సూదులు ఉపయోగించకుండానే మందును మన కడుపు గోడల్లోకి విడుదల చేయడానికే ఎంఐటీ శాస్త్రజ్ఞులు స్క్విడ్‌ల గమన విధానాన్ని అధ్యయనం చేశారు. దాని ఆధారంగా వారు రెండు రకాల క్యాప్సూల్స్ రూపొందించారు. వాటిలో ఎలాంటి సూక్ష్మ సూదులూ ఉండవు. అవి మందును ఒక ధారలాగా కడుపు గోడల్లోకి చొచ్చుకుపోయేంత వేగంగా స్ప్రే చేస్తాయి. ఈ రెండు క్యాప్సూల్స్‌లో ఒకటి బ్లూబెర్రీ ఆకారంలో ఉంటే, మరొకటి ట్యూబ్ ఆకారంలో ఉంటుంది. ప్రయోగాల్లో భాగంగా ఎంఐటీ శాస్త్రజ్ఞులు ఈ క్యాప్సూల్స్ ద్వారా పందులు, కుక్కల కడుపు భాగంలోకి ఇన్సులిన్‌ను, జన్యు చికిత్సలో భాగంగా కొన్ని రకాల ఆర్ఎన్ఏలను విజయవంతంగా ప్రవేశపెట్టగలిగారు. మనుషులపై పరీక్షలు విజయవంతమై ఈ క్యాప్సూల్స్ మార్కెట్లోకి వస్తే మధుమేహ బాధితులకు ఇంజెక్షన్ల బెడద తప్పిపోతుంది!!



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

రాయలసీమ ద్రోహి జగన్: మంత్రి సవిత

ఎమ్మిగనూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఒక్క చాన్స్ పేరుతో ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన జగన్ రాయలసీమకు చేసిందేమీ లేదని, చివరకు ఆయన రాయలసీమ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోయారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించిన భక్త కనకదాస జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సవిత మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.39 వేల కోట్లు కేటాయించిందన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, అనంతపురం జిల్లా రాయదుర్గం, పామిడిలో టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. కురుబ సామాజిక వర్గం ఐక్యంగాఉండి రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు.

టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం

గుంతకల్లుటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం లభించిందని మంత్రి సవిత అన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలో భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం గుంతకల్లప్ప కల్యాణ మండపంలో కురుబల ఆత్మీయ సమ్మేళనాన్ని మంత్రి జ్యోతి వెలిగించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం నుంచి కురుబల రాజకీయ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎన్నికల్లో రెండు ఎంపీ, ఒక ఎమ్మెల్యే టికెట్‌తో పాటు మంత్రి వర్గంలో స్థానం కల్పించారన్నారు.

ఆర్యవైశ్యులకు సంపూర్ణ మద్దతు: మంత్రి భరత్



సభలో ప్రసంగిస్తున్న మంత్రి టీజీ భరత్

అనంతపురం కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలని, రాజకీయాల్లోకి వచ్చే ఆర్యవైశ్యులకు సంపూర్ణ మద్దతు ఇస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. అనంతపురంలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన సంఘం ప్రమాణ స్వీకారోత్సవ సభకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కూడా అయిన టీజీ భరత్ హాజరై, ప్రసంగించారు. అనంతపురం జిల్లా పారిశ్రామికాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జిల్లాలో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కేంద్రం ఏర్పాటు చేసి, దాదాపు 2వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, యువజన సంఘం అధ్యక్షుడు శబరి వరప్రసాద్ పాల్గొన్నారు.

'అమృత్ సరోవర్'ల వద్ద రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- అధికారులకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని అమృత్ సరోవర్ ప్రదేశాల్లో (నీటి కుంటలు) ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఆ మేరకు అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని డ్వామా అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది. సంబంధిత అమృత్ సరోవర్ వినియోగ గ్రూపులు, అధికారులు, ప్రజలను నవంబరు 26న ఉదయం 11 గంటలకు జరిగే రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించి, రాజ్యాంగ పీఠిక చదివి వినిపించాలని సూచించింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపింది.

రైతు బిడ్డగా పుట్టడమే శాపమా?

వ్యవసాయాన్ని ప్రోత్సహించకుంటే భవిష్యత్తు అంధకారమే

- ఉద్యోగస్తులకే కాదు.. యువ రైతులకూ ఆడపిల్లలను ఇవ్వాలి
- అన్నదాతల సమస్యలపై పవన్‌ను కలిసేందుకు ఎడ్లబండిపై యాత్ర

హిందూపురం/గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'రైతే దేశానికి వెన్నెముక అంటారు. అలాంటి రైతును ఆదుకోకపోతే భవిష్యత్తు అంధకారం అవుతుంది' అని యువ రైతు నవీన్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం శాసనకోట గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ తండ్రి సుధాకర్ రెడ్డి కొంతకాలం క్రితం మృతిచెందారు. 10వ తరగతి చదువుకున్న నవీన్‌రెడ్డి ఎకరంన్నర పొలంలో సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రైతుల సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విన్నవించాలన్న సంకల్పంతో ఈ నెల 18న ఎడ్లబండిపై శాసనకోట నుంచి అమరావతికి బయల్దేరారు. 'ఫార్మర్ ట్రావెల్-77' యాత్ర పేరుతో రోజూ 20-30 కి.మీ. ప్రయాణిస్తూ మార్గమధ్యలో రైతు సమస్యలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. శుక్రవారం సాయంత్రానికి ఆయన అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ఎగువపల్లికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రైతులందరూ తమ పిల్లలను చదివించి, ఉద్యోగాలకు పంపితే భవిష్యత్తులో పంటలు పండించేది ఎవరని ప్రశ్నించారు. తిండి కోసం యుద్ధం చేయాల్సిన రోజులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాడి ద్వారా బతుకుదామనుకున్నా.. రైతుకు కష్టాలు తప్పట్లేదన్నారు. ప్రైవేటు డెయిరీలు అధికంగా ఉన్నాయనీ, రైతులు పాలు పోస్తే లీటరుకు రూ.27 ఇస్తారని, అదే దుకాణాల్లో లీటరు పాల ప్యాకెట్ రూ.70 వరకు అమ్ముతున్నారని అన్నారు. రైతు జీవనం దుర్భరంగా మారిందని, కనీసం రైతు బిడ్డలకు ఆడపిల్లలను ఇచ్చే పరిస్థితి లేదని వాపోయారు. చాలా మంది వ్యవసాయం చేస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, ఉద్యోగాలకు పంపుతున్నారన్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చినట్లు సబ్సిడీలు రైతులకు ఎందుకు ఇవ్వకూడదని అన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటే ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటారని నిలదీశారు. వ్యవసాయంలో నష్టంతో ఎంతో మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే.. అనేక మంది వలస వెళ్తూ కూలీలుగా బతుకీడుస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి వరకు ఎడ్లబండిపై వెళ్లి.. పవన్ కల్యాణ్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తానని నవీన్‌కుమార్ పేర్కొన్నారు.



ఎడ్లబండి యాత్ర చేపట్టిన యువ రైతు నవీన్‌కుమార్ రెడ్డి

'ఉపాధి' అవినీతిలో రికవరీ నిల్



- 2021-22లో అవకతవకలకు సంబంధించి ఒక్కపైసా కూడా వెనక్కి రాని వైనం
- పట్టణాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ నిర్వీర్యం
- పేరుకుపోయిన 85 లక్షల టన్నుల చెత్త
- స్థానిక సంస్థలకు సంబంధించి కాగ్ నివేదిక వెల్లడి

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో సోషల్ ఆడిట్ విభాగం తనిఖీల తర్వాత గుర్తించిన అవకతవకలపై విజిలెన్స్ విభాగం సరిగా స్పందించలేదని కాగ్ తప్పుపట్టింది. 2021-22లో ఉపాధి పథకంలో రూ.232 కోట్ల మేర తేడాలొచ్చినట్లు తేలింది. మండల సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్‌లో కూడా రూ.89 కోట్లు అవినీతిపరుల జేబుల్లోకి వెళ్లాయని నిర్ధారణ అయింది. అయితే 2023 ఆగస్టు వరకు ఒక్క పైసా కూడా రికవరీ చేయలేదని అధికారులు పేర్కొన్నట్లు స్థానిక సంస్థలకు సంబంధించి కాగ్ ఆడిట్ నివేదికలో వెల్లడించింది. దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో అవినీతి నియంత్రణ చేయాల్సిన సంస్థలు ఎలా నిర్వీర్యం అయ్యాయో కాగ్ నివేదికతో వెల్లడైంది. మరోవైపు పట్టణాల్లో ఘన వ్యర్థాల నిర్వహణపై 2018లో రాష్ట్ర విధానం రూపొందించారు. మొత్తం 17 పట్టణ స్థానిక సంస్థలను పరిశీలిస్తే, 2022 డిసెంబరు నాటికి అందులో కేవలం ఐదింటికి మాత్రమే విధి విధానాలు రూపొందించారని కాగ్ పేర్కొంది. ఐదు పట్టణాల్లో మాత్రమే ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్లు కాలుష్య నియంత్రణ మండలి అనుమతి పొందాయని తెలిపింది. ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్‌ల కార్యకలాపాల కోసం 2022 నవంబరు వరకు రాష్ట్ర వాటా కింద రూ.42.53 కోట్లను ఆయా పట్టణ స్థానిక సంస్థలకు విడుదల చేయలేదు.

చెత్తను వేరు చేయడంలో లోపించిన చిత్తశుద్ధి

పట్టణాల్లో కాగ్ ఆడిట్ తనిఖీ చేసిన చోట నూరు శాతం వ్యర్థాలను వేరు చేయాల్సి ఉంటే, కేవలం 75 శాతం మాత్రమే జరిగిందని తేలింది. ఇళ్లల్లో ఉన్న చెత్తను వేరు చేయడంలో రాజమహేంద్రవరం, విజయవాడ కార్పొరేషన్లలో తప్ప మిగతా తనిఖీ చేసిన పట్టణాల్లో జరగలేదని పేర్కొంది. చాలా చోట్ల వేరుచేసిన చెత్తను సైతం రవాణా చేసే క్రమంలో కలిపి తరలించారని స్పష్టం చేసింది. జంగారెడ్డిగూడెం, భీమవరంలో నిబంధనలకు విరుద్ధంగా డంపింగ్ వ్యర్థాలను నీటి వనరులకు దగ్గరలో ఏర్పాటు చేశారని తెలిపింది. ఒంగోలు, తెనాలి మున్సిపాలిటీల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తగులబెట్టడాన్ని కాగ్ గమనించింది. 85.89 లక్షల టన్నుల చెత్తను తరలించే పనులు ఇంకా ప్రారంభం కాలేదని కాగ్ పేర్కొంది. రూ.30 లక్షలు పెట్టి చెత్తను వేరు చేసే మెషిన్‌ను రాజమహేంద్రవరం పట్టణ స్థానిక సంస్థ కొనుగోలు చేసినప్పటికీ, దానిని ఉపయోగించకపోవడంతో నిర్వీర్యమైపోయింది. ఎయిర్‌పోర్టులకు 20 కి.మీ దూరంలో మాత్రమే డంపింగ్ యార్డులు ఉండాలని ఘన వ్యర్థాల నిర్వహణ పాలసీ పేర్కొంటోందని, అయితే రాజమహేంద్రవరం, పుట్టపర్తిలలో డంపింగ్ యార్డ్‌లు 11.9, 10 కి.మీలు దూరంలో మాత్రమే ఉన్నాయని, ఆయా స్థానిక సంస్థలు సివిల్ ఏవియేషన్ అథారిటీ నుంచి ఎన్‌ఓసీ కూడా తీసుకోలేదని కాగ్ పేర్కొంది. డంపింగ్ యార్డులన్నింటినీ ఉపయోగంలోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఘన వ్యర్థాల నిర్వహణ తనిఖీలు తరచూ నిర్వహించాలని సూచించింది.

లేని జీఎస్టీ వసూలు చేసిన ఆప్కోస్

చెత్తరహిత పట్టణాలకు సంబంధించి '7 స్టార్స్' పొందిన పట్టణం ఒక్కటి కూడా లేదని, మొత్తం 123 పట్టణ స్థానికసంస్థల్లో కేవలం ఏడు మాత్రమే స్టార్ సర్టిఫికేషన్ పొందాయని తెలిపింది. చెత్త పన్ను వసూళ్లు కూడా అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఒకే మాదిరిగా లేవని పేర్కొంది. విజయవాడ కార్పొరేషన్ తప్ప ఎక్కడా వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారం లేదని తెలిపింది. రాష్ట్రస్థాయి సలహా బోర్డు మార్చి 2022 నాటికి తొమ్మిది సమావేశాలు నిర్వహించాల్సి ఉంటే ఒక్క సమావేశం మాత్రమే నిర్వహించింది. భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసే విషయంలో 9 పట్టణ స్థానిక సంస్థల్లో నిబంధనలను తుంగలో తొక్కి రూ.8.26 కోట్లు తక్కువ చేసి అనుమతులిచ్చారని కాగ్ నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో 14 పట్టణ స్థానిక సంస్థలు, ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ సంస్థలు స్వచ్ఛ సేవల కింద తమ పరిధిలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేకపోయినా ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్(ఆప్కోస్)కు 18 శాతం జీఎస్టీ(రూ.37.21 కోట్లు) చెల్లించాయి.

చినవెంకన్న సేవలో డీజీపీ ద్వారకా తిరుమలరావు



డీజీపీ ద్వారకా తిరుమలరావుకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఈవో మూర్తి

ద్వారకా తిరుమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన బంగారు వాకిలి గుండా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ద్వారకా తిరుమలరావుకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని ఇచ్చి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

నేడు 'మన్యం'లో కంటైనర్ ఆసుపత్రి ప్రారంభం



పార్వతీపురం మన్యం జిల్లా కరడవలస గ్రామంలో సిద్ధమైన కంటైనర్ ఆసుపత్రి

పార్వతీపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం కరడవలస గిరిశిఖర గ్రామంలో కంటైనర్ ఆసుపత్రిని సోమవారం ప్రారంభించనున్నారు. నాలుగు బెడ్స్‌తో కూడిన కంటైనర్ గిరి వైద్య కేంద్రం ద్వారా గిరి పుత్రులకు స్థానికంగానే వైద్య సేవలు అందించనున్నారు. గిరిజనులకు డోలీ కష్టాలు తప్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటైనర్ ఆసుపత్రికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో మన్యం జిల్లా నుంచే తొలిసారి ఈ వైద్య సేవలు అందించనున్నారు. గిరిజన సంక్షేమశాఖ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ కంటైనర్ ఆసుపత్రిని ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆర్టీసీ బస్సులో ఉరి

తిరుపతిలో గుర్తు తెలియని యువకుడి అఘాయిత్యం



బస్సు లోపల రాడ్డుకు వేలాడుతున్న ఉరితాడు, మృతిచెందిన యువకుడు

రేణిగుంట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో గుర్తుతెలియని యువకుడు ఆదివారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి తెల్లవారుజామున పల్లె వెలుగు బస్సు బయలుదేరింది. ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామం వద్ద ఒక యువకుడు బస్సు ఎక్కి తిరుపతికి టికెట్టు తీసుకున్నాడు. ఆ సమయంలో బస్సులో ముగ్గురు ప్రయాణికులే ఉన్నారు. ఈ యువకుడు బస్సు వెనుక భాగంలో కూర్చున్నాడు. తర్వాత తన జాగర్ ప్యాంటు లేస్‌ను బస్సు పైకప్పునకు ఉన్న ఇనుప రాడ్డుకు కట్టి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లి వద్ద ఒక ప్రయాణికుడు బస్సు దిగే సమయంలో దీనిని గుర్తించి కండక్టరు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బస్సు ఆపి పరిశీలించి పోలీసులకు, ఆర్టీసీ డిపో అధికారులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మృతుడి ఫొటోలను అన్ని జిల్లాల పోలీసు స్టేషన్లకు పంపించి దర్యాప్తును ముమ్మరం చేశారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- పంట కాల్వలోకి ఆర్టీసీ బస్సు బోల్తా



పంట కాల్వలో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

పెంటపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు పంట కాల్వలోకి బోల్తా కొట్టిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం ముదునూరు గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. తాడేపల్లిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భీమవరం బయల్దేరింది. పెంటపాడు దాటిన తరువాత ముదునూరు సమీపంలో బస్సు స్టీరింగ్ వదిలేయడంతో పక్కనే ఉన్న పంట కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 25 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని అధికారులు తెలిపారు. అయితే.. బస్సు కండక్టర్ శాంతికుమారికి ఎదురుగా ఉన్న అదనపు టైరు కాళ్ల మీద పడడంతో గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఆర్టీసీ డీఎం వై.సత్యనారాయణమూర్తి, ఎస్ఐ స్వామి పరిశీలించారు.

వాళ్ళూ మనమూ ఒకటే!



కాలం తెస్తున్న మార్పులను కథానిక నమోదు చేసినంత ప్రభావశీలంగా మరో ప్రక్రియ చేయలేదు. తక్షణ ప్రాముఖ్యం ఉన్న అంశాన్ని పాఠకుని దృష్టికి తెచ్చే కాల్పనిక ప్రక్రియ కావటం వల్ల కథానిక సాహిత్య రంగంలో తొందరగా నిలదొక్కుకుంది. పరిమిత పాత్రలతో, సంఘటనలతో, సన్నివేశాలతో ఆయా రచయితలు సృష్టించే కాల్పనిక ప్రపంచం లోకి పాఠకుడ్ని తీసుకు వెళ్తుంది. పాత్రల ప్రపంచాన్ని పాఠకుల ప్రపంచంతో సమన్వయం చేస్తుంది. మంచి భాషా శైలులు, సంవిధాన శిల్పం కథానికను బలోపేతం చేస్తాయి. సత్యాన్నీ తాత్వికతనూ జీవితంతో మేళవించి గొప్ప రచయితలు రాసిన కథానికలు పాఠకుల స్థాయిని పెంచుతాయి.

సీనియర్ జర్నలిస్ట్ పి.వి. సూర్యనారాయణ మూర్తి ఉర్దూ భాషలో బాగా కృషి చేసి, తనకు నచ్చిన ఉర్దూ సాహిత్యాన్ని, ముఖ్యంగా కథానికలను, తెలుగు లోకి అనువదించి 'మెహక్ హైదరాబాదీ' అన్న కలం పేరుతో ప్రచురిస్తున్నందుకు అభినందించక తప్పదు. ఆయన ఇప్పటిదాకా పది పుస్తకాలను అనువదించారు. వీటిలో జిలానీ బానూ కథలు రెండు సంపుటాలు, సాదత్ హసన్ మంటో కథలు రెండు సంపుటాలు, అమృతా ప్రీతమ్ నవల 'పింజర్', మఖ్దూమ్ మొహియుద్దీన్ వివాదాస్పద రచన 'హైదరాబాద్' మొదలైనవి ఉన్నాయి. జర్నలిస్ట్‌గా 2021లో రిటైరైన తర్వాత అవిశ్రాంతంగా చేస్తున్న సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం వారిని ఉన్నత విద్యా శాఖ లోని ఉర్దూ భాషాభివృద్ధి జాతీయ మండలి సభ్యులుగా నియమించింది. ఇది ఒక అనువాదకునికి లభించిన అరుదైన గౌరవం.

'మెహక్ హైదరాబాదీ' ఇరవై రెండు ఉర్దూ కథానికలను ఉర్దూ మూలం నుంచి తెలుగులోకి అనువదించిన కథా సంకలనం పేరు 'గుల్‌దస్త'. ఈ పుస్తకంలోని కథల అనువాద కార్యక్రమంలో ఒక పరిశోధనాత్మక దృక్కోణం సూత్రం లాగా ఇమిడి ఉంది. అది– "ఇక్కడి హిందువుల జీవితాలపై ముస్లిం రచయితలు ఎలాంటి కథలు రాశారు?" అన్నది. ఇదొక అన్వేషణ. అనువాదకుడు ఈ రెండు భాషల మధ్య సరికొత్త వంతెన వేస్తున్నాడు. దీన్ని ఉర్దూ సాహితీ మిత్రులు కూడా అనుసరిస్తే రెండు భాషల సాహిత్యం సుసంపన్నమవుతుంది.

రషీద్ కురేషీ 1938లో రాసిన కథ 'వితంతువు' (బేవా). భర్త చనిపోయిన తర్వాత సాటి స్త్రీల మధ్య కూడా ఒక అస్పృశ్యగా బతకటం యుక్త వయసులో ఉన్న షీలాకు దుర్భరమైపోతుంది. కూతుళ్ళ విషయంలో ఒక రకంగా, కోడళ్ళ విషంలో మరో రకంగా ప్రవర్తించే నోరున్న అత్తలకు హిందూ సమాజంలో దాదాపు ప్రతి ఇల్లూ కేంద్రమే. ఈ అత్త కూడా షీలాను ఇంట్లో నుండి గెంటేస్తుంది. షీలాకు సవతి తల్లి రంపపు కోత భరించక తప్పలేదు. ఈ దశలో యువకుడైన శంకర్ అనే ట్యూషన్ మాస్టారితో పరిచయం ఆమెకు ఒక వరమూ, శాపమూ కూడా. శంకర్ అనే వ్యక్తి పరిధి లోకి ఆమె జీవితం కుంచించుకు పోయింది. అతని ప్రేమ ప్రతిపాదన వల్ల ఆమె ఆలోచనలు పెళ్ళి వైపు మళ్ళాయి. కానీ అతడు ఈ వితంతువును వదిలేసి ఒక కన్యను పెళ్ళాడతాడు. దీంతో కథ విషమ స్థితికి చేరుకుంది. మూడు కోణాల ప్రేమకథ ఒక ప్రాణాన్ని బలి తీసుకుంటుందన్న సూత్రం ప్రకారం షీలా ఈ లోకం నుండి నిష్క్రమిస్తుంది. చనిపోయిన భర్త, అత్త, సవతి తల్లి, శంకర్, శంకర్ భార్య – ఈ ఐదుగురితో మారుతూ వచ్చిన సంబంధాల దృష్ట్యా సంఘర్షణకు లోనైన స్త్రీ షీల. ఈ సంఘర్షణను చిత్రించిన తీరులో రచయిత సమర్థత కనిపిస్తుంది. ఒక్కోసారి ఒక సంఘటన సహజ పరిణామ క్రమంలో పతాక స్థాయిని అందుకుంటున్న ఘట్టంలో దాని నిర్వహణ చేతగాని కథకులు చేతులెత్తేస్తుంటారు. ఈ కథానికలో ఆ లోపం కనిపించదు. ఇది స్త్రీ కోణం నుంచి కథనం చేయబడ్డ కథానిక.

హిందూ సమాజంలో వితంతువుల సమస్య మతంతో ముడిపడి ఉన్న అంశం. ముస్లిం సమాజంలో వితంతు సమస్య లేదనే చెప్పవచ్చు. తమ మతంలో లేని వితంతు సమస్య హిందూ సమాజంలో ఎట్లా ఉందో తమ పాఠకులకు తెలియజేయాలన్న ఆసక్తి నాటి ఉర్దూ రచయితలకు ఉండటం సహజం.


'ఉప్పెన' (సైలాబ్) కథానికను కదీన్ జమాం 2005లో రాశాడు. కథానాయిక నళిని పెళ్ళిడుకు వచ్చేసరికి ఒక నేపథ్యం ఏర్పడిపోయింది. ఆమెకు విష్ణుమూర్తి పట్ల ఎనలేని భక్తి శ్రద్ధలు ఏర్పడ్డాయి. ఒక రోజు పెద్ద తుఫాను వచ్చింది. సముద్రం చెలియలికట్ట దాటింది. నళిని, ఆమె భర్త పిల్లలను ఎత్తుకొని ఆత్మరక్షణ కోసం బయలుదేరారు. ఇంత ఆపదలో కూడా బరువైన విష్ణుమూర్తి విగ్రహాన్ని తనతోపాటు తెచ్చుకోవటం నళిని మరిచిపోలేదు. విగ్రహం సముద్రంలో జారిపడిపోయింది! వారు సురక్షితంగా గమ్యం చేరుకున్నారు. ఈ కథలో అంతఃసంఘర్షణకు భౌతిక పరిస్థితులు కారణమయ్యాయి. విష్ణుమూర్తి తాను సముద్రంలో మునిగిపోయి తమను కాపాడాడన్న భావన కూడా నళినికి దుఃఖ హేతువే. ఆమె భక్తిప్రపత్తులు విగ్రహాన్ని ఆశ్రయించే ఉన్నాయి. ముస్లిం సమాజంలో లేని విగ్రహారాధన హిందువుల విశ్వాసాలలో ప్రధాన భాగం. దీన్నే రచయిత ఈ కథానికలో తుఫాను ద్వారా చిత్రించాడు.

ఫాతిమా తాజ్ అన్న రచయిత్రి 2002లో రచించిన 'జీవిత చక్రం' (జీవన్ ధారా) కూడా విగ్రహారాధనకు సంబంధించిన కథే. ఇందులోని కథానాయిక పట్ల రచయిత్రి ప్రదర్శించిన గౌరవం, సానుభూతి పాఠకుడ్ని ఆకట్టుకుంటాయి. మరికొన్ని ఇతర కథల్లో కూడా హిందువుల మత సాంస్కృతిక మనోవ్యవస్థను గౌరవంతో దర్శించే శక్తి తమకు ఉందని ఉర్దూ రచయితలు నిరూపించుకున్నారు. అంతరాంతరాల్లో లౌకికవాదం బలపడుతున్నదనటానికి ఇది సూచిక.

ఏ మతం వారి జీవితానికైనా ఆర్థిక శక్తే కేంద్రం. ఈ కేంద్రం చుట్టూ తిరిగే జీవితాలలో ఎంతో సమానత్వం, కొంత భిన్నత్వం ఉంటాయి. 'గుల్‌దస్త' కథలు ఈ సత్యాన్నే చెప్తున్నాయి. ఇక అనువాద విషయానికి వస్తే– మూల విధేయ పద్ధతికి చదివించే గుణం తోడైతే అనువాదకుని కృషి సార్థకమవుతుంది. మెహక్ హైదరాబాదీ కృషి సార్థక కృషి అని 'గుల్‌దస్త' పరిమళాలు చాటి చెప్తున్నాయి.



'గుల్‌దస్త' పుస్తకం లోని కథల అనువాద కార్యక్రమంలో ఒక పరిశోధనాత్మక దృక్కోణం సూత్రం లాగా ఇమిడి ఉంది. అది– "ఇక్కడి హిందువుల జీవితాలపై ముస్లిం రచయితలు ఎలాంటి కథలు రాశారు?" అన్నది. ఇదొక అన్వేషణ. అనువాదకుడు ఈ రెండు భాషల మధ్య సరికొత్త వంతెన వేస్తున్నాడు. దీన్ని ఉర్దూ సాహితీ మిత్రులు కూడా అనుసరిస్తే రెండు భాషల సాహిత్యం సుసంపన్నమవుతుంది.



■ అమ్మంగి వేణుగోపాల్

✆ 94410 54637



గోడకుర్చీ వేయించాను
గుంజిళ్ళు తీయించాను
బెంచీ ఎక్కించాను
బడి చుట్టూ తిప్పించాను
బుద్ధి మారదు ససేమిరా
కుక్కతోక వంకరన్నట్లు
ఉత్తరంవైపు అడుగు పెట్టద్దంటే
అటే పరుగులు
చండికలా వద్దన్నదే ముద్దు
అరచేతిలో వాలిన చిలుకలను
అక్కర్లేదని వదిలేస్తుంది
అందరాని వాటికోసం
కాళ్ళెత్తి ఎగురుతుంది

నిజంగా దేనితో చేస్తారో
తెలిస్తే బాగుండు
ప్లాస్టిక్కా ప్లాటినమా
మృత్తికతోనా పసిడితోనా
అంతు చిక్కని రహస్యం
రికాబులో కాళ్ళు పెట్టి
కోర్కెల వారువానికి కళ్ళెం బిగించి
కొయ్యగుర్రంగా మార్చెయ్యాలనుకుంటా
కింద పడేసి రెక్కల గుర్రమై
పొగరుగా ఎటో దౌడు తీస్తుంది
ఒకసారి
తడిసిన పిట్టలా
ఒక మూల ఒదిగి కూర్చుంటుంది

దిగులు బొమ్మలా
ఒకసారి
ఎన్నికల్లో ఓడిపోయి ఎవరికీ కనిపించని
ప్రతిపక్ష నాయకునిలా
ఓసారి మట్టి ముద్దలా
ఓసారి ఉత్తుంగ శిఖరం హిమాలయంలా
ఓసారి అంతర్వాహిని సరస్వతిలా
ఓసారి వరద గోదారిలా
అర్థం కాదెప్పటికీ
అస్పష్ట వాక్యంలా..

■ మందరపు హైమవతి

✆ 94410 62732

సోమవారం 25 నవంబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

మాతృత్వాన్ని కమ్మిన కట్టుకథలను ఛేదించే 'యోధ'

పితృస్వామ్య సమాజం మాతృత్వాన్ని చాలా గ్లోరిఫై చేసింది. పిల్లలను కనడం వేరు, మాతృత్వం వేరు. కానీ సమాజం ఈ రెండిటినీ ఒకే కోణంలో చూస్తుంది. పిల్లలను కనడానికి అనువుగా స్త్రీకి ఉన్న శారీరక నిర్మాణాన్ని అలుసుగా తీసుకున్న పురుషుడు పిల్లలను పెంచే బాధ్యతను కూడా స్త్రీ పైన మోపాడు. ఆడపిల్ల పెరుగుతున్న క్రమంలోనే మాతృత్వం లోని గ్లోరిఫికేషన్ వలన తనకు తెలియకుండానే పిల్లలను కనడంతోపాటు వాళ్ళను పెంచడం కూడా తన బాధ్యతగా భావిస్తుంది. చాలామంది స్త్రీలు పిల్లల పెంపకం బాధ్యత తమదే అని అనుకోవడానికి ఈ కండిషనింగ్ కారణం. ఇలాంటి నేపథ్యంలో మాతృత్వం కాన్సెప్ట్ మీద భండారు విజయ తన సంపాదకత్వంలో 'యోధ' పేరిట ఒక కథా సంకలనాన్ని తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెతో ముఖాముఖి.

రచయిత అయిన మీకు ప్రచురణ రంగంలోకి రావాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

ప్రథమంగా నేను రచయితను. ఒక మహిళా రచయితగా సమాజంలో వివక్షకు గురౌతున్న స్త్రీల పట్ల ఒక లోతైన అధ్యయనం చేస్తూ ఉంటాను. అలాగే మహిళా హక్కుల కార్యకర్తగా స్త్రీలను అనేక విషయాలలో ఎడ్యుకేట్ చేయాలన్న దృఢ సంకల్పం నాకు ఉంది. చిన్నప్పటి నుంచి నాకు ఇతర స్త్రీల కన్నా భిన్నంగా, కొత్తగా ఏదైనా ప్రయోగాలు చేయడం అంటే చాలా ఇష్టం. ఆ భిన్న వ్యక్తీకరణ నుంచి వచ్చిందే ఈ ప్రచురణ కర్త హోదా. ఒకప్పుడు రచయితలు రాసిన ఏ పుస్తకాలనైనా ప్రచురించాలంటే ప్రముఖ ప్రచురణ సంస్థలు చాలా ఉండేవి. అలాంటి పేరున్న సంస్థలు ఇప్పుడు ఎక్కడా కనబడటం లేదు. కొత్తగా కొన్ని ప్రచురణ సంస్థలు వచ్చినప్పటికీ, వాటికి కొన్ని పరిమితులు (ఆర్థిక, హార్దిక) ఉండడం వలన వాటి జోలికి రచయితలు వెళ్ళలేకపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రచయితలు తమ పుస్తకాలను తామే ప్రచురణ చేసుకునే ట్రెండ్ ఎక్కువైంది. నేను 1984లో 'దీపిక', 2016లో 'తడియారని దుఃఖం' కవితా సంపుటాలను నా మిత్రుల ప్రచురణ సంస్థల ద్వారా ప్రచురించాను. 2015లో వరంగల్ మిత్రులందరం కలిసి 'రుద్రమ' ప్రచురణ సంస్థను స్థాపించాము. ఆ సంస్థలో నేను సహసంపాదకురాలిగా 7, 8 పుస్తకాలకు పని చేసాను. 2017లో రుద్రమ ప్రచురణల నుంచి నేను బయటకు వచ్చి, 2018లో హస్మిత ప్రచురణ సంస్థను స్థాపించాను. మొదట్లో నా పుస్తకాలను మాత్రమే ప్రచురించాను. తర్వాత రచనలను ముద్రించుకోవడంలో నానా అవస్థలు పడుతున్న రచయితలకు నా సంస్థ ద్వారా అవకాశం ఇస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. అందులో భాగంగా 2023లో 'స్వయంసిద్ధ' ఒంటరి మహిళల జీవన గాథల పేరిట 40 మంది కొత్త, పాత రచయితలను కలుపుకొని వారితో కొత్త కథలు రాయించి ఒక కథా సంకలనాన్ని విజయవంతంగా తీసుకొని వచ్చాను. ఆ పుస్తకం ఏడాదిలోనే ద్వితీయ ముద్రణ కూడా వచ్చింది. అదే ఉత్సాహంతో ఇప్పుడు 'యోధ' మాతృత్వం భిన్నవ్యక్తీకరణల పేరిట తీసుకు వచ్చాను.


మాతృత్వం కాన్సెప్ట్ మీద కథా సంకలనం తీసుక రావాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

ఒంటరి మహిళలుగా స్త్రీలు ఈ సమాజంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను క్రోడీకరించి, వారి విజయ గాథలను 'స్వయం సిద్ధ' రూపంలో కథా సంకలనంగా తెచ్చాము. ఒంటరితనం తరువాత స్త్రీలు సమాజంలోను, కుటుంబంలోను ఎక్కువగా ఎదుర్కొనే ముఖ్యమైన సమస్య శారీరక హింస, అందులో ఒక భాగమే మాతృత్వం. ఆ హింసను పరోక్షంగా బలపరిచేది పితృస్వామిక వ్యవస్థ, దాని భావజాలం. ఆ భావజాలం స్త్రీలకు బానిసత్వాన్ని ఇంజెక్ట్ చేసింది. కుటుంబంలో తల్లి స్థానాన్ని గ్లోరిఫై చేస్తూ అనేక విధాలుగా స్త్రీలపై అధికారాన్ని మనువాదం స్థిరపరచుకుంది. ముఖ్యంగా స్త్రీలు మాతృత్వం పేరిట కుటుంబంలో అనేక రూపాల్లో వివక్ష, అణచివేతలతోపాటు వివిధ మానసిక, శారీరక హింసలకు లోనుకావడం నన్ను బాగా కలవరపరచిన విషయం. మాతృత్వం అనేది ఒక భ్రమ మాత్రమే అనేది నా నమ్మకం. పితృస్వామిక భావజాలం మాత్రం 'మాతృత్వం' అనే అంశాన్ని స్త్రీల చుట్టూ మెలికలు తిప్పుతూ అనేక కట్టుకథలను అల్లి, ఇంకా నమ్మించే ప్రయత్నం చేయడం దురదృష్టకరం.



"సమాజంలోనూ కుటుంబంలోనూ పురుషులతో ఏ సమానత్వ హక్కునైతే ఈనాడు స్త్రీలు కోరుకుంటున్నారో, అదే సమాన బాధ్యతను పిల్లల పెంపకం, వారి ఆలనా పాలనా విషయంలో కూడా అడుగుతున్నారు. మాతృత్వం మాటున దాగిన దగాకోరుతనాన్ని ఒకవైపు నిలదీస్తూ మరోవైపు అందులోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ నిరంతరం పురుషస్వామ్యంతో పోరాడుతున్నారు. అందుకే వారిని నేను 'యోధ'లుగా చూస్తున్నాను." – విజయ భండారు

మాతృత్వం స్త్రీలను జీవితాంతం నిద్ర పుచ్చే ఒక మత్తుమందు లాంటిది. దానిని గ్లోరిఫై చేయడమే ఈ సమాజ ఉద్దేశం. అన్ని భావనల లాగా మాతృత్వం, తల్లితనం అనేది ఒక మానసిక భావన మాత్రమే అన్నది 80వ దశకం నుంచి స్త్రీవాదులు చేస్తున్న వాదనే. స్త్రీ పురుషుల సమానత్వం కోరుకుంటున్న సమాజ పరిణామ క్రమంలో వంటిల్లూ, పిల్లల బాధ్యతా కేవలం స్త్రీలదే అని వాదించడం మూర్ఖత్వం. చలం ఏనాడో చెప్పాడు. స్త్రీకి మెదడు ఉంది, దానికి ఆలోచన ఉంటుంది అని. ఆ ఆలోచన లోంచి పుట్టిందే 'యోధ'. ముందుగా 'మాతృత్వం – విభిన్న కోణాలు' పేరిట ఒక అవగాహన సదస్సును ఏర్పాటు చేశాను. అందులో దాదాపు 70 మంది రచయిత్రులు పాల్గొన్నారు. ఆ సదస్సులో మాట్లాడిన వక్తల ఆలోచనల నుండి 70మంది రచయితలు కథలు రాశారు. అందులో 53 మంది రచయితల రచనలు మాత్రమే ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి.



మాతృత్వం కాన్సెప్ట్‌తో వచ్చిన కథా సంకలనానికి 'యోధ' అని పేరు పెట్టడంలో ఉద్దేశ్యం?

'యోధ' అంటేనే పోరాట పటిమ కలిగి ఉండడం. ప్రతి విషయంలోనూ పోరాటం తర్వాతే విజయం ఉంటుంది. ప్రతి మనిషి రోజువారీ జీవితంలో కూడా అనేక పోరాటాలు చేయాల్సి ఉంటుంది. అది హద్దుల కోసం కావచ్చు, హక్కుల కోసం కావొచ్చు, మరే విషయంలోనైనా కావచ్చు. అలాగే కుటుంబంలో ప్రతి స్త్రీ ఎన్నో పోరాటాలు చేస్తేనే అనుకున్నది సాధించగలుగుతుంది. శతాబ్దాలుగా స్త్రీలపై నిత్యం పడుతున్న అదనపు భారం మాతృత్వం. అమ్మ అనిపించుకుంటేనే ఆడజన్మ సార్థకం అన్న నానుడి, పితృస్వామిక భావజాలం కలగలిపి స్త్రీలను కుటుంబ వ్యవస్థలో కట్టు బానిసలుగా మార్చివేసాయి. ఆ బానిసత్వం వెనుక ఉన్న కుట్రలను చదువుకున్న నేటి ఆధునిక స్త్రీలు గుర్తెరిగారు. మాతృత్వం అన్న దానిలో ప్రత్యేకత ఏమీ లేదనీ, అన్ని అనుభూతుల లాగే అదీ ఒక అనుభూతి అనీ తెలుసుకున్నారు. సమాజంలోనూ కుటుంబంలోనూ పురుషులతో ఏ సమానత్వ హక్కునైతే ఈనాడు స్త్రీలు కోరుకుంటున్నారో, అదే సమాన బాధ్యతను పిల్లల పెంపకం, వారి ఆలనా పాలనా విషయంలో కూడా అడుగుతున్నారు. ఆడవాళ్ళ భ్రమలు తొలగిపోయి మాతృత్వం అనేది స్త్రీ పురుషులిద్దరూ కలిసి మోయాల్సిన బాధ్యత అని ఇప్పుడు ఎలుగెత్తి అంటున్నారు. మాతృత్వం మాటున దాగిన దగాకోరుతనాన్ని ఒకవైపు నిలదీస్తూ మరోవైపు అందులోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ నిరంతరం పురుషస్వామ్యంతో పోరాడుతున్నారు. అందుకే వారిని నేను 'యోధ'లుగా చూస్తున్నాను. అందుకే 'యోధ' అనే పేరును మాతృత్వం భిన్న వ్యక్తీకరణలకు సూచనగా పెట్టాను.


ఇంటర్వ్యూ ■ గిరిజ పైడిమర్రి

✆ 99494 43414

ముఖచిత్రం అసంతృప్తిని మిగిల్చింది

నా మొదటి పుస్తకం

■ కొప్పర్తి



నా మొదటి పుస్తకం 'పిట్ట పాడే పాట కోసం'. మార్చి 1991లో అచ్చువేశాను. అది 1981–1991 మధ్య రాసిన కవిత్వం నుంచి ఎంపిక చేసిన కవితల సంపుటి. సమాజాన్ని మార్చడానికి కవిత్వం ఆయుధం అని భావించి రాసిన కవిత్వమే కానీ ఒక ఆహ్లాదకరమైన శీర్షికను ఉంచడాన్ని బట్టి ద్వైదీభావం ఏదో ఉండేదని నాకు తర్వాత అర్థమైంది. రాజమండ్రి సాహితీవేదిక, పోరుమామిళ్ల బ్రౌన్ సాహితీ సాంస్కృతిక సంస్థ, రాజోలు సాహితీ స్రవంతులలో భాగస్వామిగా ఉంటూ రాసిన కవిత్వమే అయినా నా ప్రధాన కవిత్వ కేంద్రం రాజమండ్రే. నా కవిత్వం సంపుటిగా రావాలని మొదట కాంక్షించింది డా. జయధీర్ తిరుమలరావు.

ఈ సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం మూడు వేలు ఆర్థిక సహాయం చేసింది. ప్రచురణకు అది సరిగ్గా సరిపోయింది. ముందుమాట ఎవరితోనూ రాయించలేదు. రాజమండ్రి రత్నా ప్రింటర్స్‌లో అచ్చయ్యింది. పుస్తకం వెల ఐదు రూపాయలు పెట్టాను. ప్రచురణ బాధ్యత అంతా అప్పటికే 'కంజిర'ను అందంగా తెస్తున్న నామాడి శ్రీధర్, ఒమ్మి రమేశ్ బాబులు తీసుకున్నారు. మధ్యలో ముఖచిత్రం తతంగం ఒకటి జరిగింది. చిత్రకారుడు 'కాళ్ల'తో ముఖచిత్రం వేయించుకోవాలనే నా కోరిక తీర్చడానికి మిత్రులు గంగాధర్ నన్ను ఖమ్మం తీసుకెళ్లి ఆయనకు పరిచయం చేశారు. నావి కొన్ని కవితలు ఇచ్చి 'పిట్టపాడే పాట కోసం' శీర్షికకు బొమ్మ వేసివ్వమని కోరి వచ్చేశాం. నెలన్నర గడిచినా ఆయన నుంచి బొమ్మ రాలేదు. ఉత్తరాలకు జవాబు లేదు. ఇలా కాదనుకుని జయధీర్ తిరుమలరావు గారు నన్ను హైదరాబాద్‌లో మోహన్ దగ్గరకు తీసుకెళితే ఆయన సాయంత్రానికి బొమ్మ వేసిచ్చారు. అది పట్టుకుని ఇంటికి వచ్చేసరికి కాళ్ల నుంచి బొమ్మ వచ్చి ఉంది. ఆయన నేనడిగిన శీర్షికకు కాకుండా తనకు నచ్చిన 'ఆకలి నైరూప్యం కాదు' అనే కవితకు బొమ్మ వేసి పంపారు. ఏం చెయ్యాలో తెలీలేదు. పుస్తకం పేరు మార్చుకోవడం నాకు ఇష్టం లేదు. అడిగి వేయించుకున్న కాళ్ల బొమ్మను తిరస్కరించడం అగౌరవించడమని భావించాను. ఆ సమస్య మోహన్ విషయం లోనూ ఉంది. చివరికి 'పిట్ట పాడే పాట కోసం' శీర్షికనే ఉంచి, కాళ్ల వేసిన బొమ్మతో, మోహన్ అక్షరాలతో ముఖచిత్రం వేశాం. ఈ నిర్ణయం పూర్తిగా నాదే. కానీ చివరకు శీర్షికకూ బొమ్మకూ పొంతన కుదరలేదనే అసంతృప్తి ఉండిపోయింది.



ఆవిష్కరణ ఆ సంవత్సరం వేసవిలో రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో జరిగింది. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షులు. శివారెడ్డి ఆవిష్కర్త. పాపినేని శివశంకర్, సతీష్ చందర్‌లు సమీక్షకులు. మా అమ్మ నాన్నలు కనక దుర్గాంబ, అమర లింగేశ్వరరావులకు అంకితమిచ్చాను. సభ ఏర్పాట్లు అన్నాయ్ ప్రసాదమూర్తి చూశాడు. సంపుటికి అమలాపురం సరసం అవార్డు, హైదరాబాదు ఆంధ్ర మహిళా సభ దేవులపల్లి కృష్ణశాస్త్రి పురస్కారం వచ్చాయి. కృష్ణశాస్త్రి పురస్కారానికి న్యాయనిర్ణేత డా. ఎన్. గోపి. అప్పటి నా కవిత్వం నచ్చడానికి ఆస్కారంలేని ఇస్మాయిల్‌గారు ఒకసారి కలిసినప్పుడు నేను అడక్కుండానే "మీ కవిత్వంలో ఒక అక్షరం కూడా తీసెయ్యడానికి వీలులేని బిగువు ఉంటుంది" అన్నారు.

కేతు విశ్వనాథ రెడ్డి జీవితం, రచనలపై ప్రసంగం

సాహిత్య అకాడెమీ – యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప సంయుక్తంగా నిర్వహిస్తున్న 'నా దృష్టిలో...' కార్యక్రమంలో కేతు విశ్వనాథ రెడ్డి జీవితం, రచనలపై కాత్యాయనీ విద్మహే ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమం నవంబర్ 28 ఉదయం 10.30గంటలకు కవయిత్రి మొల్ల సమావేశ మందిరం, ఆర్ట్స్ బిల్డింగ్, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడపలో జరుగుతుంది.

సాహిత్య అకాడెమీ



మసకబారిన వెన్నెల బతుకు

గడియారంలోని ముండ్లు
ఒక దాని వెంట ఒకటి
విరామం లేకుండా ఉరికినట్టు
నువ్వు కూడా రోజంతా
కంటికి కనిపించని కాలం వెంటే
పరుగులు తీస్తుంటావు!

నువ్వు మంచం మీది నుండి
కాళ్ల నేల మీద దించేది
కాలం వెంట పరుగులు తీసేందుకే

ఎవరో తరుముతున్నట్టు
ఏదో అందుకోవాలన్నట్టు
అప్రకటిత పరుగు పందెంలో
ఎక్కడికో తెలియని
పరుగులు తీస్తుంటావు

రేపటి కోసం
ఇవాళ్టిని కోల్పోతుంటావు
గతాన్ని తలుచుకొని
ఒకింత ఉపశమనం పొందుతుంటావు
కోల్పోయిన వాటినన్నీ
కలల్లోనే ఊహించుకుంటూ
తాత్కాలిక సంతృప్తి చెందుతుంటావు

పరుగెత్తి పరుగెత్తి
అన్ని ఆనందాలు కోల్పోతుంటావు
అవి కోల్పోయావని
నువ్వు తేరుకునే సరికి
నిన్ను పరుగెత్తించిన
గడియారంలోని ముళ్లు
నువ్వు ఓడిపోయావని
పగలబడి నవ్వుతుంటాయి


నగరం మీద మసకబారిన
వెన్నెల బతుకు నీది
గట్టిగా నవ్వలేవు
అలాగని గట్టిగా ఏడ్వనూ లేవు
అంతా ఒక నటనల ప్రపంచంలో
ఉత్తమ నటుడివై
రోజుల్ని ఈదుతుంటావు

సడెన్‌గా నీకో గుండె ఉండాలని
ఏ అర్ధరాత్రో గుర్తుకొస్తుంది
ఛాతీ మీద చెయ్యేసి చూసుకుంటే
అక్కడ గడ్డకట్టిన సిమెంటు లాంటి
రాతి ముద్ద ఒకటి చేతికి తగులుతుంది
అది చూసి పొగిలి పొగిలి ఏడుస్తావు
చిత్రంగా ఒక్క కన్నీటి చుక్కా రాలదు!

లోకం మునిగిపోతున్నట్టు
కంగారుపడి
ఉలిక్కిపడి లేచి
అద్దం ముందుకొస్తావు
నీ రూపమే నీకు కనిపించదు
పైసల చెట్టొకటి పగలబడి నవ్వుతుంటుంది
ఇది చెప్పలేని హింసలకాలం
ఇది నిన్ను నువ్వే అప్పగించుకునే
కోర్కెల గాలం!

■ పసునూరి రవీందర్

✆ 77026 48825



హంసలదీవిలో జస్టిస్ భట్టి

కార్తీక మాసం సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్.వి.ఎన్.భట్టి కుటుంబ సమేతంగా హంసలదీవి బీచ్‌ను ఆదివారం సందర్శించారు. సాగరతీరాన పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీరుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక తదితరులు ఉన్నారు.

- కోడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి)





జనద్వీపం

కార్తీక మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని భవానీ ద్వీపం పర్యాటకులతో కిటకిటలాడింది. ఆటపాటలతో యువత, చిన్నారులు సందడి చేశారు. స్పీడ్ బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, బనానా బోట్లపై సాహసాలు చేశారు. బోటు షికారుతో ఉల్లాసంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భవానీ ద్వీపం జనదీపంగా మారిపోయింది.

వైభవంగా తిరుపతమ్మ గాజుల ఉత్సవం

పెనుగంచిప్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీతిరుపతమ్మ దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి గాజుల అలంకరణ ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. తిరుపతమ్మతో పాటు ఆలయంలోని సహదేవతలను రంగురంగుల గాజులతో శోభాయమానంగా అలంకరించారు. తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పెనుగంచిప్రోలుకు చెందని స్టీల్ షాపు యజమాని కంచర్ల కోటేశ్వరరావు, భవాని దంపతులు, వత్సవాయి మండలంలోని చిట్యాలకు చెందిన మారెళ్ల సూరారెడ్డి, ఖమ్మంలోని కావేరి హోటల్ అధినేత కర్నాటి వీరభద్రరావు,రమాదేవి దంపతులు అమ్మవారికి గాజులను సమకూర్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారుబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ బీ.వి.ఎన్.ఎస్.కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ చెంగాల శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పోర్టుల మీద నిఘా పెరగడం, పోర్టులకు వచ్చే మార్గాల్లో దాడులు జరగటంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని బియ్యం అక్రమార్కులు రూటు మార్చారు. గతంలో పోర్టులకు తరలించి అక్కడి నుంచి బంగ్లాదేశ్, ఇండోనేషియాలకు తరలించే ముఠా ఈసారి ఆఫ్రికా దేశాలను లక్ష్యంగా చేసుకుంది. ఆఫ్రికా ఖండంలో చాలా పేద దేశాలు ఉండటంతో పీడీఎస్ బియ్యానికి మంచి డిమాండ్ నెలకొంది. దీంతో ఆఫ్రికాలోని బియ్యం వ్యాపారులు, ట్రేడర్లతో రేషన్ మాఫియా చేతులు కలిపింది. ఆఫ్రికా దేశాలకు ముంబాయి పోర్టు నుంచి అక్రమ బియ్యాన్ని రవాణా చేసేందుకు మాస్టర్ ట్రేడర్లు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. మాస్టర్ ట్రేడర్ల డైరెక్షన్ మేరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సింహభాగం అక్రమ బియ్యం వ్యాపారులు తమకు కూడా కేసుల బాధ ఉండదని చాలా తెలివిగా ఈ బియ్యాన్ని ముంబాయి తరలిస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ)



బియ్యం అక్రమ రవాణా రూటు మారింది!

విజయవాడ నుంచి ముంబాయి మీదుగా ఆఫ్రికా తరలింపు

- చత్తీస్‌గడ్ నుంచి పలు మార్గాల్లో ముంబాయికి రవాణా
- ముంబాయి పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి
- పట్టించుకోని విజిలెన్స్ అధికారులు

బియ్యం తరలింపు రూట్ మ్యాప్ ఇలా..

ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి అక్రమంగా సేకరించిన బియ్యాన్ని ముందుగా విజయవాడలోని సర్కిల్-1 పరిధిలోని దేవీనగర్ సమీపంలో గోడౌన్లకు తరలిస్తారు. సర్కిల్-3 పరిధిలోని ప్రైవేటు ఇళ్లలో కూడా వీటిని నిల్వ చేస్తారు. ఇక్కడి నుంచి వాహనాలలో బియ్యాన్ని తరలిస్తారు. జాతీయ రహదారి - 65 మీదుగా ఇబ్రహీంపట్నం రింగ్‌కు చేరుకుని అక్కడి నుంచి విజయవాడ - ఛత్తీస్‌గడ్ మార్గమైన ఎన్‌హెచ్ - 30 మీదకు చేరుకుని భద్రాచలం, వరంగల్‌ల మీదుగా చత్తీస్‌గడ్‌కు చేరుకుంటాయి. చత్తీస్‌గడ్ నుంచి ముంబాయికి ఈ వాహనాలు బయలుదేరతాయి. ముంబాయికి వెళ్లిన వాహనాలు నేరుగా పోర్టుకు చేరు కుంటాయి. పోర్టులో రెడీగా ఉన్న మాస్టర్ ట్రేడర్లు వీటిని బల్క్‌గా షిప్‌లలో ఆఫ్రికాకు రవాణా చేస్తారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ముంబాయికి తీసుకువెళ్లటం దూరాభారమైనా కూడా పెద్ద మొత్తంలో సరుకు కొనుగోళ్లు జరగటం, ఆఫ్రికా దేశాల నుంచి ఉన్న డిమండ్ కారణంగా అక్రమ బియ్యం వ్యాపారులు అటువైపే మొగ్గుచూపుతున్నారు.



నకిలీ ఆక్షన్ పత్రాలతో రవాణా

సివిల్ సప్లయిస్ నిఘా బృందాలు దాడులు చేసి పట్టుకున్న బియ్యాన్ని తిరిగి ఆక్షన్ వేస్తారు. ఇలా ఆక్షన్ వేయటం కూడా అక్రమార్కులకు ఊతంగా మారిపోతోంది. ఆక్షన్‌లో బినామీ వ్యక్తులతో బియ్యం అక్రమ వ్యాపారులు పాట పాడించి కొనుగోలు చేస్తారు. ఆక్షన్‌లో పాడుకున్న వారికి సివిల్ సప్లయిస్ అధికారులు ఆక్షన్‌లో కొనుగోలు చేసినట్టుగా రశీదు ఇస్తారు. ఈ రశీదులను జిరాక్సులు తీసి తమ అక్రమ బియ్యాన్ని పొరుగు రాష్ట్రాలలో దర్జాగా రవాణా చేస్తున్నారు. ఎవరైనా ఆపితే ఆక్షన్‌లో కొనుగోలు చేసిన బియ్యమని చెబుతున్నారు. దొంగల చేతికి సివిల్ సప్లయిస్ అధికారులే తాళాలు ఇవ్వటం వల్ల ఏకంగా ఇతర రాష్ట్రాలకు చేరుకుని ముంబాయి పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేసే సాహసం చేస్తున్నారు.

అవినీతి మత్తులో విజిలెన్స్!?

ముంబయి పోర్టు నుంచి గత నెల రోజులుగా పేదల బియ్యం జోరుగా ఆఫ్రికా దేశాలకు రవాణా అవుతోంది. వీటిని అడ్డుకోవాల్సిన విజిలెన్స్ విభాగం అవినీతి మత్తులో జోగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో విజిలెన్స్ విభాగం తీరుపై అనేక విమర్శలు ఉన్నాయి. ముంబాయికి చేరుకునే వాహనాలకు విజిలెన్స్ విభాగంలోని ఒక అధికారి అండదండలు అందిస్తుండటంతో ఎలాంటి తనిఖీలు, దాడుల భయం లేకుండా చత్తీస్‌గడ్ చేరిపోతున్నాయని సమాచారం.

జేసీ ఉక్కుపాదం మోపేనా!

సివిల్ సప్లయిస్ ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్న జాయింట్ కలెక్టర్ నిధి మీనా ముంబాయికి తరలిస్తున్న బియ్యం అక్రమ రవాణాపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అక్రమ బియ్యం పట్టుకున్న కేసులను అధ్యయనం చేస్తే అక్రమార్కులు ఎవరో తేలిపోతుంది. వీరిపై అనేక కేసులు ఉన్నా పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయి ? పదేపదే ఎందుకు పట్టుబడుతున్నారు ? వీరి కదలికలపై నిఘా పెడితే వీరి ఆట కట్టించవచ్చు.

- విజయవాడ పోలీసులు బహిష్కరించిన రౌడీషీటర్లు పక్కనే ఉన్న పెనమలూరులో తలదాచుకుంటున్నారు. లేకపోతే గన్నవరంలో గ్రూపు సమావేశాలు పెట్టుకుంటున్నారు. కమిషనరేట్ విభజనతో కొత్తగా వచ్చిన చిక్కుల్లో ఇదొకటి.
- విజయవాడ విమానాశ్రయం గన్నవరంలో ఉంది. దీని పరిధి పూర్తిగా కృష్ణాజిల్లా పరిధిలో ఉంటోంది. దీనికి సంబంధించిన బందోబస్తు, నిరంతర తనిఖీలు మాత్రం విజయవాడ పోలీసులు చేయాల్సి వస్తోంది.

ఇది రెండో సమస్య

ఈ రెండు సమస్యలకు ప్రధాన కారణం వైసీపీ ప్రభుత్వం. జిల్లాల విభజనలో భాగంగా లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలను పరిగణనలోకి తీసుకుని విజయవాడ పోలీసు కమిషనరేట్‌ను ముక్కలు చేసింది. హడావుడిగా చేసిన విభజనతో కొత్త చిక్కులను తీసుకొచ్చి పెట్టింది. ప్రభుత్వం శాంతిభద్రతలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో కమిషనరేట్ రూపురేఖల మార్పుపై ఊహాగానాలు వస్తున్నాయి. నాడు కమిషనరేట్ విభజన అధికారులకు ఇష్టం లేకపోయినా తల ఊపాల్సి వచ్చింది. జిల్లాల విభజనే అస్తవ్యస్తంగా జరిగిందని కూటమి ప్రభుత్వం చెబుతున్న తరుణంలో కమిషనరేట్‌కు కొత్త రూపు వస్తుందన్న భావన పోలీసు వర్గాల్లో కనిపిస్తోంది. - (ఆంధ్రజ్యోతి -విజయవాడ)

కమిషనరేట్ విస్తరణపై ఊహాగానాలు!



నాటి విభజనతో తెరపైకి అనేక సమస్యలు

- భద్రతాపరమైన వ్యవహారాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు
- గన్నవరం, పెనమలూరును కలపాలని పెరుగుతున్న డిమాండ్

పరిధి ఒకరిది... బందోబస్తు మరొకరిది

వైసీపీ చేసిన జిల్లాల పునర్విభజనలో శాంతిభద్రతల అంశాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. విజయవాడ విమా నాశ్రయం గన్నవరంలో ఉంది. ఈ విమానాశ్రయంలో భద్రతను సీఆర్పీఎఫ్ పర్యవేక్షిస్తోంది. బయట ప్రాంతమంతా స్థానిక పోలీసుల పర్యవేక్షణలో ఉంటుంది. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు రోడ్డుమార్గాన విమానాశ్రయానికి చేరుకునేవారు. కమిషనరేట్‌తోపాటు జిల్లా ఎస్పీ పరిధిలో ఉన్న ప్రాంతంలోనూ విజయవాడ పోలీసులు బందోబస్తు నిర్వహించాల్సి వచ్చేది. ఇతర వీఐపీలు విజయవాడకు వచ్చినప్పుడు ఇదే పరిస్థితి. ప్రముఖుల రాకపోకల సమయంలో బందోబస్తును పర్యవేక్షించడానికి మచిలీపట్నం నుంచి జిల్లా ఎస్పీ సుమారుగా 60 కిలోమీటర్లు ప్రయాణించి గన్నవరం చేరుకోవాల్సి ఉంటుంది. ప్రముఖుల రాకపోకల సమయంలో రహదారులకు ఇరువైపుల ఉండే పోలీసులను, తనిఖీలు నిర్వహించే బాంబు స్క్వాడ్‌ను మచిలీపట్నం నుంచి పంపాల్సిన పరిస్థితి ఉంది. విజయవాడ పోలీసులు నగర బహిష్కరణ చేసిన రౌడీషీటర్లు అటు గన్నవరం, ఇటు పెనమలూరులో తలదాచుకుంటున్నారు. గన్నవరం, పెనమలూరు ప్రజలు నిత్యం విజయవాడతో ఎక్కువ సంబంధాలు కొనసాగిస్తారు. తమ పరిధిని కమిషనరేట్‌లో విలీనం చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని అక్కడి ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

'తూర్పు' లేని కమిషనరేట్

తూర్పున ఒకపక్క ఉయ్యూరు, మరోపక్క గన్నవరం, పశ్చిమలో ఇబ్రహీంపట్నం ఒకప్పటి విజయవాడ పోలీస్ కమిషనరేట్ సరిహద్దులు ఇవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల విభజన ప్రతిపాదనతో ఈ సరిహద్దులు చెరిగిపోయాయి. ఈ విభజన ప్రభావం విజయవాడ పోలీసు కమిషనరేట్‌పై పడింది. విజయవాడ నగరాన్ని ఆనుకుని ఉన్న పెనమలూరు, కంకిపాడు జిల్లా ఎస్పీ పరిధిలోకి వెళ్లిపోయాయి. విజయవాడ విమానాశ్రయం ఉన్న గన్నవరం పరిస్థితి అంతే. తూర్పున ఉన్న ముక్కలు తెగిపోయి, పశ్చిమాన ఉన్న గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాలు వచ్చి కలవడంతో కమిషనరేట్ రూపురేఖలు మారిపోయాయి. ఒకప్పుడు ఏడీజీ స్థాయి అధికారి కమిషనర్‌గా ఉండేవారు. ఆ హోదాను ఐజీ స్థాయికి కుదించేసింది. సాధారణంగా 'తూర్పు' సెంటిమెంట్ ఎక్కువమందికి ఉంటుంది. ఇది గృహాల్లో మాత్రమే కాకుండా స్థలాలు, భౌగోళిక స్వరూపాలకు ఉంటుంది. రాజుల రాజ్యాలు నడిచిన కాలం నుంచి తూర్పు సెంటిమెంట్ ఉంది. విజయవాడ కమిషనరేట్‌కు ఒకప్పుడు తూర్పు జోన్ ఉండేది. దీని పరిధిలో గన్నవరం, తోట్లవల్లూరు, పవిడిముక్కల, ఉయ్యూరు, ఉయ్యూరు సర్కిల్ పీఎస్‌లు ఉండేవి. విజయవాడను ఆనుకుని ఉన్న పెనమలూరు మాత్రం సెంట్రల్ జోన్‌లో ఉండేది. నాడు కమిషనరేట్‌కు మొత్తం 20 పోలీస్‌స్టేషన్లు ఉండేవి. జిల్లాల విభజన తూర్పు భాగాన్ని మొత్తంగా ముక్కలు చేసింది. తూర్పు జోన్‌గా ఉన్న పరిధి మొత్తం కృష్ణా జిల్లా ఎస్పీ పరిధిలోకి వెళ్లిపోయింది. సెంట్రల్ జోన్‌లో ఉన్న పెనమలూరు పరిస్థితి అంతే. ఇక అప్పటి నుంచి కమిషనరేట్‌కు తూర్పు అన్నది లేకుండా పోయింది. ప్రస్తుతం ఉన్న సెంట్రల్ జోన్‌ను తూర్పుగా మార్చాలని భావించారు. తర్వాత ఎందుకో వెనుకడుగు వేశారు. విజయవాడలో 13 పోలీస్‌స్టేషన్లు ఉండగా, రూరల్ పరిధిలో 15 పీఎస్‌లు ఉన్నాయి. వెరసి మొత్తం 28 పోలీస్‌స్టేషన్లతో ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ కొనసాగుతోంది. తూర్పు లేకుండా పశ్చిమ వైపున ఎంత పెరిగినా ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాన్ని వాస్తు నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

కరకట్టపై నుంచి కిందకు దూసుకెళ్లిన బస్సు)



కరకట్టపై అదుపుతప్పి నదివైపు దూసుకెళ్లిన బస్సు

చెట్టును ఢీకొని ఆగిన వైనం.. ఊడిన ముందు టైరు

- 37 మంది ప్రయాణికులు క్షేమం
- గతంలో చోడవరం, మధునాపురం వద్ద బస్సు బోల్తా
- గోతుల రోడ్డే ప్రమాదాలకు కారణం

తోట్లవల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు మండలం ఐలూరు సమీపంలో కరకట్టపై ఆదివారం అవనిగడ్డ నుంచి విజయవాడ వస్తున్న ఆర్టీసీ అవనిగడ్డ ఎక్స్‌ప్రెస్(సూపర్ లగ్జరి) ప్రమాదానికి గురయింది. అవనిగడ్డ డిపో నుంచి 37 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు 10.45 గంటల సమయంలో ఐలూరు వద్ద కరకట్ట గోతులతో ఒక్కసారిగా అదుపు తప్పి నది వైపు పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సు ఎడమ భాగం వేపచెట్టుకు ఢీ కొని ముందు భాగం టైరు ఊడిపోవటంతో వేగం తగ్గి పల్టీలు కొట్టకుండా పొలాల్లోకి జారింది. లేకుంటే బస్సు పల్టీలు కొట్టేది. బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎం.అర్జునరాజు వెంటనే ఘటనా స్థలానికి చేరుకును బస్సు డ్రైవర్ మహేష్ నుంచి వివరాలు సేకరించారు. తర్వాత ప్రయాణికులను వేరే బస్సులో తరలించారు.

ఇది మూడో బస్సు ప్రమాదం

కరకట్ట రోడ్డు ఆర్టీసీ బస్సుల ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆదివారం ఐలూరు వద్ద అదుపు తప్పిన బస్సుతో మూడో ప్రమాదం. గతంలో చోడవరం వద్ద కరకట్టపై నుంచి బస్సు పల్టీ కొట్టడంతో ప్రయాణికులకు గాయాలయిన విషయం తెలిసింది. అలాగే రెండేళ్ల కిందట మధునాపురం వద్ద గోతుల్లో పడి బస్సు ప్రక్కకు దూసుకెళ్లింది. ఈ మూడు బస్సు ప్రమాదాలే కాకుండా కార్లు, బైక్‌ల ప్రమాదాలకు లెక్కేలేదు. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్డు గతుకులమయంగా తయారు కావటమేనని స్పష్టమవుతోంది.

కరకట్టను నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కరకట్ట రోడ్డును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అధికారులు రూ.80 లక్షలతో ప్యాచ్‌వర్కులకు అంచనాలు సమర్పిస్తే ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దాంతో కరకట్ట గుంతలతో ప్రమాదకరంగా మారింది. పెదపులిపాక వంతెన నుంచి పెట్రోల్ బంకు వరకు కరకట్ట ధ్వంసమైంది. అలాగే భద్రిరాజుపాలెం, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గుర్విందపల్లి, మధునాపురం, ఐలూరు, లంకపల్లి ఆపై గ్రామాల వెంట కరకట్ట రోడ్డు చాలా ప్రమాదాలను కలిగిస్తోంది. భారీ ఇసుక లారీల రాకపోకలతో కరకట్ట ధ్వంసమైంది. పట్ట పగలే ప్రమాదాలు జరుగుతుంటే రాత్రి సమయాల్లో క్షణక్షణం భయం భయంగా వాహనాలను నడపాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. కరకట్టకు ఒకవైపు కేఈబీ కెనాల్, మరోవైపు 20 అడుగుల లోతు పొలాలు ఉన్నాయి. ఎటు పడినా ఘోరమైన ప్రమాదం సంభవించే పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వమైనా తక్షణమే కరకట్ట రోడ్డుకు ప్యాచ్ వర్కులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

'ఎన్టీఆర్' కలెక్టర్ లక్ష్మీశ నేడు బాధ్యతల స్వీకరణ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్ లక్ష్మీశ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మహారాష్ట్రలో ఎన్నికల అబ్జర్వర్‌గా విధులు నిర్వహించిన ఆయన ఆదివారం రాత్రి విజయవాడ చేరుకున్నారు. బాధ్యతల స్వీకరణపై కలెక్టరేట్‌కు సమాచారం అందించారు. ఉదయం 10 గంటలకు లక్ష్మీశ ఎన్టీఆర్ కలెక్టరేట్ కార్యాలయానికి వస్తారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్‌ను కలుస్తారు. ఆ తర్వాత నేరుగా 10.30 గంటలకు ఆయన కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ చాంబర్‌కు చేరుకుంటారు. అక్కడ జిల్లా అధికారులతో సమావేశమవుతారు. అనంతరం ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.

ఏలూరు కాలువలో మునిగి ఇద్దరు బాలురు మృతి

రెండు కుటుంబాల్లో విషాదం • బాపులపాడు మండలం సీతారాంపురంలో ఘటన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : ఏలూరు కాలువలో స్నానానికి దిగిన ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటన బాపులపాడు మండలంలోని ఎ.సీతారాంపురం గ్రామంలో జరిగింది. వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఎ.సీతారాంపురానికి చెందిన రెడ్డి స్వప్న అనే మహిళ బట్టలు ఉతికేందుకు ఏలూరు కాలువకు వెళ్లగా ఆమెతో పాటు కుమారుడు రెడ్డి అజయ్(10), అతని స్నేహితుడు కోలా యశ్వంత్‌కృష్ణ(10) వెళ్లారు. ఆమె బట్టలు ఉతికే సమయంలో స్నానం చేస్తామంటూ కాలువలోకి దిగారు. అప్పటికే నిండుగా ప్రవహిస్తున్న కాలువ వారిని లాగివేయడంతో మునిగిపోయారు. ఒడ్డున ఉన్న తల్లి వారిని కాపాడాలంటూ అరుస్తూ తన వద్ద ఉన్న చీరను వారిని కాపాడేందుకు విసిరినా ఫలితం లేకపోయింది. స్థానికులు వెంటనే నీటిలో దూకి పిల్లలను బయటకు తీసుకువచ్చారు. కానీ అప్పటికే ఇద్దరు బాలురు మృతి చెందారు. మృతుల్లో ఒకరి తండ్రి కార్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండగా, మరొకరి తండ్రి దినసరి వేతన కూలీ. ఇద్దరూ ఆయా కుటుంబాల్లో ఒక్కరే మగ సంతానం. ఆదివారం స్కూల్‌కు సెలవు కావడంతో ఆనందంగా ఆడుకుందామని కాలువవద్దకు వెళ్లిన ఇద్దరు బాలురు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.



రెడ్డి అజయ్, కోలా యశ్వంత్‌కృష్ణ మృతదేహాల వద్ద కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు


వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ భట్టి

వేణుగోపాలుని సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టి

కోడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్.వి.ఎన్.భట్టి కుటుంబసమేతంగా హంసలదీవి బీచ్‌ని ఆదివారం సందర్శించారు. సాగరతీరాన పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గ్రామంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సత్కరించి వేణుగోపాలస్వామి జ్ఞాపకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేణుగోపాలస్వామి ఆలయాన్ని దర్శించుకోవటం నా పూర్వజన్మసుకృతం అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, అవనిగడ్డ జీఎఫ్‌సీఎం లంక గోపినాథ్, సబ్ కోర్టు జడ్జి బాబూ నాయక్, మొవ్వ న్యాయాధికారి రాజన్ ఉదయ ప్రకాష్, హైకోర్టు రిజిస్ట్రార్ లక్ష్మణరావు, జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ మురళీధర్, సీఐ యువకుమార్, ఎస్ఐలు చాణిక్య, శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీను నాయక్, కార్యదర్శి లీలా ప్రియాంక పాల్గొన్నారు. ఆయన వెంట జిల్లా న్యాయాధికారులు, ఏఆర్ అడిషనల్ జిల్లా ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.


దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ దర్శనానికి కార్తీకమాసం ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దుర్గామల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలు సమర్పించి, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి కొండపైన అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు పొంగళ్లు సమర్పించారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. అనధికార దర్శనాలను కట్టడి చేసేందుకు క్యూలలో విధివిధానాలపై సిబ్బందికి అధికారులు పలు సూచనలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా మహామండపం రెండో అంతస్తుతో పాటు మొదటి అంతస్తులో కూడా అన్నప్రసాద స్వీకరణకు ఏర్పాట్లు చేశారు.


దుర్గమ్మకు మంగళసూత్రం కానుక సమర్పిస్తున్న భక్తులు

దుర్గమ్మకు మంగళసూత్రాల కానుక..

విజయవాడ గొల్లపూడికి చెందిన వై.నాగరాజు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి అలంకరణ నిమిత్తం 35 గ్రాముల మంగళసూత్రాలు కానుకగా ఆలయ సిబ్బందికి అందజేశారు.


కుటుంబసమేతంగా దుర్గమ్మను దర్శించుకున్న డీజీపీ


డీజీపీ ద్వారకా తిరుమలరావు కుమార్తె గాయత్రీ సోనాక్షి వివాహమైన సందర్భంగా ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు.

మల్లేశ్వరునికి సహస్రలింగార్చన

కార్తీకమాసోత్సవాల్లో భాగంగా ఆదివారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన సేవా కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్రలింగార్చన నిర్వహించారు. స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు.

ఆకట్టుకున్న భక్తిరంజని కార్యక్రమాలు

విజయవాడ శృతిలయ సాంస్కృతిక సమాఖ్య డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య ఆదివారం దుర్గగుడి కళావేదికపై భక్తిరంజని కార్యక్రమాన్ని నిర్వహించారు. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయశాస్త్రి, తబలాపై చిట్టిబాబులు సహకరించారు. చక్కని భక్తిరంజని కార్యక్రమంతో భక్తులను అలరించారు.


ట్రోఫీ అందుకుంటున్న విశాఖ జట్టు

అండర్-14 క్రికెట్ చాంపియన్ విశాఖ

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మూలపాడు వేదిక గా ఏసీఏ పర్యవేక్షణలో జరుగుతున్న అండర్-14 మల్టీడేస్ అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ చాంపియన్‌షిప్‌ను విశాఖ కైవసం చేసుకుంది. గుంటూరుతో జరిగిన మ్యాచ్‌ను విశాఖ డ్రా చేసుకోవడం ద్వారా అత్యధిక పాయింట్లతో విజేతగా అవతరించింది. నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతున్నాయి. విశాఖ జిల్లాకు ట్రోఫీని కేడీసీఏ సెక్రటరీ ఎం.రవీంద్రచౌదరి, చైర్మన్ పి.విజయ్‌కుమార్, కె.భరత్‌రెడ్డి, ఎం.కోటరెడ్డి, బి.మంగేష్‌లు అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెతలెన్నో..

» రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ ఎన్ఎంయూ వినతి

బస్‌స్టేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆన్‌కాల్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరారు. ఆదివారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో జోన్‌లు, 26 జిల్లాల కమిటీ నాన్ ఆపరేషన్, కేంద్ర కార్యాలయం నుంచి హాజరైన ఉద్యోగులతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆన్‌కాల్ డ్రైవర్లతో సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీలో ఏళ్లతరబడి విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వపరంగా వారికి రావాల్సిన సౌలభ్యాలు, సౌకర్యాల ఏర్పాటు గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జీవో ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలను వెంటనే అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ చెల్లింపులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలన్నారు. ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రావి సుబ్బారావు, జోనల్ కార్యదర్శి ఎ.రామారావు, జిల్లా కార్యదర్శి సీహెచ్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు


యూటీఎఫ్ జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషిచేయండి

» పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గవర్నర్‌పేట : ఉపాధ్యాయుల పట్ల నిరంకుశ ధోరణి కారణంగానే గత ప్రభుత్వం ఓటమి పాలైందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా మహాసభలు ఆదివారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకెలో ఘనంగా జరిగాయి. యూటీఎఫ్ వ్యవస్థాపక నేత వి.రంగారావు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను లెక్కచేయకుండా వ్యవహరించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఆలోచించాలని, తక్షణమే ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ కమిటీ సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, విద్యారంగాన్ని కాపాడటంలో ప్రభుత్వ పాత్ర ఎంతో ఉందని, జీవో 117ను రద్దు చేయాలని కోరారు. టీచర్స్ బదిలీ చట్టంపై సమగ్ర చర్చ జరిపి, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలు తీసుకుని రూపొందించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ నేతలు కె.తిరుపతిరెడ్డి, సీహెచ్ పద్మావతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య, నాదెండ్ల సీతారామాచారి, పి.వెంకటేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కోడూరు నారాయణరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది.


సెపక్‌తక్రా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పథకాలను అందిపుచ్చుకోవాలి

» సెపక్‌తక్రా పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె

విజయవాడస్పోర్ట్సు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి పలు నగదు పారితోషికాలను ప్రకటించిందని, క్రీడల్లో సత్తా చాటి ప్రభుత్వ పథకాలను అందుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పటమట జిల్లా పరిషత్ స్కూల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి బాలబాలికల సెపక్ తక్రా చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడల్లో పతకాలు సాధిస్తే ప్రభుత్వం తరపున నగదు బహుమతులే కాకుండా ఉద్యోగాల్లో కోటాను 2 నుంచి 3 శాతం పెంచారని గుర్తుచేశారు. సభకు జిల్లా క్రీడల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి, ఆక్వాడెవిల్స్ ఉపాధ్యక్షులు జి.సాంబశివరావు, హైకోర్టు న్యాయవాది ఎం.ఆనంద్‌కుమార్, హెచ్ఎం ఎంజీ సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుర విభాగంలో కృష్ణా, అనంతపురం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విజయనగరం, నెల్లూరు, కడప, కర్నూల్, బాలికల విభాగంలో పశ్చిమగోదావరి, విశాఖ, నెల్లూరు, కర్నూల్, కృష్ణా, విజయనగరం, అనంతపురం, తూర్పుగోదావరి జట్లు క్వార్టర్స్ ఫైనల్స్‌కు చేరాయి.

ఆదర్శనీయుడు పట్టాభి

» మండలి బుద్ధప్రసాద్

మచిలీపట్నం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య ముందు చూపుతో ఆంధ్రాబ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీలు స్థాపించి పలువురికి ఆదర్శప్రాయంగా నిలిచారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆంధ్రాబ్యాంకు రిటైర్డు ఉద్యోగుల సంఘం, పట్టాభి మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్టు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గాంధీ కస్తూరిబా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టాభి సీతారామయ్య నివాసంలో ఘనంగా పట్టాభి జయంతి ఉత్సవాలు జరిగాయి. ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమర ఉద్యమంలో పట్టాభి సీతారామయ్య పాత్ర మరువలేనిదన్నారు. భారత కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలం వర్కింగ్ కమిటీ బాధ్యతలు నిర్వర్తించిన ఏకైక తెలుగు వారు పట్టాభి అన్నారు. అప్పట్లో మచిలీపట్నంలోని పట్టాభి సీతారామయ్య ఇంటి వద్ద పలువురు స్వాతంత్ర్య ఉద్యమకారులతో సమావేశాలు జరిగేవన్నారు. గాంధీమహాత్ముడు రెండు పర్యాయాలు పట్టాభి సీతారామయ్య ఇంటికి వచ్చారన్నారు. గాంధీ కస్తూరి సేవా సంఘం ప్రతినిధి సింగరాజు గోవర్ధన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ వెంకట్రావు మాట్లాడుతూ, పట్టాభి సీతారామయ్య జయంతి ఉత్సవాల్లో యూనియన్ బ్యాంకు అధికారులు పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజారాం, వివి కృష్ణారావు, కొండలరావు, జగన్‌మోహనరావులు మాట్లాడారు.


పట్టాభి సీతారామయ్య జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

పోలవరం కాల్వలో గల్లంతైన మృతదేహం లభ్యం

» మరొకరి కోసం ఎన్డీఆర్ఎఫ్ గాలింపు

చిట్టినగర్/ఇబ్రహీంపట్నం/విజయవాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 22న కొత్తూరు తాడేపల్లి సమీపంలోని పోలవరం కాలువలో గల్లంతైన ఇద్దరు యువకుల్లో ఒకరి మృతదేహం ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణా నదిలో లభ్యమైంది. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా.. యువకులు గల్లంతైన ప్రాంతం నుంచి సుమారు 10 కిలోమీటర్ల అవతల ఫెర్రీ వద్ద శివతేజ(18) మృతదేహం కనిపించింది. విజయవాడ అజిత్‌సింగ్ నగర్ స్మైల్ ఆసుపత్రి ప్రాంతానికి చెందిన శివతేజ, మున్వర్‌తో పాటు ఆరుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు 22వ తేదీన జక్కంపూడిలోని పోలవరం కాల్వలో స్నానానికి వెళ్లిన విషయం తెలిసిందే. వారిలో శివతేజ, మున్వర్ నీటిలో గల్లంతయ్యారు. కొత్తపేట పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. సోమవారం కూడా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.


తండ్రికి అంతిమ సంస్కారం చేస్తున్న కుమార్తె

తండ్రికి కుమార్తె తలకొరివి..

కూచిపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మగపిల్లలు లేని ఆ కుటుంబంలో కుమార్తె అన్నీ తానై తండ్రికి అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది. ఈ ఘటన మొవ్వ మండలం పెదపూడి గ్రామంలో ఆదివారం జరిగింది. పెదపూడి గ్రామానికి చెందిన తాతా అర్జునరావు (75) అనారోగ్యంతో మరణించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు దాసరి వాణి, కేసాని చైతన్య ఉన్నారు. కుమారుడు లేకపోవటంతో చిన్న కుమార్తె చైతన్య తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది. శ్రీకాకుళంలోని కృష్ణానది ఒడ్డున నిర్వహించిన అంత్యక్రియల కార్యక్రమంలో తలకొరివి పెట్టింది.

రైజ్ ఎన్ రైజ్ కార్తీక సందడి

» 2500 మందితో వనసమారాధన

పాయకాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో పరమేశ్వరుడికి వెలిగించే జ్యోతి మన జీవితంలో పెనుమార్పులు తీసుకువస్తుందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ రైజ్ ఎన్ రైజ్ ఆధ్వర్యంలో కొత్తూరు తాడపల్లిలో కార్తీక వనసమారాధన కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి వెలిగించి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ, గత ఎనిమిదేళ్లుగా తక్కువ ధరకు పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన ఇళ్ల స్థలాలను అందజేస్తున్న రైజ్ ఎన్ రైజ్ సంస్థ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కరరాజును అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ, ఎన్నో వెంచర్లను దిగ్విజయంగా పూర్తి చేసిన ఉదయ భాస్కర రాజు సేవా కార్యక్రమాల్లో కూడా ఎప్పుడు ముందుంటారని కొనియాడారు. కార్తీక వన సమారాధనలో 2500 మంది పాల్గొనగా మహిళలకు మెహందీ, టాటూలతో పాటు డ్యాన్స్ కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కరరాజు మాట్లాడుతూ, వనసమారాధనకు హాజరైన ప్రతి ఒక్కరిపై పరమ శివుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఉసిరి చెట్టు కింద సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పెన్మత్స సత్యం, జనసేన నేత అమ్మిశెట్టి వాసు, రాధా రంగా మిత్రమండలి సభ్యుడు చెన్నుపాటి శ్రీను, టీడీపీ నేత జంపాల సీతారామయ్య, సంస్థ డైరెక్టర్లు ఎంవీ నాగరాజు, ఎన్.సన్యాసిరావు, ఎ.పెద్దిరాజు, ఎంవీ కృష్ణారావు, వీసీ కుమార్, టి.రాజు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


వనసమారాధనలో ఎమ్మెల్యే బొండా ఉమాను సత్కరిస్తున్న రైజ్ ఎన్ రైజ్ సంస్థ ప్రతినిధులు

వైసీపీ నేత కుమారుడి ఆత్మహత్య!

» ఆకుల శ్రీనివాస్‌కు నేతల పరామర్శ

విద్యాధరపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చదువులో ఒత్తిడికి లోనై వైసీపీ నేత ఆకుల శ్రీనివాస్ కుమార్ రెండో కుమారుడు రాజ్‌కుమార్ (30) ఆఫీసులో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆకుల శ్రీనివాస్ కుమార్ ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నాగార్జున వీధిలోని రివర్‌ఫైన్ అపార్టుమెంట్‌లో ఆకుల శ్రీనివాస్ కుమార్ భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెతో ఉంటున్నాడు. ఇతను వ్యాపారం చేస్తూ వైసీపీలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇతని పెద్ద కుమారుడు విజయ్‌కుమార్ వ్యాపారం నిర్వహిస్తుండగా రెండవ కుమారుడు రాజ్‌కుమార్ ఎంబీబీఎస్ చదివి, ప్రస్తుతం నిమ్రా కాలేజీలో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్నాడు. ఆకుల శ్రీనివాస్ కుమార్‌కు బ్యాంక్ సెంటర్‌లోని ఆకుల రాజేశ్వరరావు వీధిలో కార్యాలయం ఉంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం రాజ్‌కుమార్ నిమ్రా కాలేజీకి వెళ్లి వస్తానని తల్లిదండ్రులకు చెప్పి ఇంటిలో నుంచి బయటకు వెళ్లాడు. కాలేజీ నుంచి భవానీపురం వచ్చి ఆఫీసు తాళాలు కావాలంటూ తండ్రి శ్రీనివాస్ కుమార్‌కు ఫోన్‌చేయగా, ఓ యువకుడి చేత తాళాలు ఇచ్చి పంపారు. కొద్దిసేపటికి శ్రీనివాస్ కుమార్ రాజ్ కుమార్‌కు ఫోన్ చేయగా, ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆయన ఆఫీసుకు వెళ్లి చూడగా ఆఫీసుకు తాళం వేసిఉంది. శ్రీనివాస్ కుమార్ వద్ద ఆఫీసు రెండవ తాళం ఉండటంతో తలుపు తీయటానికి ప్రయత్నించగా రాకపోకపోవటంతో బలవంతంగా తలుపు నెట్టి చూడగా రాజ్‌కుమార్ లోపల దుప్పటితో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వ్రేలాడుతూ కనిపించాడు. ఆయన కిందకు వచ్చి స్థానికుల సహాయంతో రాజ్‌కుమార్‌ను కిందకు దించి చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. డాక్టర్లు రాజ్ కుమార్‌ను పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి వెళ్లి వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టంనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


రాజ్‌కుమార్ (ఫైల్)

ఆకుల శ్రీనివాస్‌కుమార్‌కు నేతల పరామర్శ

ఆకుల శ్రీనివాస్ కుమార్ రెండో కుమారుడు రాజ్ కుమార్ మృతి సమాచారం తెలుసుకున్న పలువురు రాజకీయ పార్టీ నాయకులు ఆయనకు ఫోన్‌చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైసీపీ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అయోధ్య రామిరెడ్డి, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్‌తో పాటు కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాల నాయకులు ఆయనకు ఫోన్ చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాషాయికరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

» మాదం తిరుపతి

ధర్నాచౌక్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న కాషాయికరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని భారత ఐక్యవిద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జాతీయ కన్వీనర్ మాదం తిరుపతి పిలుపునిచ్చారు. డిసెంబరు 14, 15 తేదీల్లో నిర్వహించనున్న మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ జీడీపీలో 10శాతం విద్యకు కేటాయించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల బలోపేతానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3400 కోట్లను తక్షణమే విడుదల చేయాలన్నారు. సంఘం జాతీయ నేత తాడికొండ రవి, రాష్ట్ర కార్యదర్శి సందెపోగు ఉదయ్ కుమార్, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకట్‌రెడ్డి యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

ధర్నాచౌక్ : సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ పీరియడ్ (అప్రెంటీస్)కాలాన్ని సర్వీస్‌గా లెక్కించి నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. సెలవు రోజుల్లో ఎటువంటి విధులు కేటాయించకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన జేఏసీ సమావేశంలో తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో నేతలు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. మధువర్తి రమేష్‌బాబు, బావుబారి క్రాంతికుమార్, మారుతిచంద్ర, పులిబండ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

జనవరి 5న హైందవ బహిరంగ శంఖారావ సభ

గన్నవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న కేసరపల్లిలో హైందవ బహిరంగ శంఖారావం సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ150 ఎకరాల్లో జరిగే బహిరంగ సభకు సుమారు రెండు లక్షల మంది వరకూ వస్తారని తెలిపారు. హిందువులందరికి హైందవ శంఖారావం సభ ప్రాముఖ్యతను, దేవాలయాల వ్యవస్థను బలపరిచే ఉద్దేశ్యంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్ విశ్వహిందూ పరిషత్ ప్రాంత సంఘటన మంత్రి శ్రీనివాస రెడ్డి, చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్, సమర సత సేవ ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ జై శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్



వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం హైదరాబాద్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్.నాయుడును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. టీవీ-5 చైర్మన్‌గా ఇరు రాష్ట్రాల తెలుగు ప్రజలకు సుపరిచితులైన బి.ఆర్.నాయుడు స్వయంకృషి, పట్టుదల, నిబద్ధతకు ప్రతీక అని ఎంపీ కొనియాడారు. అనంతరం వీరు తిరుమలతో పాటు పలు రాష్ట్ర అభివృద్ధి అంశాలపై చర్చించారు.


సమావేశంలో పాల్గొన్న నేతలు

ముఖ్యమంత్రికి రజకుల సమస్యలు వివరిస్తాం..

» రజక చైతన్య సేవా సంస్థ

ధర్నాచౌక్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రజకులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవి కేటాయించడంపై రజక చైతన్య సేవా సంస్థ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు నేతలు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో రజక నేతల సమావేశం ఆదివారం జరిగింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా రజకులు కృషి చేశారని నేతలు గుర్తుచేశారు. సీఎం చంద్రబాబును కలిసి సమస్యలు వివరిస్తామని, తమకు న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, పొదిలి శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరు మధుసూదన్, జనసేన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(కి.లో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 595





విద్యుత్ ఫీజ్ బాక్స్ చుట్టూ రక్షణ చర్యలేవీ..?

భారతీనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 4వ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్ వీఎంసీ పార్కు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫామ్‌తో పాటు ఫీజ్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. పార్కు, మెయిన్ రోడ్డుకు పక్కనుండటంతో దానికి రక్షణగా ఇనుప తీగలను ఏర్పాటు చేశారు. ఇవి ఏర్పాటు చేసి ఏళ్ల గడిచిపోవడంతో ప్రస్తుతం అవి ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. ప్రధానరోడ్డు కావడంతో ప్రజలు ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బ్లైండ్ స్కూల్ విద్యార్థులకు ఉపకారవేతనాలు, కుట్టుమిషన్లు అందిస్తున్న పర్వతనేని ప్రభాస్

అంధ విద్యార్థులకు ఉపకార వేతనాలు

మొగల్రాజపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జర్నలిస్టు కాలనీలో కమ్మ విద్యార్థి సేవా సంఘం హాస్టల్ ప్రాంగణంలో ఆదివారం విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ జరిగింది. పర్వతనేని చంద్రశేఖర్‌రావు ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకుడు పర్వతనేని ప్రభాస్ కులమతాలకు అతీతంగా అంధ విద్యార్థులకు రూ.2లక్షల 50 వేల ఉపకార వేతనాలు, రూ.15వేల విలువైన స్పీకర్లు అందించారు. కానూరు వృద్ధాశ్రమానికి చీరలు, ధోతీలు కుట్టుమిషన్‌లు, గ్రైండర్ అందించారు. పీబీ సిద్ధార్థ కళాశాల సైన్సు ప్రొఫెసర్ రహమాన్, పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ వై. పావని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అంధ స్కూల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని వినియోగించుకోవాలి

మొగల్రాజపురం/పటమట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలు ఆరోగ్య సమస్యలున్నప్పుడు వైద్య ఖర్చులకు భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నుంచి బయట పడాలంటే ప్రతి ఒక్కరూ సీఎం సహాయనిధి గురించి తెలుసుకుని వినియోగించుకునేలా చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. 15వ డివిజన్‌లో ఆదివారం రూ.3లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ జరిగింది. అనంతరం మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కూటమి నేతలు, కార్యకర్తలు ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఆటోస్టాండ్ ప్రారంభం

వచ్చే నెల నుంచి అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతాయని దీంతో నగరం కేంద్రంగా రాకపోకలు పెరుగుతాయని ఆటో డ్రైవర్ల బాడుగలు పెరుగుతాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. 15వ డివిజన్‌లో అభయాంజనేయ ఆటో ఆటోస్టాండ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకష్ట జీవులకు ప్రభుత్వం చేయూత అందిస్తుందన్నారు. డివిజన్ నేత గాదిరెడ్డి అమ్మలు మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌లంటే క్రమ శిక్షణ కలిగిన నేతలనే విధంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి అందుబాటులో ఉంటానన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, పఠాన్ హయత్ ఖాన్, చిన్నం ఈశ్వరరావు, కటిక పూడి శేషు, సట్టు శ్రీను, నిమ్మల హేమ, సింగం శెట్టి రమేష్, చెరుకూరి మురళీ, నందమూరి పూర్ణచంద్రరావు, పేరేపి ఈశ్వర్, సభ్యులు మురళీ కృష్ణ, మల్ల నారాయణరావు, తానికారు శబరీష్ పాల్గొన్నారు.



ఆటోస్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

- సీపీఎం తూర్పు నగర మహాసభల్లో వక్తల డిమాండ్

మొగల్రాజపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ రంగంలో కుంభకోణాలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో సోలార్ విద్యుత్ రంగంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చిగురుపాటి బాబూరావు డిమాండ్ చేశారు. సీపీఎం తూర్పు నగర 23వ మహాసభలు సున్నపుబట్టీల సెంటర్‌లో పూలే-అంబేద్కర్ భవన్‌లో ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ కంపెనీ దేశవ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నాలను రద్దు చేయాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో డిసెంబరు నుంచి ఇప్పటి వరకు రూ.6072 కోట్లు వసూలు చేశారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ పెద్దలు అదానీ నుంచి రూ.1750 కోట్లను ముడుపులుగా తీసుకున్నారని వస్తున్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. కొండ ప్రాంత పట్టాల సమస్యలను పరిష్కరించి, రిటైనింగ్‌వాల్ కట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. తూర్పు నగర కమిటీ నూతన కార్యదర్శిగా పి.కృష్ణ, 17 మంది సభ్యులుగా, ఐదురుగు కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. తొలుత నేతు పార్టీ జెండాను ఆవిష్కరించారు. బి. చిన్నారావు, జి. క్రాంతి, కె.రమణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు!

రామలింగేశ్వరనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, రామలింగేశ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్రం, 11 కేవీ రామలింగేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. రఘురోడ్, అయ్యప్ప రోడ్, వీఎం రంగా రోడ్, ఆళ్ల చల్లారావు రోడ్, గాంధీ కాలనీ, ఎర్రపోతుల వారి వీధి, సాయిరాం కట్ పీసెస్ రోడ్, నీలవేణి రోడ్, వీఎంఆర్ రోడ్, కృష్ణవేణి రోడ్, ధారా సుధాకర్ రోడ్, గాయత్రి రోడ్, సాయి స్ట్రీట్, రామలింగేశ్వరనగర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



శ్రీవారి ఆలయంలో సంప్రోక్షణ

లబ్బీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయంలోకి భోగ శ్రీనివాసుని ప్రవేశం సందర్భంగా నిర్వహిస్తున్న ఆలయ సంప్రోక్షణ 3వ రోజు ఆగమ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న భోగ శ్రీనివాసుని విగ్రహాన్ని ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి సాక్షాత్కారాన్ని చూసి భక్తులు పరవశించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో స్వామి విగ్రహాన్ని భక్తుల దర్శనార్థం ఉంచి పూజలు చేశారు. సోమవారం స్వామి ఆలయ ప్రవేశం జరగనుంది.

ఆటపరికరాల కొరత

భారతీనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చదువు విజ్ఞానాన్ని అందిస్తుంది. ఆటలు ఆరోగ్యాన్ని ఇస్తాయన్న మాటలు పాఠాలకే పరిమితమని ఆచరణలో కానరావడానికి ఈ ప్రభుత్వ పాఠశాలే నిదర్శనం. 4వ డివిజన్‌లో ఏపీఐఐసీ కాలనీలోని రేగుల అనురాధ నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో విద్యార్థులు ఆటలాడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట పరికరాలు ధ్వంసమైపోయాయి. గత వేసవి సెలవులకు ముందే ధ్వంసమయ్యాయి. కాగా పాఠశాల పునఃప్రారంభించి సుమారు 4 నెలలు గడిపోయినా ఆట పరికరాల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో విద్యార్థులు క్లాస్‌రూమ్‌లకే పరిమితం కావాల్సి వస్తోంది. అంతే కాకుండా గ్రౌండ్‌లో బిల్డింగ్ మెటీరియల్, రాళ్లు ఉండటంతో విద్యార్థులు ఆటలాడుకునే సమయంలో వారి కాళ్లకు తగలడంతో కింద పడి గాయాలు పాలవుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.









టీడీపీ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ తిరునగరి జ్యోతిని సత్కరించిన సమ భావన మిత్రమండలి సభ్యులు, చిత్రంలో డాక్టర్ కీర్తి తదితరులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం, గుడ్ గవర్నెన్స్

ఆటోనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం, గుడ్ గవర్నెన్స్ అనే సూత్రాలతో కూటమి ప్రభుత్వం ప్రయాణం సాగిస్తోందని, ఆర్థిక స్వావలంబన, ప్రపంచ దేశాల్లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలనే తలంపుతో 10 సూత్రాల పథకంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని టీడీపీ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ తిరునగరి జ్యోతి అన్నారు. ఆదివారం వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో సమ భావనా మిత్రమండలి ఆధ్వర్యంలో 103వ సమావేశంలో భాగంగా టీ శోభనాద్రి శ్రీమంతి సరోజినీదేవి పేరున ధార్మిక ఉపన్యాసం నిర్వహించారు. సమ భావనా మిత్రమండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు అధ్యక్షత వహించారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ విజన్ 2047 ప్రణాళికలో ప్రజల భాగస్వామ్యం, స్వర్ణాంధ్ర ఉద్యోగకల్పన, సాంకేతిక విజ్ఞాన వినియోగం వంటి అంశాలపై వివరించారు. ఆత్మీయ అతిథిగా డాక్టర్ కీర్తి, మహిళా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రసంగించారు. సభలో వై. రంగారావు, డాక్టర్ వైవీ రావు, వై శివాజీ, సీహెచ్ వెంకటరెడ్డి, పేర్లి దాసు, ఎం. అంజయ్య, డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ

ఆటోనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అసాంఘిక కార్యకాలపాలకు పాల్పడితే కఠన చర్యలు తీసుకుంటామని పటమట సీఐ వల్లభనేని పవన్ కిషోర్ హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ ప్రాంగణంలో రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి జీవించాలని, సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే అరెస్టులు తప్పవన్నారు. సమాజంలో గౌరవంగా జీవించేదుకు కృషిచేయాలని హితవు పలికారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్.ఐ రేవతి పాల్గొన్నారు.





వీధిలైటు ఏర్పాటు చేయని విద్యుత్ స్తంభం



చీకటిగా మారిన గమేళా బజార్ రోడ్డు

వెలగని వీధిలైట్లు

భారతీనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమేళా బజార్ ప్రాంతంలోని కరెంటు స్తంభాలకున్న వీధి లైట్లు సరిగా పనిచేయకపోవడంతో పాటు కొన్ని స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డంతా చీకటిగా మారింది. ఆటోనగర్‌కి ఏపీఐఐసీ కాలనీకి మధ్య రోడ్డులో గమేళ బజార్ ప్రాంతం ఉంది. ఈ రోడ్డు వెంబడి వేరే రాష్ట్రాలను నుంచి వచ్చిన ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా గమేళాల తయారు చేసి వాటిని అమ్ముకుంటూ జీవిస్తుంటారు. ఈ రోడ్డులో సుమారు 50కి పైగా నివాసాలుంటాయి. రోడ్డు వెంబడి ఉన్నా కరెంటు స్తంభాలకున్న వీధి లైట్లు పనిచేయకపోవడంతో రోడ్డంతా అంధకారంగా మారుతోంది. దీంతో ప్రజలు రాత్రి సమయంలో బయటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన భార్య రాలేదని ఫిర్యాదు

విద్యాధరపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన భార్య ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని భర్త ఇచ్చిన ఫిర్యాదుపై ఆదివారం భవానీపురం పోలీసులు కేసు నమోదుచేశారు. కామకోటినగర్ పార్థసారథి వీధిలో మాజేటి లక్ష్మీశ్రీనివాస్ కుటుంబం ఉంటోంది. కుమార్తె నెల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి లక్ష్మీశ్రీనివాస్ భార్య కీర్తివర్ధిణి((43), మనస్థాపం చెంది దిగులుగా ఉంటోంది. తన మాట వినకుండా వివాహం చేసుకుందని కోపంతో కుమార్తెను ఇంటికి రానీయొద్దని, ఒకవేళ వస్తే తాను ఇంటి నుం చి వెళ్లిపోతానని భర్తకు తేల్చిచెప్పింది. భర్త నచ్చచెప్పినప్పటికీ వినలేదు. ఆదివారం ఉదయం కుమార్తె తండ్రికి ఫోన్ చేసి రిసెప్షన్ ఏర్పాటు చేసుకున్నామని, అందరూ రావాలని చెప్పింది. శ్రీనివాస్ తన తల్లితో కలిసి కీర్తివర్ధిణికి నచ్చచెప్పినప్పటికీ వినలేదు. తనకు రూ.500 కావాలని లైనింగ్ జాకెట్ ముక్క తెచ్చుకుంటానని భర్త వద్ద డబ్బులు తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మధ్యాహ్నం వరకు ఆమె తిరిగి రాలేదు. దీంతో శ్రీనివాస్ సమీపంలోని షాపు వద్దకు వెళ్లి ఆరా తీశారు. అక్కడకు వెళ్లలేదని తెలిసింది. బంధువులు, స్నేహితులు ఇళ్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. లక్ష్మీశ్రీనివాస్ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాత్వికాదేవిగా భ్రమరాంబ



వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం(పాత శివాలయంలో) కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా ఆదివారం భ్రమరాంబ అమ్మవారు భక్తులకు శ్రీసాత్వికాదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఆలయ ఈవో నటరాజన్ షణ్ముగం పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు రాచకొండ సుమంత్ శర్మ, అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మల్లేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, మహానివేదన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు నిర్వహించారు. చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ చేశారు.

బిజినెస్

విజయవాడ ● సోమవారం 25 నవంబరు 2024

బీమా సుగమ్ కోసం రూ.500 కోట్లు

ముంబై: భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) తలపెట్టిన 'బీమా సుగమ్' ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బీమా మంథన్ సదస్సులో బీమా కంపెనీలు ఈ అంచనాకు వచ్చినట్టు సమాచారం. అన్ని రకాల బీమా పాలసీల మార్కెటింగ్, ఇతర సేవలు ఒకే చోట అందించేందుకు ఐఆర్‌డీఏఐ ఈ సింగిల్ విండో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను తలపెట్టింది. ఇందుకు రూ.100 నుంచి రూ.200 కోట్లు ఖర్చవుతుందని మొదట్లో అంచనా వేశారు. తాజా అంచనాల ప్రకారం ఇందుకు ఎంతలేదన్నా రూ.500 కోట్లు ఖర్చవుతుందని కంపెనీలు ఒక అంచనాకు వచ్చాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభానికల్లా దీన్ని అమలు చేయాలని ఐఆర్‌డీఏఐ యోచిస్తోంది.

దీన్ దయాళ్ క్షేత్రంలో అరకొర ఉత్పత్తితో

ఓఎన్‌జీసీకి తిప్పలు



రోజుకు కేవలం 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ గ్యాస్ ఉత్పత్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ తీరంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో ఉన్న దీన్ దయాళ్ సహజ వాయువు క్షేత్రం.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి పెద్ద గుదిబండలా మారింది. భారీ గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయనే పేరుతో గుజరాత్ ప్రభుత్వ రంగ సంస్థ గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎస్‌పీసీఎల్) ఈ గ్యాస్ ఫీల్డ్‌ను 2017 జూలైలో ఓఎన్‌జీసీకి అంటగట్టింది. అంతకు ముందే జీఎస్‌పీసీ ఈ సహజ వాయు క్షేత్రంలో తనకున్న 80 శాతం వాటాలో 50 శాతం ఇస్తానన్నా ఓఎన్‌జీసీ తిరస్కరించింది. అయితే 2017కు వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. దీన్ దయాళ్ ఫీల్డ్ ఈక్విటీలో తనకున్న మొత్తం 80 శాతం వాటాను జీఎస్‌పీసీ.. ఓఎన్‌జీసీకి రూ.7,738 కోట్లకు విక్రయించింది.

అంతా 'గ్యాసే'

జీఎస్‌పీసీఎల్ ఈ గ్యాస్ ఫీల్డ్‌లో 20 లక్షల కోట్ల ఘనపుటడుగుల (టీసీఎఫ్) గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు, దీన్నుంచి రోజూ 20 కోట్ల ప్రామాణిక ఘనపుటడుగుల (ఎంఎస్‌సీఎఫ్‌పీడీ) గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని మొదట్లో గ్యాస్ కొట్టింది. ఓఎన్‌జీసీకి తన 80 శాతం వాటా అమ్మే నాటికే జీఎస్‌పీసీ ఈ క్షేత్రంలో మూడు గ్యాస్ బావులు తవ్వింది. ఓఎన్‌జీసీ చేతికి వచ్చాక మరో ఏడు బావులు తవ్వారు. సాంకేతిక సమస్యలతో ఇందులో మూడు బావుల డ్రిల్లింగ్ మధ్యలోనే ఆపేశారు. పూర్తి చేసిన మిగతా నాలుగు బావుల్లోనూ రోజువారీ గ్యాస్ ఉత్పత్తి 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ మించడం లేదు.

ఖర్చు బారెడు

తన చేతికి వచ్చాక ఓఎన్‌జీసీ.. దీన్ దయాళ్ క్షేత్రం ఫీల్డ్ అభివృద్ధి కోసం పెద్ద మొత్తమే ఖర్చు చేసింది. ఈ కొనుగోలుతో జీఎస్‌పీసీఎల్ మాత్రం తన అప్పుల భారం కుదించుకుంది. ఓఎన్‌జీసీ మాత్రం తన మిగులు నిధుల్లో ఎక్కువ భాగం ఇందుకోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. మంచి ఆర్థిక స్థోమత, టెక్నాలజీ ఉన్న ఏదైనా సంస్థ ముందుకు వస్తే భాగస్వామ్యంతో దీన్ దయాళ్ గ్యాస్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేయాలని ఓఎన్‌జీసీ చూస్తోంది. అందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఈ గ్యాస్ ఫీల్డ్ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి పెద్ద భారంగా మారింది.

24,300 పైన బుల్లిష్

(నవంబరు 25-29 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ (sic: టెక్ న్యూస్)

నిఫ్టీ గత వారం 24,956-23,263 పాయింట్ల మధ్యన కదలాడి 375 పాయింట్ల లాభంతో 23,907 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,562, 23,644, 23,909, 24,482 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,300 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,400
నిరోధ స్థాయిలు: 24,100, 24,200, 23,400 (24,000 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,700, 23,500, 23,400 (23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	595
వరంగల్	582	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	75
కర్నూలు	107	నెల్లూరు	75
విశాఖపట్నం	120	అనంతపురం	75
గోదావరి	108		

హీరో, జీరో భాగస్వామ్యంలో కొత్త ఈ-బైక్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ భాగస్వామ్యంలో హీరో మోటో కార్ప్ రూపొందిస్తున్న మిడ్ పెర్ఫార్మెన్స్ విద్యుత్ బైక్ అభివృద్ధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్నదని చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీలో పేరెన్నిక గన్న కాలిఫోర్నియాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ 6 కోట్ల డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు హీరో మోటో కార్ప్ డైరెక్టర్ల బోర్డు 2022 సెప్టెంబరులో ఆమోదించింది. తమ భాగస్వామ్యంలో ప్రీమియం విద్యుత్ బైక్‌లు రూపొందిస్తామని 2023లో రెండు కంపెనీలు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యంలో మిడ్ పెర్ఫార్మెన్స్ ఈ- బైక్ అభివృద్ధి దశలో ఉన్నదని హీరో మోటో కార్ప్ సీఈఓ నిరంజన్ గుప్తా తెలిపారు.

డిసెంబరులోనూ ఐపీఓల జోరు

10 ఇష్యూలు.. రూ.20,000 కోట్ల సమీకరణ!

నూఢిల్లీ: సెకండరీ మార్కెట్ ఆటుపోట్లలో ఉన్నా, ప్రైమరీ మార్కెట్ జోరు తగ్గడం లేదు. వచ్చే నెల కూడా 10 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల ద్వారా రూ.20,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో సూపర్ మార్కెట్ చెయిన్ విశాల్ మెగా మార్ట్, బ్లాక్‌స్టోన్ నిర్వహణలోని డైమండ్ గ్రేడింగ్ కంపెనీ ఇంటర్నేషనల్ జెమ్మోలాజికల్ ఇనిస్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి లైఫ్ సైన్సెస్ కూడా ఉన్నట్టు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు చెప్పాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, యూపీ ఉప ఎన్నికల ఫలితాలతో ఐపీఓ మార్కెట్ సెంటిమెంట్ పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ వారం రాజేష్ పవర్ సర్వీసెస్ సహా మొత్తం ఆరు పబ్లిక్ ఇష్యూలు ప్రారంభమవుతుండగా ఎన్‌టీపీసీ గ్రీన్‌తో పాటు మరో మూడు కంపెనీలు మార్కెట్లో లిస్ట్ కానున్నాయి.

లాభాల బాటలోనే.!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, డాలర్ దూకుడు తగ్గటం, చైనా ఉద్దీపన పథకంతో పెద్దగా ప్రయోజనాలు లేకపోవటం, విదేశీ సంస్థాగత మదుపరులు మళ్లీ తిరిగొచ్చే సూచనలు, అదానీపై కోర్టు అభియోగాల ప్రభావం తగ్గిపోవటమే ఇందుకు కారణాలు. గత శుక్రవారం సెషన్ ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. ఫండమెంటల్స్ బలంగా ఉన్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో బీజేపీ విజయం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపింది.

స్టాక్ రికమండేషన్స్

జుబిలెంట్ ఫుడ్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. తాజా త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటం, ఈపీఎస్ పెరగటంతో మూమెంటమ్ కనిపిస్తోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేరు కొంత దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో ఉంది. గత శుక్రవారం 4.5 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.630/600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.675/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.580 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పేటీఎం: పేమెంట్ బ్యాంక్ సేవలకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో దూసుకుపోతోంది. నష్టాల మార్కెట్లోనూ పటిష్ఠతను సూచించింది. రిలేటివ్ స్ట్రెంత్ చాలా బాగుంది. ప్రస్తుతం కీలక రెసిస్టెన్స్ జోన్ వద్దకు చేరుకుంటోంది. దాన్ని బ్రేక్ చేస్తే ఇక తిరుగులేదు. గత శుక్రవారం 6.5 శాతం లాభంతో రూ.900 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫీనిక్స్ మిల్స్ లిమిటెడ్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 33 శాతం మేర పతనమైంది. తాజాగా మళ్లీ పెరుగుతూ వస్తోంది. చివరి నాలుగు సెషన్లలో ఏకంగా 18 శాతం పెరిగింది. గత శుక్రవారం 5.33 శాతం లాభంతో రూ.1,616 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,600 స్థాయిలో ప్రవేశించి రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,560 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రియా లైఫ్ సైన్సెస్: ఐపీఓ ఇష్యూ ధర నుంచి 70 శాతం మేర పతనమైన ఈ షేరు గత ఏడాది మార్చి నుంచి టర్న్ అరౌండ్ అయ్యాయి. అప్పటి నుంచి బుల్‌రన్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ షేరుకు ఐపీఓ గరిష్ఠ స్థాయి వద్ద మద్దతు లభించింది. సేల్స్ ఈపీఎస్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం 14 శాతం లాభంతో రూ.806 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.780 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.860/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విజయ డయాగ్నోస్టిక్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. మెరుగైన ఫలితాలు ప్రకటించటం, ఈపీఎస్, సేల్స్ పెరగటంతో మూమెంటమ్ పెరిగింది. బడా ఇన్వెస్టర్లు అక్యుములేట్ చేసుకుంటున్నారు. చివరి మూడు సెషన్లలో 25 శాతం పెరిగిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,160 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 ఎగువన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో డౌన్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 23,300 కన్నా దిగజారినా శుక్రవారం ఏర్పడిన బలమైన రికవరీలో 560 పాయింట్ల మేరకు లాభపడింది. చివరికి గత వారంతో పోల్చితే 375 పాయింట్ల లాభంతో 23,900 సమీపంలో ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ ఎనిమిది వారాల డౌన్‌ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీ సాధించింది. అయితే మార్కెట్ ఇప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ నిట్టనిలువుగా బౌన్స్‌బ్యాక్ సాధించినందు వల్ల స్పష్టమైన సందేశం ఇవ్వాలంటే కన్సాలిడేట్ కావడం తప్పనిసరి. అయితే ఈ రివర్సల్‌తో తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పును మాత్రం తప్పించుకుంది. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 975 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 155 పాయింట్లు లాభపడ్డాయి. ఈ వారంలో నిఫ్టీ మరింత పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో 24,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత పాజిటివ్ సంకేతం ఇవ్వాలంటే నిఫ్టీ తదుపరి నిరోధం 24,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ స్థాయిలు 24,350, 24,550. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు.

బేరిష్ స్థాయిలు: ఏ మాత్రం బలహీనత ప్రదర్శించినా మద్దతు స్థాయి 24,000 వద్ద కన్సాలిడేషన్ తప్పనిసరి. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 23,800, 23,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 950 పాయింట్ల మేరకు రికవరీ సాధించి చివరికి 51,000 కన్నా స్వల్పంగా పైన క్లోజైంది. మరింత సానుకూలత కోసం తదుపరి నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,200. ప్రస్తుత మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 49,400.

పాటర్న్: నిఫ్టీ గత వారం 200 డీఎంఏ వద్ద రికవరీ సాధించింది. ఇప్పుడు నిరోధ స్థాయి 24,100 సమీపంలో గల 25 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ గత వారం ఓవర్‌సోల్డ్ స్థితి నుంచి కోలుకుంటున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,000, 24,155
మద్దతు	24,000, 23,920



నవ్య | చిత్రజ్యోతి



ఆ కోరికను పుష్ప 2 తీర్చింది

'పుష్ప చిత్రం అంతర్జాతీయ స్థాయిలో నాకు నటుడిగా గుర్తింపును ఇచ్చింది. డిసెంబర్ 5న వస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంతో దేశవ్యాప్తంగా వైల్డ్ ఫైర్ రాబోతోంది. మూడేళ్ల నా జీవితాన్ని ఈ సినిమాకు అంకితం చేశాను. హీరో అయినప్పటి నుంచి చెన్నైలో నా సినిమా కార్యక్రమం ఒక్కటైనా చేయాలనుకుంటున్నాను. ఆ కోరికను 'పుష్ప 2' తీర్చింది' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఆదివారం చెన్నైలో 'వైల్డ్ ఫైర్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అల్లు అర్జున్, శ్రీలీల నర్తించిన ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ 'రష్మిక తక్కువ సమయంలోనే నా మనసుకు దగ్గరయ్యారు. తను నన్ను చాలా బాగా ప్రోత్సహించారు. అల్లు అర్జున్ పాట కావడంతో బాగా కష్టపడ్డాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'పుష్ప'కు ముందు తర్వాత అనేలా నా కెరీర్ మారింది. నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా ఈ చిత్రం మిగిలిపోతుంది' అన్నారు.

ఖరీదైన కానుకలు ఇచ్చా



ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన వెబ్ సిరీస్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె హీరో వరుణ్ ధావన్‌తో 'స్పైసీ ర్యాపిడ్ ఫైర్' అనే సరదా సంభాషణలో పాల్గొన్నారు. 'ట్రూత్ అండ్ డేర్' గేమ్‌లా ఉండే ఇందులో.. వరుణ్ అడిగిన దానికి సమాధానం చెప్పాలి.. చెప్పలేకపోతే పచ్చిమిర్చి తినాలి. 'మీరు ఏ వస్తువుల కోసం డబ్బులు అనవసరంగా ఖర్చు చేశారు' అని వరుణ్ అడిగారు. "నా ఎక్స్‌కు ఇచ్చిన కానుకల కోసం' అని సమంత సమాధానమిచ్చారు. 'అవునా.. ఎంత ఖర్చైంది' అని వరుణ్ అడగ్గా.. 'కొంచెం ఎక్కువే.. ఇక, తరువాతి ప్రశ్నకు పోదామా' అని సమంత బదులిచ్చారు. 'మీరు ఈ కార్యక్రమానికి వచ్చే ముందు ఎవరికి చివరగా మెసేజ్ చేశారు. దాన్ని పైకి చదివి వినిపిస్తారా' అని వరుణ్ అడగ్గా.. ఆ ప్రశ్నకు సమాధానమివ్వని సామ్ పచ్చిమిర్చి తిన్నారు.

ప్రేమంటారా? కాదంటారా?



ప్రేమలో ఉన్నామని పైకి చెప్పకపోయినా తరచూ చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతూ కెమెరాలకు చిక్కుతున్నారు విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్న. తాజాగా ఈ జంట మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. వీరిద్దరూ కలసి ఓ రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చెన్నైలో నిర్వహించిన 'పుష్ప 2' కార్యక్రమంలో 'మీ ప్రేమ, పెళ్లి గురించి చెప్పండి' అని యాంకర్ రష్మికను అడగ్గా 'తొందరెందుకు 'పుష్ప 2' విడుదలయ్యాక మీరే చూస్తారు కదా' అని బదులిచ్చారు. ఇండస్ట్రీకి చెందిన వ్యక్తా, బయట వ్యక్తా అని అడిగితే 'అది అందరికీ తెలిసిన విషయమే కదా' అంటూ స్పందించారు.







కండరాలు బలంగా ఉండాలంటే

శరీరం ఆరోగ్యంగా ఉన్నపుడే కండరాలు కూడా పటిష్టంగా ఉంటాయి. పాలు, పండ్లు, తాజా కూరగాయలు తరచూ తీసుకుంటూ ఉంటే శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు అంది కండరాలు దృఢంగా పెరుగుతాయి. కండరాల ఆరోగ్యాన్ని పెంచే కొన్ని పండ్ల గురించి తెలుసుకుందాం.

అరటిపండు

● దీనిలో అత్యధికంగా పిండిపదార్థాలు, పొటాషియం, గ్లైకోజెన్ నిల్వలు ఉంటాయి. ఇవి కండరాల తిమ్మిరిని పోగొడతాయి. వ్యాయామం చేసేముందు తరవాత కూడా అరటి పండు తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది.

జామ

● ఈ పండులో ప్రొటీన్లు, పీచుపదార్థం, సి విటమిన్ ఉంటాయి. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం ఒక జామపండు తినడం వల్ల కండరాల్లో శక్తి పెరుగుతుంది

మామిడి

● మామిడి పండులో పిండిపదార్థాలతోపాటు ఎ, సి, కె విటమిన్లు ఉంటాయి. ఇవి కండరాల బలహీనతను నివారిస్తాయి.

దానిమ్మ

● ఈ పండులో యాంటీఆక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి. దానిమ్మ పండు గింజలను తరచూ తినడం వల్ల కండరాలకు రక్త ప్రసరణ సజావుగా జరుగుతుంది. కండరాల్లో వాపు, నొప్పి రాకుండా ఉంటాయి.

బొప్పాయి

● ఈ పండులో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది శరీరంలోని ప్రొటీన్లను త్వరగా జీర్ణం చేసి కండరాల్లో పుళ్లు రాకుండా చేస్తుంది. బొప్పాయిని తరచూ తినడం వల్ల శరీరానికి, కండరాలకు సత్తువ లభిస్తుంది.

పుచ్చకాయ

● ఇది శరీరంలో నీటి శాతం తగ్గకుండా చేస్తుంది. దీనిలో ఉండే సిట్రులైన్ అనే పదార్థం శరీర కండరాలకు రక్త ప్రసరణను పెంచి అవి బిగుసుకోకుండా చేస్తుంది. తరచూ పుచ్చకాయ ముక్కలు తినడం వల్ల కండరాల్లో కదలికల సమస్యలు రాకుండా ఉంటాయి.

సీతాఫలం

● ఈ పండులో అత్యధికంగా పిండిపదార్థాలు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం సీతాఫలం తినడం వల్ల శరీరంలో గ్లైకోజెన్ నిల్వలు పెరిగి కండరాలు పటిష్టంగా ఉంటాయి.

మురిపించే ముత్యాల సరాలు

మహిళలకు ఎన్ని రకాల నగలున్నా ముత్యాలపై ఉండే ఇష్టం మాత్రం ప్రత్యేకం. సంప్రదాయకంగా కనిపిస్తూనే ట్రెండీగా ఆకట్టుకుంటాయి ముత్యాల నగలు. చీరలు, లెహంగాలు, డ్రెస్‌లపై అందంగా అమరి అతివల దర్పాన్ని పెంచుతాయి. ప్రతి మహిళ ఎంతో అపురూపంగా ఇష్టంగా ధరించే ముత్యాల చెవిపోగుల వివరాలు మీకోసం....

స్టడ్స్

● పెద్ద సైజు తెల్లని ముత్యం అమర్చిన బంగారు లేదా ప్లాటినం దిద్దులు మధ్య వయసు మహిళలకు చక్కగా నప్పుతాయి. ఒక ముత్యం చుట్టూ చిన్న చిన్న అమెరికన్ డైమండ్స్ లేదా చిన్న చిన్న ముత్యాలు చేర్చిన స్టడ్స్ లేటెస్ట్ ట్రెండ్.

హూప్స్

● ఇవి రింగుల మాదిరి ఉంటాయి. అన్ని సైజుల్లో లభ్యమవుతాయి. బంగారు రింగుల మీద వివిధ సైజుల ముత్యాలు కలగలిపి పొదిగిన పెర్ల్ హూప్స్ ఎంతో అందంగా ఉంటాయి. ఇవి ఏ వయసు మహిళలకైనా సూటవుతాయి. పూర్తిగా ముత్యాలతోనే తయారు చేసిన హూప్స్ అమ్మాయిలకు మోడ్రన్ డ్రెస్‌ల మీద ట్రెండీ లుక్‌నిస్తాయి.

జుంకాలు

● పెద్ద బుట్టల మీద రకరకాల ముత్యాలు పొదిగిన అందమైన జుంకాలు అమ్మాయిలకు అద్భుతంగా ఉంటాయి. ముఖం ఏ తీరులో ఉన్నా ఈ జుంకాలు చక్కగా నప్పుతాయి. ముత్యాలను గుత్తులుగా గుండ్రంగా పేర్చి పైన పెద్ద ముత్యాన్ని స్టడ్‌గా జతచేసిన జుంకాలను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. జుంకాలకు వ్రేలాడే ముత్యాలు అదనపు సొగసునిస్తాయి.

చాంద్‌బాలియన్లు

● గుండ్రని లేదా అర్ధ చంద్రాకారపు చాంద్‌బాలియన్లకు ముత్యాలు జతచేస్తే ఆ అందమే వేరు. ఇవి చీరలమీద, లెహంగాల మీద గ్రాండ్ లుక్‌నిస్తాయి. చాంద్‌బాలీలకు వాటి ఆకారాన్ని అనుసరించి కొన్ని వరసల్లో ముత్యాలు పొదిగి మరికొన్ని చిన్న ముత్యాలను వ్రేలాడేలా రూపొందిస్తున్నారు. ఇవి ఏ ఛాయలో ఉన్నవారికైనా చక్కగా నప్పుతాయి.



అభిరుచి

తిరుపతి గోవిందరాజస్వామి దేవాలయం... తరచూ వెళ్లేదే.
కానీ అక్కడున్న రుక్మిణీ సత్యభామ సమేత పార్థసారథి పెరుమాళ్ గురించి ఎంతమందికి తెలుసు?
బ్రహ్మంగారు ప్రస్తావించిన అనిమెల సంగమేశ్వర ఆలయం ప్రత్యేకత ఏమిటి?
నంద్యాల వాల్మీకీ గుహలు... బేతంచర్ల బిల్వసర్గం గుహలు... విగ్రహ రూపంలో దర్శనమిచ్చే పరమేశ్వరుడు... భారతీయ సంస్కృతికి చిహ్నంగా నిలిచే అలనాటి వారసత్వ కట్టడాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, వాటిల్లోని వాస్తుశిల్ప శైలులను తన యూట్యూబ్ చానల్ ద్వారా మన ముందు ఉంచుతోంది... లా విద్యార్థిని... ఇందిరా ప్రియదర్శిని.
విలువైన మన సాంస్కృతిక వైభవాన్ని తరతరలకూ అందించే మహాసంకల్పంతో ముందుకు సాగుతున్న ఇందిరతో 'నవ్య' మాటామంతి.



ఆమె కళ్లతో... అపురూప దర్శనం

"గుడికి వెళతాం. దైవ దర్శనం చేసుకొంటాం. వచ్చేస్తాం. పురాతన కట్టడాలను సందర్శిస్తాం. ఆ అపురూపాలను చూసి మురిసిపోతాం. కానీ వాటి నిర్మాణ శైలి ఏంటి? ఆ ప్రాంతాలను ఏలిన రాజులు ఎవరు? ఎవరి వారసత్వానికి అవి చిహ్నాలు? అక్కడి శాసనాలు ఏం చెబుతున్నాయి? వాటితో ముడిపడివున్న మన సంస్కృతి గురించి చాలామందికి తెలియకపోవచ్చు. ఇలాంటి విలువైన సమాచారాన్ని... తద్వారా ఘనమైన భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలన్న లక్ష్యంతోనే నేను యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. కొవిడ్ సమయంలో దీనికి అంకురార్పణ జరిగింది. మా సొంతూరు అనంతపురం. మా నాన్న పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. దాదాపు పదేళ్లుగా కడపలో నివాసం.



అమ్మ గృహిణి. ఫ్యాషన్ డిజైనర్ కూడా. నా డ్రెస్‌లు తనే డిజైన్ చేస్తుంది. నేను కడప 'కోటిరెడ్డి ఉమెన్స్ కళాశాల'లో బీఎస్సీ చేశాను. న్యాయమూర్తి కావాలనేది నా కోరిక. అందుకే ప్రస్తుతం తిరుపతి 'పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం'లో ఎల్ఎల్‌బీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను.

పర్యటనలకు వెళుతూ...

మా ఇంట్లో అందరం కలిసి పర్యటనలకు వెళ్లడం అలవాటు. చాలా దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు చుట్టివచ్చాం. కొవిడ్ సమయంలో మా నాన్న పల్లెటూరులో తన చిన్ననాటి అనుభవాల గురించి రాశారు. అవి నాకు బాగా నచ్చాయి. వాటిని డాక్యుమెంట్‌గా చేసి, యూట్యూబ్‌లో పెట్టాను. ఆ సమయంలోనే అనిపించింది... నేను కూడా వివిధ ప్రాంతాలకు వెళతుంటాను కదా... వాటిపై వీడియోలు చేస్తే బాగుంటుందని! అలా 2021లో 'ఇందూస్ మా ఊరి కథలు' పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ, పురాతన ఆలయాలు, చారిత్రక, వారసత్వ కట్టడాల మీద దృష్టి పెట్టాను. అదేసమయంలో కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో కూడా కొన్ని వీడియోలు తీశాను.

ఎన్నో విశేషాలు...

నా వీడియోల్లో అందరికీ తెలిసినవే కాకుండా కొత్త విషయాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. వాటిల్లో ప్రసిద్ధి చెందిన కట్టడాలున్నాయి. స్థానికులకు తప్ప బయటి ప్రపంచానికి పెద్దగా పరిచయం లేని పురాతన ఆలయాలూ ఉన్నాయి. కడపలో అనిమెల సంగమేశ్వరస్వామి గుడి, అల్లాడుపల్లె వీరభద్రస్వామి గుడి... అలాగే నంద్యాల దగ్గర బిల్వసర్గం, వాల్మీకి గుహలున్నాయి. బ్రహ్మంగారు సంగమేశ్వర ఆలయాన్ని ప్రస్తావించారు. కానీ దీని గురించి బయటి ప్రాంతాలవారికి ఎక్కువగా తెలియదు. అలాగే తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో పూజలు అందుకొనే స్వామే మూల విరాట్టు అనుకొంటారు. నిజానికి అక్కడి రుక్మిణీ సత్యభామ సమేత పార్థసారథి పెరుమాళ్ ప్రధాన విగ్రహం. నవాబులు దాడి చేసినప్పుడు విగ్రహాలను కాపాడుకోవడానికి స్వామికి గోడ కట్టేశారు. దాంతో ఆ పక్కనే ఉన్న గోవిందరాజస్వామి విగ్రహం తీసుకుపోయారు. ఆ స్థానంలో ప్రస్తుత సున్నపురాయి విగ్రహం పెట్టారు. 1978 ప్రాంతంలో టీటీడీ ఈవోగా చేసిన పీవీఆర్‌కే ప్రసాద్ గారి ద్వారా, లోపల విగ్రహం ఉందనేది వెలుగులోకి వచ్చింది. ఆయన రాసిన పుస్తకాల ఆధారంగా నేను ఈ విషయాలు తెలుసుకున్నాను. ప్రతి ఆలయానికీ ఒక ప్రాశస్త్యం ఉంటుంది. వాటిని క్షుణ్ణంగా తెలుసుకొని ప్రజల ముందు పెట్టే ప్రయత్నం చేస్తున్నాను.

చెట్టు కింద స్వామి...

తిరుపతి దగ్గర మంచినీటిగుంటలో చెట్టు కింద గోవిందరాజస్వామి ఉంటారు. అక్కడ గుడి లేదు. చిదంబరంలో క్రిమికంఠ చోళ అనే రాజు ఉండేవాడు. వైష్ణవుడైనా ఆయన శైవం స్వీకరించి, వైష్ణవ దేవాలయాలన్నీ కూలగొట్టి, ఆ స్థానంలో శివాలయాలు నిర్మించేవాడు. 'దశావతారం' చిత్రం దీని ఆధారంగా తీసిందే. ఆయన నుంచి కాపాడుకోవడానికి కొందరు గోవిందరాజస్వామి విగ్రహాన్ని తెచ్చి మంచినీటిగుంటలో పెట్టారని చెబుతారు. అయితే ఇందుకు స్పష్టమైన ఆధారాలు లేవు. తెచ్చే క్రమంలో విగ్రహం పగిలింది. పగిలిన విగ్రహానికి ఆరాధనలు చేయకూడదు కాబట్టి, గుడి నిర్మించలేదు. అయితే స్థానిక ఎన్ఆర్ఐ ఒకరు చూసి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి, స్వామివారికి ప్రతి శనివారం పూజాదికాలు జరిపిస్తున్నారు. ఆయనతో మాట్లాడి దీనిపై ఒక వీడియో రూపొందించాను.

ఏడు వందలకు పైనే...

ఇప్పటివరకు ఏడు వందలకు పైగా వీడియోలు చేశాను. 'తిరుమల కథలు' పేరుతో వారం వారం ఎపిసోడ్స్ విడుదల చేస్తున్నాను. అలాగే గండికోటకు సంబంధించి కూడా పలు ఎపిసోడ్స్ తీశాను. షూటింగ్, ఎడిటింగ్, డబ్బింగ్... అన్నీ నేనే. అదికూడా నా మొబైల్ ఫోన్‌తోనే. చదువుకొంటూనే ఇవన్నీ చేస్తున్నాను. ఎడిటింగ్ తదితర పనులవల్ల ఒక్కోసారి రాత్రిళ్లు నిద్ర ఉండదు. గండికోట వీడియోల నుంచి నా చానల్ చూసేవారి సంఖ్య బాగా పెరిగింది. ఇప్పటికైతే దాదాపు లక్షన్నరమంది సబ్‌స్క్రైబ్ చేశారు. ప్రతి వీడియోకు వ్యూస్ వేలల్లో ఉంటాయి.

అక్కడికి వెళ్లింది నేనే...

కర్ణాటక సరిహద్దులో, అనంతపురం దగ్గర హేమావతి అనే గ్రామం ఉంది. అక్కడి దేవాలయంలో శివుడు లింగ రూపంలో కాకుండా విగ్రహ రూపంలో దర్శనమిస్తాడు. ఇలా మరెక్కడా చూడం. నోలంబులు అనే రాజులు ఆ ప్రాంతాన్ని పాలించారు. వారు పల్లవులు, చాళుక్యుల మధ్య వారధిగా ఉండేవారు. చరిత్ర పుస్తకాల్లో ఎక్కడా ఇది కనిపించదు. అక్కడ అన్ని రకాల వాస్తుశిల్ప శైలులనూ చూస్తాం. అద్భుత ఆలయం అది. దీనిపై తీసిన వీడియోకు విశేష స్పందన వచ్చింది. అలాగే వాల్మీకి గుహలు పాతాళంలోకి వెళ్లినట్టు చాలా కిందికి ఉంటాయి. అందరూ వెళ్లలేరు. కిందికి దిగేకొద్దీ ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోతుంటాయి. గుహల్లో ఒక్కోచోట ఒక్కో రకమైన రాళ్లు ఉంటాయి. అక్కడివరకు వెళ్లిన తొలి మహిళా యూట్యూబర్‌ను నేనే. భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని మరింతమందికి చేరువ చేయాలనేది నా ప్రధాన లక్ష్యం. అందుకే చదువు తరువాత కూడా నా ఈ ప్రయాణం కొనసాగిస్తాను."

● హనుమా

> **సీఎం నుంచి అవార్డు...**
>
> సాధారణ యూట్యూబ్ చానళ్లకు భిన్నంగా, ఏపీలో పర్యాటకాన్ని ప్రోత్సహించేలా నేను రూపొందిస్తున్న వీడియోలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. నా కృషిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో నాకు 'బెస్ట్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్' అవార్డును ఇచ్చింది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకున్నా. ఇది నా జీవితంలో మధుర ఘట్టం. ఆనాటి నుంచి నా పేరు ఎంతోమందికి పరిచయమైంది. నా చానల్ చూసేవారి సంఖ్య పెరిగింది. ఇదేకాకుండా ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొంటున్నాను.

వినూత్నం

తేనెతో తారాస్థాయికి



నాన్న కష్టాన్ని దోచుకుంటూ, తేనెను కల్తీ చేసి విక్రయిస్తున్న వ్యాపారులకు బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో, కాశ్మీరుకు చెందిన సానియా జెహ్రా, తండ్రి వ్యాపార పగ్గాలను చేపట్టింది. వ్యాపారంలోకి అడుగుపెట్టిన కొద్ది కాలంలోనే తేనె ఉత్పత్తితో పాటు తేనెటీగల పుప్పొడితో వ్యక్తిగత ఉత్పత్తులను రూపొందిస్తూ, నెలకు రెండు లక్షలు సంపాదించే స్థాయికి ఎదిగిపోయింది. 19 ఏళ్ల ఆ యువ మహిళా వ్యాపారవేత్త కథనమిది.

భారతదేశంలోని అత్యంత నాణ్యమైన తేనె జమ్ము కాశ్మీర్‌లో ఉత్పత్తవుతూ ఉంటుంది. అయితే డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకూ గడ్డకట్టే చలికాలం, తేనె ఉత్పత్తికి అనువైన కాలం కాదు కాబట్టి, ఆ ఐదు నెలల పాటు తేనెటీగల పెట్టెలను పంజాబ్, రాజస్థాన్‌లకు తరలించక తప్పదు. అలా బాల్యం నుంచి, తండ్రితో పాటు తేనెటీగలను పెంచే చెక్క పెట్టెలను వెంటబెట్టుకుని, పంజాబ్‌కూ, రాజస్థాన్‌కూ తిరుగుతూ ఉండేది సానియా. ఆ క్రమంలో 180 కాలనీల నుంచి తండ్రి ఎంతో కష్టపడి తేనెను సేకరిస్తూ వ్యాపారాలకు విక్రయించడాన్ని దగ్గరి నుంచి గమనించింది. కానీ ఎంత కష్టపడినా వ్యాపారులు సరసమైన ధరకు తేనెను విక్రయించకపోవడం, తమ దగ్గర కొనుక్కున్న తేనెను కల్తీ చేసి, నాలుగింతలు ఎక్కువ లాభానికి అమ్ముకుంటూ ఉండడాన్ని కూడా ఆమె గ్రహించింది. ఆ దోపిడీని తట్టుకోలేక, టీనేజీ వయసు నుంచి తండ్రి బాధ్యతను తన తలకెత్తుకుంది.

ఏకంగా 650 కాలనీలతో...

"డబ్బు మీద ఆశతో మా దగ్గర కొన్న తేనెను కల్తీ చేసి ఎక్కువ లాభానికి అమ్ముకుంటున్న వ్యాపారులను చూశాను. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో నేనీ వ్యాపారంలోకి అడుగుపెట్టాను. తేనెటీగల పెంపకం మా కుటుంబ వ్యాపారం. అయితే తేనెటీగల పెంపకంతో మా కుటుంబానికి ఉన్న అనుబంధం ఎంతో బలీయమైనది. సంప్రదాయ విధానాలను అనుసరిస్తూనే, కుటుంబ వ్యాపారాన్ని మరింత సుస్థిరంగా కొనసాగించే ఆధునిక మార్గాల కోసం నేను అన్వేషించాను. నిజానికి కాశ్మీరు మహిళలు వ్యాపారంలోకీ, మరీ ముఖ్యంగా తేనెటీగల పెంపకంలోకి అడుగు పెట్టడం ఎంతో అరుదు. పదో తరగతి పూర్తయ్యాక, ఫిజియోథెరపీ డిప్లొమాలో చేరాను. కానీ నా మనసంతా తేనెటీగల పెంపకం మీదే నిమగ్నమై ఉంది. ఈ విషయాన్ని స్నేహితులతో, కుటుంబంతో చర్చించినప్పుడు వాళ్లు నా అభిప్రాయాన్ని వ్యతిరేకించారు. కానీ అంతిమంగా నాన్న గుల్జార్ అహ్మద్ మిర్, నా నిర్ణయాన్ని అంగీకరించడంతో నా సంతోషానికి అవధులు లేకుండా పోయాయి" అంటూ తేనెటీగల పెంపకంలోకి అడుగుపెట్టే వరకూ సాగిన తన ప్రయాణం గురించి వివరించింది సానియా. అలా రెండేళ్ల క్రితం, స్థానిక వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ మార్పుకు తోడ్పడే, జమ్ము అండ్ కాశ్మీర్ హోలిస్టిక్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అందించే సబ్సిడీ కోసం అర్జీ పెట్టుకుంది. కాలనీకి నాలుగు వేల రూపాయల చొప్పున 35 తేనెటీగల కాలనీలను ఒకటిన్నర లక్షతో కొనుగోలు చేసింది. ఆ తర్వాత 35 కాలనీలను రెండుగా విడగొట్టి వాటిని రెట్టింపు చేసింది. అలా కాలనీల సంఖ్య పెంచుకుంటూ నేటికి 650 కాలనీలను నెలకొల్పగలిగింది సానియా.

తేనెటీగల స్రావాలతో, పుప్పొడితో...

"ఈ మొత్తం కాలనీల ద్వారా ప్రతి రుతువులో 5,500 కిలోల తేనె సమకూరుతూ ఉంటుంది. శీతాకాల మాసాల్లో రాజస్థాన్, పంజాబ్‌లకు తరలివెళ్లే తేనెటీగల పెట్టెలు, ప్రస్తుతం దక్షిణ కాశ్మీరులోని పుల్వామా జిల్లాలో ఉన్న పాంపోర్ కుంకుమ పువ్వు పొలాల్లో నెలకొని ఉన్నాయి. వీటి నుంచి సేకరించిన తేనెను వ్యాపారులకు బదులుగా నేరుగా వినియోగదారులకే విక్రయించడం మొదలుపెట్టాను. మా తేనెకు 'కాశ్మీరు ప్యూర్ ఆర్గానిక్స్' అనే పేరు కూడా పెట్టుకున్నాను. తేనెటీగల కాలనీలకు సంబంధించిన దేదీ వృథా కాకూడదనే ఉద్దేశంతో, తేనెటీగలు సేకరించే పుప్పొడి, వాటి నుండి వెలువడే స్రావాలతో సబ్బులు తయారుచేసి విక్రయించడం మొదలుపెట్టాను. ఉత్పత్తుల్లో వైవిధ్యాన్ని కనబరచడం ద్వారా బహుళ ఆదాయాలను ఆర్జించగలుగుతున్నాను" అంటూ చెప్పుకొచ్చిన సానియా, నెలకు ఏకంగా 2 లక్షల రూపాయలను ఆర్జిస్తూ ఉండడం విశేషం.

ఇంటి భోజనమే అయినా...

ఇంట్లో తయారుచేసే భోజనంలో ప్రేమ, అభిమానం దాగి ఉంటాయి. ఇవి ఇంటిల్లిపాదికీ ఆనందాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయి. అయినప్పటికీ భోజనం వండేటపుడు అనుసరించే కొన్ని పద్ధతులు, వంటలో ఉపయోగించే ఆహార దార్థాల మోతాదు వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదముంది. కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్యకరమైన భోజనం అందించేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం!

నూనె, నెయ్యి

● మనం కూరలు వండేటపుడు అవసరమైనదానికంటే కొంచెం ఎక్కువ నూనె ఉపయోగిస్తూ ఉంటాం. దీనివల్ల కూర రుచి పెరుగుతుంది అనుకుంటాం. అట్లు వేసేటపుడు, చపాతీలు కాల్చేటపుడు కూడా నెయ్యి లేదా వెన్న ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటాం. రుచిగా ఉంటాయని తరచూ వేపుళ్లు, పకోడీలు తయారు చేస్తూ ఉంటాం. ఇలా నూనె పదార్థాలు తినడం వల్ల శరీరంలో కొవ్వు శాతం, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి అధికమవుతాయి. బరువు పెరగడంతోపాటు గుండె సంబంధిత సమస్యలు ఎదురవుతాయి. వంటచేసేటపుడు అవసరమైనంత వరకు మాత్రమే నూనె, నెయ్యి ఉపయోగించడం మంచిది.

పంచదార

● పుట్టిన రోజులు, పండుగల సందర్భాల్లో తయారు చేసే గులాబ్ జామూన్, హల్వా, పాయసం, పొంగలి తదితర వంటకాల్లో పంచదారను అవసరమైనదానికంటే ఎక్కువగా వాడుతూ ఉంటారు. ఇలాంటి తీపి పదార్థాలు తినడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం మందగిస్తుంది. పొట్టలో ఆమ్లాలు ఉత్పత్తి అవుతాయి. మధుమేహం వచ్చే ప్రమాదముంటుంది. పంచదారను వీలైనంత తక్కువగా వాడడం, బదులుగా బెల్లం ఉపయోగించడం శ్రేయస్కరం.

ఉప్పు

● రోజూ వండే వంటల్లో ఉప్పును కాస్త తగ్గించి వేయడం మంచిది. ఉప్పు ఎక్కువగా ఉండే నిల్వ పచ్చళ్లు, అప్పడాలు, రోటి పచ్చళ్లను భోజనంలో మితంగా వడ్డించాలి. కుటుంబ సభ్యులు పెరుగన్నంలో ఉప్పు కలుపుకోవడాన్ని సమర్థించకూడదు. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో సోడియం స్థాయి పెరిగి రక్తపోటు తద్వారా గుండె సంబంధిత వ్యాధులు వస్తాయి.

మైదా

● గోధుమ పిండిని పూర్తిగా శుద్ధి చేస్తే తెల్లని మైదా వస్తుంది. ఇందులో ఏ పోషకాలు ఉండవు. రుచిగా ఉంటాయని మైదా పిండితో పునుగులు, పూరీలు, చపాతీలు చేస్తూ ఉంటారు. వీటిని తినడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులు వస్తాయి. మైదాకి బదులు గోధుమ పిండిని ఉపయోగించడం చాలా మంచిది. మైదా, పంచదార, వెనీలా ద్రావణం చుక్కలు కలిపి ఇంట్లో తయారుచేసే కేక్ కన్నా కిరాణా కొట్లో అమ్మే గోధుమపిండి మఫిన్ ఆరోగ్యానికి ఎంతో మంచిది.



పోషకాలు ఉండేలా..

● కూరగాయలను అతిగా ఉడికించడం, వేపడం వల్ల వాటిలోని పోషకాలు నశించిపోతాయి. ఆకు కూరలను కూడా చిన్నమంట మీద తగినంత మేరకు మాత్రమే మగ్గించాలి. వంట చేసేటపుడు ఆవిరి మీద ఉడికించడం, కాల్చడం వంటి పద్ధతులను పాటిస్తే ఆహార పదార్థాల్లోని విటమిన్లు, మినరల్స్ నష్టపోకుండా ఉంటాయి. కూర వండేటపుడు ఎక్కువగా మసాలా పొడులు కలపడం మంచిది కాదు. దీనివల్ల కడుపులో మంట, అజీర్ణం తదితర సమస్యలు ఏర్పడతాయి.

ఆరోగ్యం

ఇన్‌ఫ్లమేషన్‌ను తరిమేద్దామిలా!

శరీరంలో కొన్ని రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు ప్రవేశించి వ్యాధులను కలిగిస్తాయి. వీటికి చికిత్స తీసుకున్న తరవాత కూడా కోలుకోకపోతే అవి ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తాయి. దీనివల్ల కడుపులో మంట, కీళ్లవాపు, చలిజ్వరం, నీరసం, తలనొప్పి, చర్మంపై దద్దుర్లు, తినాలనిపించకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి ఇన్‌ఫ్లమేషన్‌ను నివారించేందుకు ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకోవాలో తెలుసుకుందాం!

ఆకు కూరలు : పాల కూర, బచ్చలి కూరలను తరచూ తినడం వల్ల శరీరానికి కావాల్సిన మినరల్స్, విటమిన్లు అంది ఇన్‌ఫ్లమేషన్ సమస్యలు తగ్గుముఖం పడతాయి. క్యాబేజీ ఆకులను సలాడ్‌లు, స్మూతీలు, ఇతర వంటకాల్లో చేర్చుకుని తింటే కడుపులో మంట, చర్మ వ్యాధులు తగ్గుతాయి.

ఆలివ్ ఆయిల్ : ఇందులో ఉండే ఒలియోకాంతల్ సమ్మేళనాలు ఎముకల సమస్యలు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల వాపులు, నరాల బలహీనత, క్యాన్సర్ వాపుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. పలు రకాల సలాడ్స్‌లో ఆలివ్ ఆయిల్ కలిపి తీసుకోవడం మంచి ఫలితాన్నిస్తుంది. టొమాటోలను ఆలివ్ ఆయిల్‌లో వేయించి తినడం వల్ల వాటిలోని లైకోపీన్ శరీరానికి అంది వాపులు, నొప్పులు తగ్గుముఖం పడతాయి.

స్ట్రాబెరీ : దీనిలో ఉండే ఆంథోసైనిన్స్ సమ్మేళనాలు శరీరంలోని వాపులను, దీర్ఘకాలిక వ్యాధులను హరించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. స్ట్రాబెరీ ముక్కలను పెరుగులో కలుపుకుని తింటే మంచి ప్రయోజనం ఉంటుంది.

గింజలు : బాదం, వాల్‌నట్స్, అవిసె గింజలు, గుమ్మడి గింజలను తరచూ తినడం వల్ల శరీరంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు వృద్ధిపొందుతాయి. పలు రకాల గింజల్లో ఉండే క్రొవ్వులు, పీచు పదార్థాలు శరీరంలో పేరుకున్న వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతాయి.

పసుపు : వంటకాల్లో పసుపును తరచూ చేర్చడం వల్ల అందులోని కర్క్యుమిన్ మధుమేహం, క్యాన్సర్ కారణంగా వచ్చే వాపులను తగ్గిస్తుంది. పసుపులోని ఇతర ఔషధగుణాలు కీళ్లనొప్పులను నివారిస్తాయి.

అల్లం : ఆహారంలో భాగంగా అల్లం చేర్చుకుంటే దీనిలోని జింజెరోల్స్ అనే పదార్థం శరీరంలోని వివిధ భాగాల్లో ఏర్పడే వాపులను, నొప్పులను నివారిస్తుంది. అల్లం టీ తాగితే అరుచి తగ్గి జీర్ణక్రియ మెరుగవుతుంది.

దాల్చిన చెక్క: ఇందులో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఓట్‌మీల్, స్మూతీలు, ఇతర వంటకాల్లో దాల్చిన చెక్క పొడిని కలిపి తీసుకుంటే అరికాలి మంటలు, నీరసం తగ్గుతాయి. రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది.

వెల్లుల్లి : ఇన్‌ఫ్లమేషన్ కారణంగా శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. వెల్లుల్లిని వంటల్లో ఉపయోగించినా పచ్చిగా తిన్నా అందులోని అల్లిసిన్ సమ్మేళనం ఈ ఒత్తిడిని తగ్గించి ఉపశమనం కలిగిస్తుంది.

తులసి : పలు రకాల సలాడ్‌లు, పాస్తా వంటకాల్లో తులసి ఆకులను కలిపి తినడం వల్ల శరీరానికి యూజినాల్ సమ్మేళనాలు అంది వాపులు, నొప్పులను హరిస్తాయి. ఉదయాన్నే నాలుగు తులసి ఆకులు తిన్నా కూడా రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది.



గ్రీన్ టీ: గ్రీన్ టీని తరచూ త్రాగడం వల్ల అందులోని పాలీఫెనాల్స్ రక్షణ కవచంలా పనిచేసి ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమైన క్యాన్సర్, మధుమేహం, గుండెకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధులను తరిమికొడతాయి. డార్క్ చాక్లెట్‌ను మితంగా తిన్నా కూడా వాపులన్నీ మాయమవుతాయి.



సమరానికి నేడే ఆరంభం

లిరెన్‌తో గుకేష్ పోరు
ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్

మ. 2.30 నుంచి ఫిడే యూట్యూబ్ చానెల్‌లో..

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఆరంభ సంబరాలు ముగిశాయి. ఇక అసలు సమరానికి వేళైంది. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, చాలెంజర్ గుకేష్ విశ్వ కిరీటం కోసం 14 రౌండ్లలో తలపడనున్నారు. రెండు వారాల టోర్నీలోని తొలి రౌండ్ సోమవారం జరగనుంది. విజయానికి ఒక పాయింట్, డ్రాకు అర పాయింట్ లభిస్తాయి. తొలుత 7.5 పాయింట్లకు చేరిన వారిని విజేతగా ప్రకటిస్తారు. 14 గేమ్‌ల తర్వాతా ఇద్దరు ఆటగాళ్ల స్కోరు సమంగా ఉంటే.. టైబ్రేకర్ ద్వారా చాంపియన్‌ను నిర్ణయిస్తారు.

సింగపూర్: అరవై నాలుగు గళ్ల ఆటలో ఆధిపత్యం ఎవరిదో తేల్చుకునేందుకు డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, భారత యువ సంచలనం గుకేష్ సిద్ధమయ్యారు. ప్రతిష్ఠాత్మక ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో ఈ ఇద్దరు సోమవారం నుంచి తలపడనున్నారు. ప్రస్తుత ఫామ్ పరంగా చూస్తే భారత్‌కు చెందిన 18 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ గుకేషే చెస్ పండితులు తిరుగులేని ఫేవరెట్‌గా భావిస్తున్నారు. అయితే ఒత్తిడి పరిస్థితులను అతడు ఎలా ఎదుర్కొంటాడనేది కీలకమని వారు చెబుతున్నారు. 2023లో ఇయాన్ నెపోమ్నియాచి (రష్యా)తో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా 32 ఏళ్ల లిరెన్ విశ్వ విజేతగా ఆవిర్భవించాడు. కానీ అప్పటినుంచి చైనా గ్రాండ్‌మాస్టర్ ఎన్నో మానసిక సమస్యలు ఎదుర్కొన్నాడు. గుకేష్‌తో పోలిస్తే గత సంవత్సరం లిరెన్ చాలా తక్కువ పోటీలలో పాల్గొన్నాడు. మరోవైపు విశ్వనాథన్ ఆనంద్ (2012) తర్వాత ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన తొలి భారత ఆటగాడిగా నిలవాలని గుకేష్ పట్టుదలగా ఉన్నాడు. గత డిసెంబరులో క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి క్వాలిఫై కావడం ద్వారా ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌వైపు గుకేష్ అడుగులు పడ్డాయి. హాట్ ఫేవరెట్లు కరువాన, నకమురాలను తలదన్ని క్యాండిడేట్స్ టోర్నమెంట్ టైటిల్ దక్కించుకోవడం ద్వారా గుకేష్ సంచలనం సృష్టించాడు. ఇటీవల బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల జట్టు స్వర్ణం గెలుచుకోవడంలో గుకేష్ కీలక భూమిక పోషించాడు. ఇక..గణాంకాల పరంగా చూసినా లిరెన్‌పై గుకేషే పైచేయి. గత నవంబరు నుంచి 37 రేటింగ్ పాయింట్లు దక్కించుకోగా, అదే సమయంలో లిరెన్ 52 పాయింట్లు కోల్పోవడం గమనార్హం.

ముఖాముఖి..

గుకేష్-లిరెన్ ఇప్పటివరకు క్లాసికల్ గేమ్‌లలో మూడుసార్లు ముఖాముఖి తలపడ్డారు. ఇందులో లిరెన్ రెండుసార్లు విజయం సాధించగా, ఓ గేమ్ డ్రా అయ్యింది. చివరిసారి..ఈ ఏడాది ఆరంభంలో నెదర్లాండ్స్‌లో జరిగిన టాటా స్టీల్ చెస్ టోర్నీతోపాటు, 2023లో ఇదే టోర్నమెంట్‌లో గుకేష్‌పై నెగ్గాడు. ఇక సింక్వీఫీల్డ్ కప్ టోర్నీ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఇదీ ఫార్మాట్

తొలి 40 ఎత్తులకు 120 నిమిషాలు. తదుపరి 20 ఎత్తులకు 60 నిమిషాల సమయం. తర్వాత మిగిలిన ఆటకు 15 నిమిషాలు. 61వ ఎత్తు నుంచి ప్రతి ఎత్తుకు 30 సెకన్ల అదనపు సమయం ఉంటుంది. 41వ ఎత్తుకు ముందు డ్రాకు అంగీకరించరు.



అనుకున్నదే జరిగింది. విధ్వంసకర బ్యాటర్ రిషభ్ పంత్ ధాటికి ఐపీఎల్ బాక్సులు బద్దలయ్యాయి. ఢిల్లీ క్యాపిటల్స్ మెగా వేలానికి వదిలేసినప్పుడే అతడికి పలికే ధరపై అంతా ఊహించారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా పంత్ రేటు పైపైకి ఎగబాకుతూ ఏకంగా రూ.27 కోట్ల దగ్గర ఆగింది. అంతే.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డుపుటలకెక్కాడు. రైట్ టు మ్యాచ్ ద్వారా అతడిపై డీసీ కన్నేసినా.. లఖ్‌నవూ మాత్రం పట్టు వదల్లేదు. అంతకుముందు పంజాబ్ సైతం దూకుడుగా వెళ్లి శ్రేయా‌స్‌ను రూ.26.75 కోట్లకు దక్కించుకుంది. అయితే అంచనాలకు భిన్నంగా కేఎల్ రాహుల్ కేవలం రూ.14 కోట్లకే ఢిల్లీ సొంతమవడం గమనార్హం. ఇక వెంకటేశ్ అయ్యర్‌ను అతడి పాత జట్టు కేకేఆర్ రూ.23.75 కోట్ల భారీ మొత్తానికి చేజిక్కించుకోవడం ఆశ్చర్యపరిచింది.

ధర దద్దరిల్లింది

రూ.27 కోట్లతో పంత్ రికార్డు
లీగ్ చరిత్రలోనే అత్యధిక రేటు

రిషభ్ పంత్

ఐపీఎల్ తొలిరోజు వేలం



శ్రేయా‌స్‌కు రూ.26.75 కోట్లు
వెంకటేశ్‌కు రూ.23.75 కోట్లు
భారత ఆటగాళ్లకే ప్రాధాన్యం

జెద్దా: ఐపీఎల్ వేలం ఎప్పుడు జరిగినా ఆయా ఫ్రాంచైజీలు ఎక్కువగా విదేశీ ఆటగాళ్లపై దృష్టి సారిస్తుంటాయి. కానీ ఈసారి మెగా వేలంలో మాత్రం భారత ఆటగాళ్లపై కనకవర్షం కురిపించాయి. ఆదివారం తొలిరోజు వేలంలో వీరు కనీవినీ ఎరుగని రేటు పలికారు. రిషభ్ పంత్‌ను లఖ్‌నవూ రూ.27 కోట్లతో, శ్రేయాస్ అయ్యర్‌ను ఢిల్లీ రూ.26.75 కోట్లతో కొనుగోలు చేశాయి. ఐపీఎల్ చరిత్రలో ఈ ఇద్దరివే టాప్-2 రికార్డు ధరలు కావడం విశేషం. దీంతో గతేడాది ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ (రూ.24.75 కోట్లు) అత్యధిక ధర బద్దలయ్యింది. ఈసారి స్టార్క్‌ను ఢిల్లీ రూ.11.75 కోట్లకే దక్కించుకోవడం గమనార్హం. తొలిరోజు మొత్తంగా 72 మంది ఆటగాళ్లు అమ్ముడవగా.. వీరికోసం ఫ్రాంచైజీలు రూ. 467.95 కోట్లు వెచ్చించాయి. సోమవారంతో వేలం ముగుస్తుంది.

ప్చ్.. రాహుల్

గత సీజన్‌లో లఖ్‌నవూ కెప్టెన్‌గా ఉన్న కేఎల్ రాహుల్ వేలంలో సులువుగా రూ.20 కోట్ల మార్క్ దాటుతాడని భావించారు. కానీ ఫ్రాంచైజీలు అతడిపై పెద్దగా ఆసక్తి చూపలేదు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఫామ్ కోల్పోడం ప్రభావం చూపిందేమో. ఆర్‌సీబీ, చెన్నై ఆరంభంలో బిడ్ వేసినా రూ.14 కోట్లకే ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుని సంబరపడింది. వచ్చే సీజన్‌లో అతడినే తమ కెప్టెన్‌గా ప్రకటించే అవకాశం ఉంది.


వెంకటేశ్ అయ్యర్

వావ్.. వెంకటేశ్

గత సీజన్‌లో కోల్‌కతాకు ఆడిన ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌కు మాత్రం ఎవరూ ఊహించని ధర పలికింది. అతడిని రిటైన్ చేసుకోకుండా వేలానికి వదిలిన కోల్‌కతానే తిరిగి అతడిని ఎలాగైనా సొంతం చేసుకోవాలనే కసి చూపింది. అందుకే వేలంలో ఆర్‌సీబీతో దూకుడుగా పోటీ పడింది. చూస్తుండగానే రేటు రూ.20 కోట్ల మార్క్‌ను దాటేసింది. చివరకు కేకేఆర్ రూ.23.75 కోట్లతో అతడిపై కనకవర్షమే కురిపించింది.

ఈ ఇద్దరి కోసం హోరాహోరీ

వేలంలో ఐదో ఆటగాడిగా రిషభ్ పంత్ పేరు చెప్పగానే ఆడిటోరియంలోని ప్రేక్షకులు చప్పట్లతో స్వాగతం పలికారు. అటు వేలం కూడా అత్యంత ఆసక్తికరంగా సాగింది. మొదట పంత్ కోసం లఖ్‌నవూతో పోటీపడిన ఆర్‌సీబీ రూ.12 కోట్ల దగ్గర వెనక్కి తగ్గింది. ఈ దశలో సన్‌రైజర్స్ ప్రవేశించి రేటును రూ.20 కోట్లు దాటించింది. చివరకు రూ.20.75 కోట్ల దగ్గర వెనక్కి తగ్గడంతో.. ఢిల్లీ తమ పాత కెప్టెన్ కోసం ఆర్‌టీఎం ఉపయోగించింది. కానీ లఖ్‌నవూ మాత్రం పట్టు వదలకుండా రేటును ఒకేసారి రూ.27 కోట్లకు పెంచడంతో డీసీ షాకయ్యింది. దీంతో ఐపీఎల్ రికార్డు ధరతో పంత్ లఖ్‌నవూ కెప్టెన్‌గా మారబోతున్నాడు. అయితే పంత్ ధర ఊహించిందే అయినా.. శ్రేయాస్ అయ్యర్ మాత్రం జాక్‌పాట్ దక్కించుకున్నట్టే. వేలంలో అతడి పేరు పంత్‌కన్నా ముందే రావడం కూడా కలిసివచ్చింది. ఈ ఇద్దరిలో ఒకరిని దక్కించుకోవాలని పంజాబ్ కింగ్స్ ముందే భావించినట్టుంది. అందుకే శ్రేయాస్ కోసం పట్టుదల చూపింది. మొదట కేకేఆర్ కూడా తమ పాత కెప్టెన్ కోసం ఆసక్తి చూపింది. ఆ తర్వాత డీసీ రేసులోకి రావడంతో తొలిసారి రూ.20 కోట్ల మార్క్‌ను దాటిన భారత ఆటగాడయ్యాడు. ఆ జట్టు కూడా కెప్టెన్ కోసం చూస్తుండడంతో రేటు వేగంగా పెరిగింది. చివరకు రూ.26.75 కోట్లతో పంజాబ్ ఖాతాలో చేరాడు.


అర్ష్‌దీప్


చాహల్

స్వదేశీ ఆటగాళ్లే ముద్దు

తొలిసారిగా ఐపీఎల్ వేలంలో భారత ఆటగాళ్లు మెరిశారు. ముఖ్యంగా పేసర్లపై ఆయా జట్లు ఎక్కువగా దృష్టి సారించాయి. ఈ వేలం మొదట పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌తో ఆరంభం కాగా రూ.2 కోట్ల కనీస ధర ఉన్న అతడిని తీసుకునేందుకు సగంజట్లు పోటీపడ్డాయి. చివర్లో సన్‌రైజర్స్ ఎంట్రీతో రేటు రూ.15.75 దగ్గర ఆగింది. ఈ దశలో పంజాబ్ కింగ్స్ ఆర్‌టీఎం ఉపయోగించగా.. రైజర్స్ ధరను రూ.18 కోట్లకు పెంచింది. దీనికి కూడా పంజాబ్ అంగీకరించడంతో అర్ష్‌దీప్ తన పాత జట్టులోనే చేరాడు. ఇక స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌కు అధిక ధరే పలికింది. గుజరాత్, చెన్నై, లఖ్‌నవూ, సన్‌రైజర్స్ అతడికోసం ప్రయత్నించాయి. చివరకు రూ.18 కోట్ల దగ్గర రైజర్స్ వైదొలగగా.. పంజాబ్ వశమయ్యాడు. అలాగే బెంగళూరుతో చాలాకాలం కొనసాగిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను గుజరాత్ టైటాన్స్ రూ.12.25 కోట్లకు తీసుకుంది. వెటరన్ పేసర్ మహ్మద్ షమి (రూ.10 కోట్లు), కీపర్ ఇషాన్ కిషన్ (రూ.11.25 కోట్లు) ఈసారి సన్‌రైజర్స్ తరఫున ఆడనున్నారు. బ్యాటర్ జితేశ్ శర్మ (రూ.11 కోట్లు) బెంగళూరు మారాడు. పేసర్లు నటరాజన్ (రూ.10.75 కోట్లు)ను ఢిల్లీ, అవేశ్ (రూ.9.75 కోట్లు)ను లఖ్‌నవూ, ప్రసిద్ధ్ (రూ.9.50 కోట్లు)ను టైటాన్స్ తీసుకోగా, స్పిన్నర్ ఆర్.అశ్విన్ (రూ.9.75 కోట్లు) తొమ్మిదేళ్ల తర్వాత తిరిగి 'సొంత' జట్టు చెన్నైకి ఆడబోతున్నాడు.

వేలంలో టాప్-5 ప్లేయర్లు

రిషభ్ పంత్	లఖ్‌నవూ	రూ.27 కోట్లు
శ్రేయాస్ అయ్యర్	పంజాబ్	రూ.26.75 కోట్లు
వెంకటేశ్ అయ్యర్	కోల్‌కతా	రూ.23.75 కోట్లు
అర్ష్‌దీప్ సింగ్	పంజాబ్	రూ.18 కోట్లు
యజ్వేంద్ర చాహల్	పంజాబ్	రూ.18 కోట్లు



రసిక్ పంట పండింది

అన్‌క్యాప్‌డ్ క్రికెటర్లలో రసిక్ దార్ సలామ్‌కు అత్యధిక ధర పలికింది. రూ.30 లక్షల కనీస ధర కలిగిన అతడిని బెంగళూరు రూ.6 కోట్లకు తీసుకుంది. అయితే రసిక్‌ను ఆర్‌సీబీ రూ.2 కోట్లకే తీసుకోగా, ఢిల్లీ జట్టు ఆర్‌టీఎంను ఉపయోగించింది. దీంతో ఆర్‌సీబీ ఒక్కసారిగా రేటును రూ.6 కోట్లకు పెంచి సొంతం చేసుకుంది. నమన్ ధిర్‌ను కూడా ముంబై ఇండియన్స్ ఆర్‌టీఎం ద్వారా రూ.5.25 కోట్లకు తీసుకుంది. అబ్దుల్ సమద్ (లఖ్‌నవూ), నేహాల్ వదేరా (పంజాబ్) రూ.4.20 కోట్ల చొప్పున, అభినవ్ మనోహర్ (సన్‌రైజర్స్) రూ.3.20 కోట్లు, రఘువంశీ (కోల్‌కతా) రూ.3 కోట్లకు అమ్ముడయ్యారు. గత మినీ వేలంలో రూ.8.40 కోట్ల ధర పలికిన సమీర్ రిజ్వీని ఈసారి రూ.95 లక్షలకే ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుంది.

విదేశీ ఆటగాళ్లలో..

ఈ సారి వేలంలో విదేశీ ఆటగాళ్లపై ఆయా ఫ్రాంచైజీలు జాగరూకతతో వ్యవహరించాయి. గుజరాత్ టైటాన్స్ జోస్ బట్లర్ (రూ.15.75 కోట్లు)పై పెట్టినదే అత్యధిక ధర కావడం గమనార్హం. ఆ తర్వాత పేసర్లు ట్రెంట్ బౌల్ట్ (ముంబై, రూ.12.50 కోట్లు), చివరి నిమిషంలో వేలంలోకి వచ్చిన జోఫ్రా ఆర్చర్ (రాజస్థాన్, రూ.12.50 కోట్లు), హాజెల్‌వుడ్ (ఆర్‌సీబీ, రూ.12.50 కోట్లు) నిలిచారు. ఫిల్ సాల్ట్ (ఆర్‌సీబీ, రూ.11.50 కోట్లు), స్టొయినిస్ (పంజాబ్, రూ.11 కోట్లు), రబాడ (టైటాన్స్, రూ.10.75 కోట్లు), నూర్ అహ్మద్ (సీఎస్‌కే, రూ.10 కోట్లు) విలియన్ డాలర్ల క్లబ్‌లో చేరారు.

వీరికి నిరాశే..

ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌పై ఎవరూ ఆసక్తి చూపలేదు. రూ.2 కోట్ల కనీసధర కలిగిన దేవ్‌దత్ పడిక్కళ్, బెయిర్‌స్టోకు సైతం నిరాశే ఎదురైంది. అలాగే అన్‌క్యాప్డ్ ప్లేయర్ యష్ ధుల్, అన్‌మోల్‌ప్రీత్, సీనియర్ పీయూష్ చావ్లా కూడా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలారు.


ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత్.. పెర్త్ టెస్ట్‌లో పూర్తిగా పట్టుబిగించింది. కోహ్లీ, జైస్వాల్ సెంచరీతో చెలరేగడంతో.. ఆసీస్ ముందు భారత్ 534 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం బుమ్రా బుల్లెట్ బంతులకు ఆసీస్ 12/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. మొత్తంగా విజయానికి 522 రన్స్ దూరంలో ఉన్న ఆస్ట్రేలియా.. పరుగులు కనిపిస్తున్న వికెట్‌పై ఏదో అద్భుతం చేస్తే తప్ప ఓటమిని తప్పించుకోలేని పరిస్థితి!

ఇక.. మన చేతుల్లోనే

విజయానికి ఏడు వికెట్ల దూరంలో భారత్

టీమిండియా రెండో ఇన్నింగ్స్ 487/6 డిక్లేర్డ్

- కోహ్లీ, జైస్వాల్ శతక మోత
- ఆసీస్ లక్ష్యం 534 ప్రస్తుతం 12/3


జైస్వాల్ (161)


కోహ్లీ (100 నాటౌట్)

పెర్త్: బ్యాటర్లు భళా అనిపించగా.. బుమ్రా మరోసారి బంతితో చెలరేగడంతో ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో భారత్ విజయం దిశగా దూసుకెళ్తోంది. సుదీర్ఘ కాలం తర్వాత స్టార్ బ్యాటర్ కోహ్లీ (100 నాటౌట్), యువ కెరటం యశస్వి జైస్వాల్ (161) శతకాలతో కదం తొక్కడంతో.. మూడో రోజు ఆటలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా ప్రత్యర్థి ముందు 534 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఓవర్‌నైట్ స్కోరు 172/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 487/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. రాహుల్ (77), నితీశ్ (38 నాటౌట్) విలువైన సహకారం అందించారు. నాథన్ లియాన్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఆసీస్ ఆదివారం ఆట ఆఖరుకు 12/3తో కష్టాల్లో పడింది. ఖవాజా (3 బ్యాటింగ్) క్రీజులో ఉండగా.. చివరి ఓవర్‌లో లబుషేన్ (3)ను కెప్టెన్ బుమ్రా (2/1) ఎల్బీ చేశాడు. మరో రెండు రోజుల ఆట మిగిలున్న నేపథ్యంలో లక్ష్యానికి కంగారూలు ఇంకా 522 పరుగుల దూరంలో ఉండగా.. చేతిలో 7 వికెట్లున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150, ఆసీస్ 104 రన్స్‌కు ఆలౌటయ్యాయి.

ధాటిగా ఆడుతూ..: ముందురోజు సంయమనం పాటించిన ఓవర్‌నైట్ బ్యాటర్లు జైస్వాల్, రాహుల్.. తొలి సెషన్ నుంచే దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్టార్క్ బౌలింగ్‌లో వీరిద్దరూ చెరో బౌండ్రీతో ఉద్దేశాన్ని చాటారు. కాగా, హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో సిక్స్‌తో జైస్వాల్ సెంచరీ సాధించి సంబరాలు చేసుకొన్నాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లో రాహుల్‌ను స్టార్క్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 201 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన దేవ్‌దత్ పడిక్కళ్ (25) కూడా సెటిల్డ్ బ్యాటర్ జైస్వాల్‌కు చక్కని సహకారం అందిస్తూ స్కోరు బోర్డును నడిపించే ప్రయత్నం చేశాడు. దీంతో లంచ్ సమయానికి భారత్ 275/1తో నిలిచింది.

వావ్.. విరాట్..: తిరిగి వచ్చిన తర్వాత రెండో సెషన్ తొలి బంతికే పడిక్కళ్‌ను అవుట్ చేసిన హాజెల్‌వుడ్.. రెండో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కోహ్లీ ఆరంభంలో ఆచితూచి ఆడినా ఆ తర్వాత జోరు పెంచాడు. అనూహ్యంగా బౌన్స్ అవుతున్న బంతులను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును దౌడు తీయించాడు. మరోవైపు 150 పరుగులు పూర్తి చేసుకొన్న జైస్వాల్ భారీ షాట్ ఆడే క్రమంలో మార్ష్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (1), ధ్రువ్ జురెల్ (1) వరుస ఓవర్లలో అవుటయ్యారు. అప్పటికే జట్టు పటిష్ఠ స్థితిలో అటాకింగ్ ఆటను ప్రదర్శించిన కోహ్లీ.. వాషింగ్టన్ సుందర్ (29)తో కలసి ఆరో వికెట్‌కు 89 రన్స్ జోడించాడు. స్టార్క్ బౌలింగ్‌లో సిక్స్‌తో గేర్ మార్చిన విరాట్.. వీలుచిక్కినప్పుడల్లా బౌండ్రీలు బాదడంతో టీ సెషన్‌కు టీమిండియా 359/5 స్కోరు చేసింది. ఇక, ఆఖరి సెషన్‌లో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న కోహ్లీ.. వీలైనంత వేగంగా సెంచరీ మార్క్ చేరేందుకు ప్రయత్నించాడు. సుందర్‌ను లియాన్ బౌల్డ్ చేసినా.. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నితీశ్ ఎడాపెడా షాట్లతో కంగారూ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. విరాట్‌తో కలసి ఏడో వికెట్‌కు అజేయంగా 77 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. మార్ష్ బౌలింగ్‌లో సిక్స్‌తోపాటు హ్యాట్రిక్ ఫోర్లతో నితీశ్ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఇక క్రమంగా 90ల్లోకి అడుగుపెట్టిన కోహ్లీ.. బౌండ్రీతో శతకం పూర్తి చేయడంతో టీమిండియా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

దెబ్బకొట్టిన బుమ్రా..: కొండంత లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆసీస్ బుమ్రా దెబ్బకు కంగారు పడింది. తొలి ఓవర్‌లోనే మెక్‌స్వీనీ (0)ని డకౌట్ చేసిన బుమ్రా జట్టుకు అద్భుత ఆరంభాన్నిచ్చాడు. నైట్ వాచ్‌మన్ కమిన్స్ (2)ను సిరాజ్ వెనక్కిపంపాడు. ఇక, ఫామ్ కోసం తంటాలు పడుతున్న లబుషేన్‌ను బుమ్రా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. రివ్యూకు వెళ్లినా ఫలితం దక్కలేదు.

1 కంగారూ గడ్డపై తొలి వికెట్‌కు అత్యధికంగా 201 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన భారత జోడీగా జైస్వాల్-రాహుల్. 1986లో సిడ్నీ టెస్ట్‌లో గవాస్కర్-శ్రీకాంత్ (191రన్స్) రికార్డు బద్దలైంది.

3 ఆస్ట్రేలియాలో ఆడిన తొలి టెస్ట్‌లోనే సెంచరీ నమోదు చేసిన మూడో భారత బ్యాటర్‌గా జైస్వాల్. జయసింహ, గవాస్కర్ ఈ ఘనతను అందుకొన్నారు.

4 ఓ క్యాలెండర్ ఇయర్‌లో మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు 150+ స్కోర్లు సాధించిన నాలుగో భారత బ్యాటర్‌గా జైస్వాల్. సచిన్ టెండూల్కర్, సెహ్వాగ్, కోహ్లీ గతంలో ఈ ఫీట్ నమోదు చేశారు.

బ్రాడ్‌మన్‌ను దాటేసిన కోహ్లీ

దాదాపు 16 నెలల తర్వాత టెస్టుల్లో శతకం బాదిన విరాట్ కెరీర్‌లో 30వ సెంచరీని నమోదు చేశాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా గ్రేట్ సర్ డాన్ బ్రాడ్‌మన్ 29 శతకాల రికార్డును కోహ్లీ అధిగమించాడు. ఓవరాల్‌గా సచిన్ (51) టాప్‌లో ఉండగా.. భారత బ్యాటర్లలో ద్రవిడ్ (36), గవాస్కర్ (34) విరాట్ కంటే ముందున్నారు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150.
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 104.
భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) మార్ష్ 161, రాహుల్ (సి) క్యారీ (బి) స్టార్క్ 77, పడిక్కళ్ (సి) స్మిత్ (బి) హాజెల్‌వుడ్ 25, కోహ్లీ (నాటౌట్) 100, పంత్ (స్టంప్) క్యారీ (బి) లియాన్ 1, జురెల్ (ఎల్బీ) కమిన్స్ 1, సుందర్ (బి) లియాన్ 29, నితీశ్ (నాటౌట్) 38; **ఎక్స్‌ట్రాలు: 55; మొత్తం: 134.3 ఓవర్లలో 487/6 డిక్లేర్డ్; వికెట్ల పతనం:** 1-201, 2-275, 3-313, 4-320, 5-321, 6-410; **బౌలింగ్:** స్టార్క్ 26-2-111-1, హాజెల్‌వుడ్ 21-9-28-1, కమిన్స్ 25-5-86-1, మార్ష్ 12-0-65-1, లియాన్ 39-5-96-2, లబుషేన్ 6.3-0-38-0, హెడ్ 5-0-26-0.
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనీ (ఎల్బీ) బుమ్రా 0, ఖవాజా (బ్యాటింగ్) 3, కమిన్స్ (సి) కోహ్లీ (బి) సిరాజ్ 2, లబుషేన్ (ఎల్బీ) బుమ్రా 3; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 4.2 ఓవర్లలో 12/3; వికెట్ల పతనం:** 1-0, 2-9, 3-12; **బౌలింగ్:** బుమ్రా 2.2-1-1-2, సిరాజ్ 2-0-7-1.

పుణెరి గెలుపు బాట

నొయిడా: ప్రొ కబడ్డీ సీజన్ 11లో పుణెరి పల్టన్ జట్టు నాలుగు మ్యాచ్‌ల తర్వాత గెలుపు రుచి చూసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పల్టన్ 51-34తో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 44-42తో పట్నా పైరేట్స్‌పై నెగ్గింది.

పాక్‌కు జింబాబ్వే షాక్

బులవాయో (జింబాబ్వే): సికందర్ రజా (39, 2/7) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. వర్ష ప్రభావిత తొలి వన్డేలో పాకిస్థాన్‌కు జింబాబ్వే షాకిచ్చింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 80 పరుగుల (డ/లూ పద్ధతి) తేడాతో పాక్‌పై గెలిచింది. తొలుత జింబాబ్వే 40.2 ఓవర్లలో 205 పరుగులకు కుప్పకూలింది. అనంతరం పాక్ 21 ఓవర్లలో 60/6తో ఉన్న సమయంలో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగింది. దీంతో డ/లూ పద్ధతి ప్రకారం 21 ఓవర్లకు 141 పరుగులుగా నిర్ణయించగా.. పాక్ వెనుకబడింది. కెప్టెన్ రిజ్వాన్ (19 నాటౌట్) టాప్‌స్కోరర్.

వెర్‌స్టాపెన్ వరుసగా నాలుగోసారి
ఫార్ములావన్ చాంపియన్‌షిప్ కైవసం



లాస్‌వెగాస్: రెడ్‌బుల్ డ్రైవర్ మార్క్ వెర్‌స్టాపెన్ చరిత్ర సృష్టించాడు. వరుసగా నాలుగోసారి ప్రతిష్ఠాత్మక ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్‌షిప్ టైటిల్ దక్కించుకున్నాడు. శనివారం రాత్రి జరిగిన లాస్‌వెగాస్ గ్రాండ్‌ప్రీ రేస్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన 27 ఏళ్ల వెర్‌స్టాపెన్ ఐదో స్థానంలో నిలిచినా..అప్పటికే 393 పాయింట్లతో సమీప ప్రత్యర్థి రస్సెల్ కంటే 62 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచాడు. దాంతో చాంపియన్‌షిప్ అతని సొంతమైంది. కాగా ఈ చాంపియన్‌షిప్‌ను షూమాకర్, హామిల్టన్ 7 సార్లు, మాన్యువల్ 5 సార్లు, ప్రాస్ట్, వెటెల్ నాలుగేసి సార్లు కైవసం చేసుకున్నారు. ఇక లాస్‌వెగాస్‌లో..మెర్సిడెస్ డ్రైవర్లు జార్జ్ రస్సెల్, హామిల్టన్ తొలి రెండు స్థానాల్లో నిలిచారు.



మాలల ఆత్మగౌరవ సభలో పాల్గొన్న రాజారత్నం అంబేడ్కర్

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

» అంబేడ్కర్ మునిమనవడు రాజారత్నం అంబేడ్కర్

» వర్గీకరణలో రాజకీయ కుట్రకోణం: హర్షకుమార్

నూజివీడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీలు ఐక్యంగా ముందుకు సాగితేనే అభివృద్ధి పథంలో ఉంటారని, లేదంటే.. తిరిగి అంధకారంలోకి వెళ్లాల్సి వస్తుందని బాబా సాహెబ్ అంబేడ్కర్ మునిమనవడు రాజారత్నం అంబేడ్కర్ హెచ్చరించారు. రాష్ట్రంలోని ఎస్సీలంతా వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఆదివారం రాత్రి జరిగిన మాలల ఆత్మగౌరవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని 59 ఎస్సీ కులాలు ఐక్యంగా ఉండి వర్గీకరణను ఎదుర్కోవాలన్నారు. హిందువులు ఐక్యంగా ముందుకు సాగాలని మహారాష్ట్రలో పిలుపునిచ్చిన ప్రధాని మోదీ.. దళితులను విభజించాలని చూడటం మనువాదమే అవుతుందన్నారు. ఈ కుతంత్రాలను తెలుసుకుని ఎస్సీలందరూ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని రాజారత్నం పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై మోదీ, చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ సవరణ చేసి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత తేవాలని మాజీ ఎంపీ హర్షకుమార్ సవాల్ విసిరారు. ఎస్సీ వర్గీకరణలో రాజకీయ కుట్రకోణం దాగిఉందన్నారు. 'ఎన్నికలకు ముందు మాదిగల విశ్వరూప మహాసభలో మోదీ వర్గీకరణ చేస్తామని చెప్పారు. చంద్రబాబు మేనిఫెస్టోలో వర్గీకరణ అంశాన్ని పెట్టారు. సుప్రీంకోర్టు ఫిబ్రవరిలో వాదనలు విని తీర్పును రిజర్వు చేసి ఆగస్టులో తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు ఎలాఉంటుందో వీరికెలా తెలిసిందో చెప్పాలి. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత రావాలంటే 341ఆర్టికల్‌ను పార్లమెంట్‌లో సవరించాలి. ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంటే కేబినెట్ హోదా కలిగిన ముగ్గురితో కమిటీ వేయాలి' అన్నారు.

అమెరికా వరకూ జగన్ అవినీతి: సత్యకుమార్



అనంతపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అవినీతి రాష్ట్రానికే పరిమితం కాకుండా అమెరికా చేరిందని, తద్వారా అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు. అనంతపురంలో మంత్రి ఆదివారం మాట్లాడుతూ.. సెకీ ఒప్పందాలపై నామినేషన్ పద్ధతి వద్దని తాము ఆనాడే చెప్పినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఖాతరు చేయలేదన్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఆ ఒప్పందాలపై బహిరంగంగానే మాట్లాడారని గుర్తుచేశారు. తన ప్రమేయం లేకుండానే సెకీ ఒప్పందాలు జరిగాయంటున్నారంటే, అంతా తాడేపల్లి ప్యాలెస్ నుంచే ఆ ఒప్పందాలు జరిగాయన్నది స్పష్టంగా అర్థమవుతోందని మంత్రి వ్యాఖ్యానించారు. సెకీ ఒప్పందాల్లో రూ.1750 కోట్ల అవినీతి జరిగిందని, ఆ మొత్తం జగన్ జేబులోకి చేరిందని అమెరికా చెబుతోందన్నారు. ఈ అవినీతిపై సమగ్ర విచారణ చేయడంతోపాటు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ నాయకత్వంపై నమ్మకం సన్నగిల్లడంతోనే ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు ఆ పార్టీని వీడుతున్నారన్నారు.

జగన్ అమెరికా వెళ్తే ఇక తిరిగి రానట్టే..: బుద్దా




విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అదానీ నుంచి రూ.1,750 కోట్ల ముడుపులు తీసుకున్నట్లు అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో.. జగన్ విచారణకు వెళ్తే ఇక జీవితాంతం ఏపీకి తిరిగి రాలేడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. ఆలిండియా పిరికిపందల సంఘానికి కొడాలి నాని, వల్లభనేని వంశీ అధ్యక్ష, కార్యదర్శులని ఎద్దేవా చేశారు. అధికార మదంతో నాని, వంశీ నోటికొచ్చినట్లు వాగారని, నైతిక అర్హత లేని వెధవలు కూడా చంద్రబాబును విమర్శిస్తున్నారని, అలాంటి వాళ్లని శిక్షించాలని ప్రజలే డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. నారా భువనేశ్వరిని కించపరిచిన వారికి బుద్ధి చెప్పాలని కోరారు. కొడాలి నాని, వంశీ వంటి వెధవలను చూసి పోసాని కూడా అడ్డగోలుగా వాగాడన్నారు. పోసాని రాజకీయాలు వదిలేశానంటే మాత్రం.. చేసిన తప్పులుపోతాయా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో అడ్డగోలుగా మాట్లాడిన వారందరూ జైలుకు వెళ్లాల్సిందేనని, శిక్ష అనుభవించాల్సిందేనని బుద్దా వ్యాఖ్యానించారు. భారతీరెడ్డి గురించి తామెప్పుడూ మాట్లాడలేదన్నారు. వంశీ, పోసాని, కొడాలి నాని, దేవినేని అవినాశ్ క్షమాపణలకు అర్హులు కారన్నారు. వాళ్లలాగా తాము పదవులకు, డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తులం కాదన్నారు. వెలంపల్లి చరిత్ర ఏమిటో విజయవాడ ప్రజలకు తెలుసని, మస్కా కొట్టినా, మాయమాటలు చెప్పినా వదిలేది లేదన్నారు. టీడీపీ కార్యకర్తలను ఇప్పుడు టచ్ చేస్తే చేయి తీసేస్తారంటూ హెచ్చరించారు. ఇలాంటి వెధవలకు శిక్షలు పడితేనే ఇతరులకు గుణపాఠం అవుతుందని బుద్దా ఘాటు వ్యాఖ్యలు చేశారు.

అదానీ పవర్ కోసం

గిరిజన చట్టాలు తుంగలోకి..!

జగన్ సర్కార్ నిర్వాకమిది



పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టు రిజర్వాయర్ల నమూనా

» మన్యంలో స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులు

» అదానీకే మూడు ప్రాజెక్టులు కేటాయింపు

» అనుంగు.. షిర్డీసాయికి మరొకటి..

» 2వేల ఎకరాలకు పైగా భూములు కట్టబెట్టేందుకు ఏర్పాట్లు!

» ఎకరం రూ.5 లక్షల చొప్పున అమ్మకానికి లేదా రూ.31వేల చొప్పున లీజుకు ఆమోదం

» మన్యంలో బాక్సైట్ కోసం గతంలో సమతా

» కేసులో సుప్రీంకోర్టు తీర్పు బేఖాతర్!

» కూటమి ప్రభుత్వం రద్దు చేస్తుందో.. కొనసాగిస్తుందో..!

(రంపచోడవరం)

మన్యంలో జలాశయాల నుంచి నీటిని ఎత్తిపోస్తూ విద్యుదుత్పత్తి చేసి నిల్వ చేసే ప్రాజెక్టులను చట్టవిరుద్ధంగా గత జగన్ సర్కార్ అదానీ పవర్ సంస్థలకు కట్టబెట్టింది. దేశవ్యాప్తంగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక విధానాలను రూపొందించి అనేక రాయితీలతో ఆయా విద్యుత్తు సంస్థలకు ప్రాజెక్టులను కట్టబెడుతున్నాయి. ఇందులో భాగంగా మన రాష్ట్రంలో కూడా జగన్ సర్కార్ 2022లో ప్రత్యేక విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం 14,680 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసి నిల్వ చేసేందుకు గాను, రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రాజెక్టులను వివిధ సంస్థలకు ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేటాయించింది. వీటిలో నాలుగు ప్రాజెక్టులు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం గిరిజన జిల్లాల్లో ఉన్నాయి. గిరిజనేతర పేదలు ఇళ్లు కూడా కట్టుకోలేని విధంగా మన్యంలో చట్టాలు అమలవుతున్న తరుణంలో హైడ్రో ప్రాజెక్టులను మాత్రం చట్ట విరుద్ధంగా గిరిజనేతర సంస్థలకు కట్టబెట్టడం వెనుక జగన్ సర్కార్ పెద్దలకు అయుక్తమైన లబ్ధి చేకూర్చిందన్న విమర్శలు చోటుచేసుకున్నాయి. వీటి పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కొయ్యూరు మండలం ఎర్రవరంలో 1,200 మెగావాట్లతోను, అనంతగిరి మండలం పెదకోటలో 1,000 మెగావాట్లతోను, పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు మండలంలోని కురుకుట్టిలో 1,200 మెగావాట్లతోను, కర్రివలసలో 1,000 మెగావాట్లతోను ఈ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులను మంజూరు చేసి, వీటిలో పెదకోట వినహా తక్కిన మూడు ప్రాజెక్టులను అదానీ పవర్ కంపెనీకి కట్టబెట్టింది. పెదకోట ప్రాజెక్టును హైదరాబాద్‌లోని షిరిడీసాయి ఎలక్ట్రికల్స్‌కు కట్టబెట్టారు. ఇది జగన్ బంధువుకు చెందినది కాగా.. ఈ ప్రాజెక్టుల కోసం మొత్తంగా సుమారు 2వేల ఎకరాలకు పైగా భూమి కావాలి. వీటిలో 25 శాతం వరకు అటవీ భూములు ఉండగా, తక్కినవి పట్టా భూములు, ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూములను ప్రజా ప్రయోజనం దృష్ట్యా భూ సేకరణ చేసేందుకు చట్టం ఉన్నా, వాటిని గిరిజనేతర సంస్థలకు కట్టబెట్టేందుకు మాత్రం చట్టాలు అనుమతించవన్న సంగతి తెలిసీ కూడా ఈ కేటాయింపులు జరపడం వివాదమవుతోంది. అంతే కాకుండా ఈ ప్రాజెక్టుల మూలంగా నిరాశ్రయులయ్యే గిరిజన జాతులు, గిరిజన ఆవాసాలు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. వీటిపై ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై, ఉద్యమాలు సాగినా జగన్ సర్కారు పట్టనట్టే వ్యవహరించింది. గిరిజన ప్రాంత చట్టాల ప్రకారం గిరిజనులకు, గిరిజనులు సభ్యులుగా ఉన్న సహకార సంఘాలకు తప్ప ఇతరులకు గిరిజన ప్రాంతాల్లో ఏ రూపంలోనూ భూములను బదలాయించే అవకాశం లేదు. కానీ జగన్ సర్కార్ మాత్రం ఈ చట్టాలను తుంగలో తొక్కింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఏ విధమైన ప్రాజెక్టులు చేపట్టాలన్నా ఆయా గ్రామసభల తీర్మానాలు, రాష్ట్ర గిరిజన సలహా మండలి ఆమోదం అవసరం. కానీ ఇవేమీ లేకుండానే ఈ ప్రాజెక్టులు మంజూరయ్యాయి. ఇలాంటి వ్యవహారమే బాక్సైట్ తవ్వకాల విషయంలో చోటు చేసుకుంటే వివాదాస్పదంగా మారి సుప్రీంకోర్టు వరకు కేసు నడిచింది. సమతా కేసుగా ప్రాచుర్యం పొందిన కేసులో గిరిజన ప్రాంతాల్లో స్థిరాస్తులను గిరిజనేతరులెవ్వరికీ కట్టబెట్టే వీలులేదని, ప్రభుత్వాన్ని కూడా గిరిజనేతరునిగానే పరిగణించాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ విషయం ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు తెలిసినా గిరిజన హక్కులను చట్టాలను తుంగలో తొక్కి ఈ పవర్ ప్రాజెక్టులను ఆయా కంపెనీలకు కట్టబెట్టారు. ఇప్పుడు కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో ఈ చట్ట విరుద్ధ పవర్ ప్రాజెక్టుల కేటాయింపులను రద్దు చేస్తుందా లేక కొనసాగిస్తుందో వేచి చూడాలి.

జగన్-అదానీ లంచాల్లో ఇద్దరు ఐఏఎస్‌ల కీలక పాత్ర!

» తమ 'రాజు'కు లబ్ధి చేకూర్చడానికే!

» దీనివల్ల ఇన్వెస్టర్లలో విశ్వాసం పోయింది

» పకడ్బందీ విచారణతో కఠిన చర్యలు చేపట్టాలి

» రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేశ్ డిమాండ్

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఒప్పందానికి సంబంధించి అదానీ నుంచి నాటి సీఎం జగన్ రూ.1,750 కోట్ల లంచాలు తీసుకున్న వ్యవహారంలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు కీలక పాత్ర పోషించారని రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేశ్ వెల్లడించారు. తమ 'రాజు'కు లబ్ధి చేకూర్చడానికే ఇలా చేశారని 'ఎక్స్'లో పేర్కొన్నారు. 2019 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 9 పునరుత్పాదక సంస్థలకు చెందిన 23 ప్రాజెక్టులకు సంబంధించిన 2,132 మెగావాట్ల విద్యుత్ సరఫరా ఒప్పందాలను రద్దు చేసింది. అదే ప్రభుత్వం 2021 డిసెంబరులో 7,000 మెగావాట్ల సౌరవిద్యుత్ సరఫరా కోసం సెకీ ద్వారా ఒకే ఒక సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ వ్యవహారంలో వారి 'రాజు'కు ప్రయోజనాలు కల్పించడం కోసం ఇద్దరు ఐఏఎస్ అధికారులు కీలకపాత్ర పోషించారు. దీని వల్ల మంచి స్థాయిలో ఉన్న రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. ఈ చర్య ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. అందుబాటులో ధరల్లో ఉండే విద్యుత్ సౌకర్యాల అవకాశాలను చావుదెబ్బతీసింది. వినియోగదారులపై పెనుభారం మోపింది. ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. ఇలాంటి నేరపూరిత వ్యవహారాలపై పకడ్బందీ విచారణ జరిపి, కఠినమైన చర్యలు తీసుకోవాలి. బయటకు వస్తున్న సమాచారం కంటే కూడా వాస్తవిక పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయి. అత్యవసర ప్రాతిపదికన దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని ఆయన తెలిపారు.

'సుప్రీం'కు అదానీ వ్యవహారం



» అమెరికా కేసుపై భారత దర్యాప్తు సంస్థల తోనూ దర్యాప్తు చేయించాలని పిటిషన్

» నేడు ధర్మాసనం ముందు ప్రస్తావన

న్యూఢిల్లీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అదానీ లంచాల వ్యవహారం భారత సర్వోన్నత న్యాయస్థానానికి చేరింది. అదానీపై అమెరికా న్యాయశాఖ మోపిన అభియోగాలపై భారతీయ దర్యాప్తు సంస్థలతో కూడా సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై తక్షణ విచారణ కోరుతూ ధర్మాసనం ఎదుట ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారు. భారత్‌లో సౌర విద్యుత్ ఒప్పందాల కోసం అదానీ గ్రూపు రూ.2,029 కోట్లు లంచం ఇవ్వజూపిన ఆరోపణలపై ఆ గ్రూపు అధినేత గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా మొత్తం 8 మందిపై అభియోగాలు నమోదవడం.. దీనిపై పార్లమెంటరీ సంయుక్త బృందం విచారణ జరపాలని, అదానీని అరెస్టు చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం నుంచి మొదలయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాలను స్తంభింపజేయాలని నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో తివారీ కేసుకు ప్రాధాన్యం ఏర్పడింది. అదానీపై హిండెన్‌బర్గ్ రిపోర్టుపై దర్యాప్తు కోరుతూ గతంలోనూ ఆయన పిటిషన్ వేశారు. అదానీ గ్రూపు అక్రమాలపై అమెరికా సెక్యూరిటీస్-ఎక్స్ఛేంజ్ కమిషన్ ఫిర్యాదు చేయడంతో అక్కడి న్యాయశాఖ అదానీ తదితరులపై అభియోగాలు మోపిందని.. ఇవి చాలా తీవ్రంగా ఉన్నాయని.. భారత ప్రయోజనాల కోసం మన దేశ ఏజెన్సీలతోనూ విచారణ జరిపించాలని తాజా పిటిషన్‌లో కోరారు. అదానీ కంపెనీలపై దర్యాప్తు చేయాలని ఈ ఏడాది జనవరి 3న సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా.. సెబీ ఇప్పటివరకు విచారణ పూర్తిచేయలేదని తెలిపారు. దర్యాప్తు ముగించి నివేదిక సమర్పించడం ద్వారా సెబీ తనపై విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని తివారీ పేర్కొన్నారు.

ఖైదీలకు చికిత్సపై ఎస్‌వోపీ సిద్ధం చేయండి

» జైళ్లశాఖ ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హత్య, కిడ్నాప్, అత్యాచారం, చిన్నారులపై లైంగిక వేధింపులు వంటి తీవ్రమైన నేరాల్లో శిక్షపడి జైలుశిక్ష అనుభవిస్తూ తీవ్ర అస్వస్థత గురై, అత్యవసర చికిత్స అవసరమైన సమయంలో వారిని బయట ఆసుపత్రులు, సూపర్ స్పెషాలిటీలకు తరలించి చికిత్స చేయించే విషయంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని రూపొందించాలని జైళ్లశాఖ ఉన్నతాధికారులను హైకోర్టు ఆదేశించింది. ఇలాంటి తీవ్రమైన నేరాల్లో ఎంతమంది జైలుశిక్ష అనుభవిస్తున్నారు? వీరిలో ఎంతమంది అనారోగ్య కారణాలతో జైలు నుంచి విడుదలయ్యారు? తదితర వివరాలను అఫిడవిట్ రూపంలో తమ ముందుంచాలని స్పష్టం చేసింది. ఇందుకు సమయం ఇస్తూ విచారణను డిసెంబరు 5కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ తూటా చంద్రధనశేఖర్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. బాపట్లకు చెందిన శ్రీనివాసవర్మకు గుంటూరు పోక్సో ప్రత్యేక కోర్టు జీవిత ఖైదు విధిస్తూ 2022 డిసెంబరులో తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం అతను రాజమండ్రి కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. పోక్సో కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అయన హైకోర్టులో అప్పీల్ చేశారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నందున ఆరు నెలల పాటు మధ్యంతర బెయిల్ కోరుతూ అనుబంధ పిటిషన్ వేశారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ జి.నరేందర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ వర్మను అత్యవసర చికిత్స నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించాలని ఆదేశించింది. జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు అత్యవసర చికిత్స అందించే విషయంలో ఉన్న నిబంధనలపై జైళ్లశాఖ అధికారులను వివరణ కోరింది. ఈ అప్పీల్ గురువారం మరోసారి విచారణకు రాగా... అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.... వివరాలు సమర్పించేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

అబద్ధాల్లో తగ్గేదేలే

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి జగన్ హయాంలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు ప్రత్యక్ష నరకం చూశారు. ప్రభుత్వం- కాలేజీల మధ్య ఉండాల్సిన ఫీజుల అంశాన్ని, విద్యార్థులు-కాలేజీల మధ్యకు మార్చి కాలేజీ యాజమాన్యాలు వారికి నచ్చినట్లుగా ఫీజులు వసూలు చేసుకునే పరిస్థితి కల్పించారు. ఫీజుల విడుదల అంశం కాలేజీకి సంబంధం లేకపోవడంతో యాజమాన్యాలు కోర్సులో చేరే సమయంలోనే సగం ఫీజులు కట్టించుకున్నాయి. పోనీ క్వార్టర్ పూర్తవగానే ప్రభుత్వం ఫీజులు విడుదల చేసిందా? అంటే అదీ లేదు. ప్రతి సంవత్సరం కనీసం రెండు, మూడు క్వార్టర్ల ఫీజులు పెండింగ్‌లో పెడుతూ వచ్చారు. ఒక్క సంవత్సరం కూడా విద్యార్థులు కోర్సు పూర్తిచేసుకుని బయటకు వెళ్లే సమయానికి వారి ఫీజులు వారి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో చివరి ఏడాది ఫీజులు కట్టలేదనే కారణంతో గత మూడు నాలుగేళ్లుగా విద్యార్థుల సర్టిఫికెట్ల జారీ వివాదంగా మారింది. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పుడు మీరు తీసుకుని.. మాకు మాత్రం ముందు ఫీజు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాలని కాలేజీల యాజయాన్యాలు తెగేసి చెప్పాయి. దీంతో వేరే దారిలేక అప్పులు చేసి సొంతంగా తల్లిదండ్రులు ఫీజులు కట్టారు. ఆ పరిస్థితి లేనివారు ప్రభుత్వంపై భారంవేసి ఫీజులు విడుదలయ్యే వరకు సర్టిఫికెట్లను కాలేజీల్లోనే ఉంచారు. నిజంగా జగన్ చెప్పినట్లు 2023-24 విద్యా సంవత్సరం ఫీజులు సకాలంలో విడుదలచేసి ఉంటే గతేడాది కోర్సులు పూర్తిచేసిన వారు ఇప్పటికీ సర్టిఫికెట్ల కోసం కాలేజీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది కాదు.

లాజిక్ లేని లెక్క

వైసీపీ హయాంలో 13 విడతల్లో ఫీజులు విడుదల చేసినట్లు జగన్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఏడాదికి నాలుగు విడతలుగా ఫీజులు విడుదల చేయాలి. అంటే ఐదేళ్లలో 20 విడతలు ఇవ్వాలి. తొలి విడత ఒకేసారి రూ.4,208 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. వాటిలో అంతకుముందు ప్రభుత్వం పెట్టిన బకాయిలున్నాయని జగనే అప్పట్లో ప్రచారం చేసుకున్నారు. పోనీ వాటిలో బకాయిలు పోగా 17 విడతలే విడుదల చేసినట్లు అవుతుంది. ఇంకా 3 విడతల ఫీజులు పెండింగ్ అని ఇక్కడే అర్థమవుతుంది. ఒక విడతకు సగటున రూ.700 కోట్లు చెల్లించాలి. అంటే 20 విడతలకు రూ.14వేల కోట్లు విడుదల చేయాలి. కానీ, వైసీపీ హయాంలో రూ.12,609 కోట్లు విడుదల చేసినట్లు జగనే చెబుతున్నారు. ఈ కోణంలో చూసినా దాదాపు 3 క్వార్టర్ల ఫీజులు పెండింగ్ పెట్టారని అర్థమవుతోంది. అలాగే ఇప్పటి వరకు రూ.2,800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఒక్కో క్వార్టర్‌కు సగటున రూ.700 కోట్లు చొప్పున అనుకుంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన 6 నెలలకు రూ.1,400 కోట్లు బకాయిలు ఉండాలి. మరి దానికి రెట్టింపు స్థాయిలో రూ.2800 కోట్లు ఎలా ఏర్పడతాయి? అనే లాజిక్‌ను మర్చిపోయి జగన్ లెక్కలు చెప్పారు.

ఎన్నికల స్టంట్

ఎన్నికల సమయంలో ఓ క్వార్టర్ నిధులు ఇవ్వకుండా కూటమి పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేశాయని, అది తప్ప మొత్తం ఇచ్చేసినట్లుగా జగన్ ఎక్స్‌లో చెప్పుకొచ్చారు. నిజంగా కూటమి పార్టీల కారణంగానే ఫీజులు ఆగిపోయాయి అనుకుంటే పోలింగ్ అనంతరం మొత్తం బకాయిలు విడుదల చేసి ఉండాల్సింది. కానీ, పోలింగ్ పూర్తవగానే దాని గురించి కనీసం పట్టించుకోలేదు. కాగా, ఎన్నికల కోడ్ రాకముందు 2023-24లో మొదటి క్వార్టర్ ఫీజుల విడుదలకు ఈ ఏడాది మార్చి 1న సీఎం బటన్ నొక్కారు. కానీ, మే నెల వచ్చినా వాటిని తల్లిదండ్రుల ఖాతాల్లో జమచేయలేదు. అప్పట్లో జగన్ బటన్ నొక్కడమే ఆలస్యం అనుకుంటే, బటన్ నొక్కినా ఆ తర్వాత చాలాకాలం వరకు డబ్బులు ఖాతాల్లో పడలేదు.

పీజీకి రద్దు ప్రస్తావనేది?

తన హయాంలో ఫీజుల విడుదలపై వ్యాఖ్యానించిన జగన్ పీజీ కోర్సులకు ఫీజులు రద్దుచేసిన విషయాన్ని ప్రస్తావించలేదు. వైసీపీ అధికారంలోకి రాకముందు అన్ని రకాల ఉన్నత విద్య కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండేది. 2020లో జగన్ ప్రభుత్వం పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిగా రద్దుచేసింది. ప్రైవేటు కాలేజీలు పీజీ విద్య పేరుతో అక్రమాలు చేస్తున్నాయని అప్పట్లో విచారణ కూడా చేపట్టింది. కానీ ఆ విచారణను ఎటూ తేల్చకుండానే పీజీ కోర్సులకు ఈ పథకాన్ని రద్దుచేసింది. విచారణ అనంతరం పథకాన్ని పునరుద్ధరిస్తామని చెప్పినా.. చేయలేదు. ఫలితంగా వేల మంది పేద విద్యార్థులు పీజీకి దూరమయ్యారు. పైగా అంతకముందు అక్రమాల పేరుతో కాలేజీలకు ఇవ్వాల్సిన రూ.450 కోట్ల ఫీజులను నిలిపివేశారు.

విద్యార్థులకు 6,500కోట్ల బకాయిలు పెట్టి.. సుద్దపూసలా.. ఆ రాతలేంటి జగన్!



» 'ఎక్స్'లో విద్యా మంత్రి లోకేశ్ ఫైర్

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రూ.6,500కోట్లు బకాయిపెట్టిపోయిన జగన్ సుద్దపూసలా 'ఎక్స్'లో రాసుకొచ్చారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. 'ఐదేళ్లలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసిన పాపం మీదే జగన్' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ విధానాలతో విద్యా వ్యవస్థ ఎలా మారిందో ఆదివారం 'ఎక్స్'లో లోకేశ్ పేర్కొన్నారు. 'గుడ్లు, చిక్కీలు మొదలు ఫీజు రీయింబర్స్‌మెంట్ వరకూ మీరు నా నెత్తిన పెట్టిపోయిన బకాయిలు అక్షరాలా రూ.6,500కోట్లు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వ బకాయిల్ని విడతల వారీగా చెల్లిస్తామని, విద్యార్థుల సర్టిఫికెట్లను తక్షణమే అందజేయాలని కళాశాలలను ఆదేశించాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును నేరుగా కళాశాలలకు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నాం. మీ అనాలోచిత, అవినీతి విధానాల కారణంగా గత ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో 4లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయిన విషయం వాస్తవం కాదా? గత ఐదేళ్లలో మీ వల్ల భ్రష్టుపట్టిన విద్యారంగాన్ని గాడిన పెట్టడం మా బాధ్యత. ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీతో భర్తీ చేసే ప్రక్రియను ప్రారంభించాం. మీలాంటి మారీచులు ఎంత తప్పుడు ప్రచారం చేసినా విద్యారంగ సంస్కరణల విషయంలో మా అడుగు ముందుకే' అని లోకేశ్ స్పష్టం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్ మాట్లాడడం సిగ్గుచేటు: స్వామి

టంగుటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి మాజీ ముఖ్యమంత్రి జగన్ మాట్లాడడం సిగ్గుచేటని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3వేల కోట్లు బకాయిలు పెట్టింది మీరే కదా జగన్.. అని మంత్రి ప్రశ్నించారు. ఐదేళ్లపాటు విద్యార్థులను మోసం చేసిన జగన్ అధికారం కోల్పోయాక మొసలి కన్నీరు కార్చుతున్నాడని విమర్శించారు.

చిత్రకొండలో సాగు.. లంబసింగి నుంచి సరఫరా

» అనకాపల్లి గంజాయి స్మగ్లర్ల ముఠా.. విచారణలో విస్తుపోయే అంశాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ మార్గంలో డబ్బు సంపాదన కోసం యువతను గంజాయి మత్తులో దించి సొమ్ము చేసుకుంటున్న స్మగ్లర్లు.. పక్కా ప్రణాళికతో దానిని నగరాలకు సరఫరా చేరుస్తున్నారు. అయితే గంజాయి సాగు చేయడం దగ్గర్నుంచే వీరి ప్రమేయం ఉంటోందని పోలీసుల విచారణలో తేలింది. లంబసింగి నుంచి హైదరాబాద్‌కు రహస్యంగా గంజాయి సరఫరా చేస్తున్న అనకాపల్లికి చెందిన ఘరానా స్మగ్లర్ల ముఠాను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) పోలీసులు శనివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ ముఠాను పోలీసులు విచారించిన క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్మగ్లింగ్ ముఠా నాయకుడు బాలాజీ గోవింద్‌కు ఆంధ్రా-ఒడిసా బోర్డర్‌లోని చిత్రకొండ అటవీ ప్రాంతానికి చెందిన గంజాయి సాగు చేసే రైతులు పరిచయమయ్యారు. దీంతో గంజాయి సాగుకు పెట్టుబడి సాయం తాను చేస్తానని, పండించిన గంజాయిని తనకు కేజీ రూ.1500 చొప్పున విక్రయించాలని రైతులను కోరాడు. దాన్ని మొదట్లో ఇతర వ్యక్తులకు హోల్‌సేల్‌గా కేజీ రూ.5 వేల చొప్పున విక్రయించేవాడు. తర్వాత అతని స్నేహితులు అదిగల్లి ప్రకాశ్‌కుమార్, మసాలాల మోహన్‌రావు, రాజన దుర్గాహరిప్రసాద్, కోడి రమణ, మరో ఇద్దరు.. గోవింద్‌తో జత కలిసి ముఠాగా ఏర్పడ్డారు. చిత్రకొండ అటవీ ప్రాంతంలో గంజాయి సాగు చేస్తున్న రైతుల నుంచి కొనుగోలు చేసే గోవింద్ ముఠా.. దానిని అడవిలోని రహస్య మార్గాల ద్వారా కూలీల సాయంతో 20 కిలోమీటర్ల మేర కాలినడకన రవాణా సౌకర్యం ఉన్న ప్రాంతానికి తరలించేవారు. గోవింద్ ముఠా అక్కడి నుంచి గుట్టుగా లంబసింగికి తరలించి భద్రపరచుకుంటారు. వ్యాపారుల ఆర్డర్‌ను బట్టి ఎవరి వ్యాపారం వారు చేస్తుంటారు. అయితే హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటకలో డిమాండ్‌ను అమ్మేవారు. హైదరాబాద్ నగరంలో కేజీ రూ.25 వేలకు విక్రయిస్తున్నారు. ఇలా 2020 నుంచి క్వింటాళ్ల కొద్దీ విక్రయించారు.

ఆ భేటీల మర్మమేమి?

(మొదటి పేజీ తరువాయి)

దాచేందుకు ఎంత ప్రయత్నించినా... పక్కా ప్లాన్ ప్రకారమే అదానీకి మేలు చేయడానికి 'డీల్' కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో జగన్-అదానీ పాత్రపై ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సెకీతో ఒప్పందానికి ముందు పనిగట్టుకుని ప్రత్యేక విమానంలో తాడేపల్లికి మూడుసార్లు అదానీ ఎందుకు వచ్చారు? జగన్‌ను ఎందుకు కలిశారు? ఒకవేళ విద్యుత్తు ఒప్పందం కోసం కాదని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అదానీ ఆసక్తి చూపారని అనుకున్నా.. అప్పట్లో ఆ విషయాన్ని సీఎం హోదాలో జగన్ ఎందుకు బహిర్గతం చేయలేదు? ప్రపంచ కుబేరుల్లో ఒకరుగా పేరున్న అదానీ మూడునెలల్లో మూడుసార్లు రహస్యంగా కలవాల్సిన అవసరం ఏమిటి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పంప్డ్ స్టోరేజీ, డేటా సెంటర్‌ను అదానీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆనాడు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారికంగా ప్రకటించలేదు. ఈ భేటీల వెనుక ఏదో మర్మం దాగుందనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. అమెరికా దర్యాప్తు సంస్థలు ఈ సందేహాలను పటాపంచలు చేశాయి. స్కాముల కోసం స్కీమ్‌కు స్కెచ్ వేసి రాష్ట్రంపై లక్షల కోట్ల రూపాయల సోలార్ ఒప్పందం భారాన్ని జగన్ వేశారంటూ న్యూయార్క్ కోర్టులో అభియోగం మోపాయి. జగన్-అదానీ ముడుపుల వ్యవహారం, ఇది నచ్చక విద్యుత్ సరఫరా ఒప్పందం నుంచి అజూర్ వైదొలగడం గురించి అభియోగపత్రంలో పేర్కొన్నాయి.

ఈఆర్‌సీ ఆదేశాలతో స్పష్టత

2021 డిసెంబరు 1న సెకీ, కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ... ఏపీ డిస్కమ్‌లు, ఏపీ ఇంధన శాఖ మధ్య జరిగిన ఒప్పందాన్ని యథాతథంగా కొనసాగించలేదు. 7,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తులో అదానీ 4,667, అజూర్ 2,333 మెగావాట్లు సరఫరా చేసేలా మొదట సెకీతో ఆ సంస్థలు ఒప్పందాన్ని చేసుకున్నాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వంతో సెకీ ఒప్పందం చేసుకున్నాక భాగస్వామ్య సంస్థలు అదానీ, అజూర్ మధ్య అభిప్రాయబేధాలు తలెత్తాయి. సెకీకి 2,333 మెగావాట్లను సరఫరా చేయబోమని ప్రకటించి, ఒప్పందం నుంచి అజూర్ వైదొలిగింది. దీంతో ఏపీతో సెకీ చేసుకున్న ఒప్పందాన్ని కొనసాగించేలా 7,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును తానే సరఫరా చేస్తానంటూ అదానీ ముందుకు వచ్చింది. సెకీ ఈ విషయాన్ని రాష్ట్రానికి తెలియజేసింది. తాడేపల్లి కార్యాలయం ఆదేశాల మేరకు 2024 ఏప్రిల్ 10న సెకీతో ఇంధన శాఖ అనుబంధ ఒప్పందం చేసుకుంది. ఏపీఈఆర్‌సీ ఇందుకు అభ్యంతరం చెప్పాలి. కానీ ఆమోదించింది.

మధ్యలో ఒప్పందం రద్దు చేసుకుంటే అపరాధంగా కొంత మొత్తాన్ని చెల్లించాలంటూ సహజంగా విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు షరతు విధించవు. తమ వద్ద విద్యుత్తును కొనుగోలు చేయాల్సిందేనన్న డిమాండ్‌ను పెడతాయి. కానీ సెకీతో ఒప్పందం చేసుకున్న సమయంలో.. మధ్యలో దీన్ని రద్దు చేసుకోవాలంటే రూ.2900 కోట్లు అపరాధ రుసుము కింద రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని అదానీ షరతు పెట్టింది. ముడుపుల వ్యవహారంలో అమెరికా దర్యాప్తు సంస్థలు అదానీని దోషిగా నిరూపిస్తే... దాని ఆధారంగా ఒప్పందాన్ని రద్దు చేసుకునే వీలుంటుంది.

మొత్తం భారం 1,61,920 కోట్లు

సెకీకి చెల్లించే మార్జిన్‌ను కూడా కలుపుకొని సౌర విద్యుత్తు కొనుగోలుకు యూనిట్‌కు రూ.2.49 ధరతో ఏపీ ఒప్పందం చేసుకుంది. రాజస్థాన్‌లో ఉత్పత్తి చేసే సౌర విద్యుత్తును రాష్ట్రానికి సరఫరా చేయడానికి అదనంగా ట్రాన్స్‌మిషన్ చార్జీలు ఉండవని జగన్ పలుమార్లు చెప్పారు. కానీ ఆ తర్వాత యూనిట్‌కు రూ.1.70 దాకా చార్జీలు ఉంటాయని సెకీ స్పష్టం చేసింది. అంటే.. యూనిట్ ధర రూ.4.19 అవుతుంది. ఈ లెక్కన 25ఏళ్లకి 7000 మెగావాట్ల ఒప్పందం విలువ రూ.95,429.25 కోట్లు. దీనికి ట్రాన్స్‌మిషన్ చార్జీలు రూ.66,500కోటు అదనం. ఈ మొత్తం 1,61,920.25 కోట్లు భారమంతా ప్రజలపైనే.



ఐఎంఏ వార్షిక సదస్సులో ప్రసంగిస్తున్న వైద్యులు నరేశ్‌బాబు, సోమరాజు

వైద్యులకూ సాఫ్ట్‌వేర్ సిండ్రోమ్!

45 ఏళ్లకే బీపీ, షుగర్, గుండె జబ్బుల బారిన

సుప్రసిద్ధ కార్డియాలజిస్ట్ సోమరాజు ఆందోళన.. వైద్యులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని హితవు

గుంటూరు మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లంటే.. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చుని పనిచేయాలి.. శారీరక శ్రమ తక్కువ.. మానసిక ఒత్తిడి అధికం. దీంతో 45 ఏళ్ల వయసుకే వారు బీపీ, షుగర్, గుండె జబ్బుల బారిన పడుతుంటారు. దీన్నే వైద్య పరిభాషలో సాఫ్ట్‌వేర్ సిండ్రోమ్ అని పిలుస్తారు. ఇప్పుడు ఈ రోగం.. వైద్యరంగంలోకీ ప్రవేశించింది. 'డాక్టర్లు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల మాదిరిగా శారీరక శ్రమకు దూరమవుతున్నారు. దీంతో వీరిలోనూ బీపీ, షుగర్, స్థూలకాయం, గుండెజబ్బులు పెరుగుతున్నాయి' అని సుప్రసిద్ధ కార్డియాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ బీ సోమరాజు ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు జింకానా ఆడిటోరియంలో జరుగుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర 66వ వార్షిక సదస్సులో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యుల ఆరోగ్య భద్రతపై ప్రసంగించారు. భారత్‌లో వ్యక్తి సగటు జీవితకాలం 65 ఏళ్లు కాగా.. వైద్యుల విషయంలో ఇది 59 ఏళ్లగా ఉందని సోమరాజు తెలిపారు. అనేక రకాల ఒత్తిళ్ల మధ్య రోగుల చికిత్సలో తల మునకలై ఉండే వైద్యులు నవ్వడం కూడా మర్చిపోతున్నారని తెలిపారు. చాలా మంది డాక్టర్లు శారీరకంగా తగినంత ఫిట్‌గా ఉండడం లేదన్నారు. నెలకోసారైనా తమ బీపీ చెక్ చేసుకోవడం లేదన్నారు. మంచి ఆహారం తీసుకోవడం, విత్రులతో సమయం సరదాగా గడపటం, రోజూ వ్యాయామం చేయడం అలవర్చుకోవాలని సోమరాజు వైద్యులకు సూచించారు.

అందరినీ వేధించే నడుంనొప్పి..

జలుబు, దగ్గు తర్వాత ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే ఆరోగ్య సమస్య నడుంనొప్పి అని మల్లిక స్పైన్ సెంటర్ అధినేత, ప్రముఖ వెన్ను వైద్య నిపుణులు డాక్టర్ జే నరేశ్ బాబు తెలిపారు. 'నడుంనొప్పి-అపోహలు, వాస్తవాలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. నడుం నొప్పిలో నాలుగు రకాలు ఉన్నా.. 90 శాతం మంది రోగులు మెకానికల్ బ్యాక్ పెయిన్‌తో బాధపడుతుంటారని ఆయన వివరించారు. వెన్నునొప్పికి కారణం తెలుసుకొంటే చికిత్స సులువే అన్నారు. స్టాండింగ్ ఎంఆర్‌ఐ స్కాన్ అందుబాట్లోకి వచ్చాక వెన్ను నొప్పి వ్యాధి నిర్ధారణ సులువుగా మారిందన్నారు. వెన్ను శస్త్రచికిత్సలు విఫలమైతే జీవితాంతం మంచానికే పరిమితం కావాల్సి వస్తుందనే భయం చాలామందిలో ఉందన్నారు. ఇందులో వాస్తవం లేదని.. కీ హోల్ సర్జరీతో వెన్నులో నరాలపై ఒత్తిడి పెంచే ఎముకలో చిన్నభాగాన్ని మాత్రమే తొలగించి విజయవంతంగా శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు నరేశ్ బాబు వెల్లడించారు.

ఐఎంఏ సొంత భవనంపై చర్చ..

సైంటిఫిక్ సెషన్ ముగిసిన అనంతరం ఐఎంఏ నూతన కార్యవర్గ సభ్యులు సమావేశమై వైద్యులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వైద్యులపై, ఆస్పత్రులపై జరుగుతున్న దాడుల నిరోధానికి ప్రభుత్వపరంగా తమకు రక్షణ చట్టం తేవాలని ఆకాంక్షించారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని తీర్మానించారు. అదేవిధంగా రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రభుత్వం స్థలం ఇస్తే అత్యాధునిక శైలిలో, ఆధునిక సౌకర్యాలతో ఐఎంఏ రాష్ట్ర శాఖ సొంత భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీ నందకిషోర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ కిషోర్, గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, ఉపాధ్యక్షుడు డాక్టర్ డీ అమరలింగేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ బీ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



29న విశాఖకు
ప్రధాని మోదీ రాక

- గ్రీన్ ఎనర్జీ హబ్‌లకు శంకుస్థాపన
- సాయంత్రం బహిరంగ సభ
- హాజరు కానున్న చంద్రబాబు, పవన్

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఈ నెల 29వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారు. విశాఖపట్నం పూడిమడకలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎన్టీపీసీ సంయుక్త భాగస్వామ్యంతో 1200 ఎకరాల్లో నిర్మించే గ్రీన్ హైడ్రోజన్ హబ్, గ్రీన్ ఇండస్ట్రియల్ హబ్‌లకు మోదీ శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. సాయంత్రం నాలుగున్నర గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. ఈ సభా వేదిక ద్వారా గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులతో సహా ఇతర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. రోడ్ షోలో కూడా మోదీ పాల్గొంటారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, ఎంపీలు పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఎన్టీపీసీ రాష్ట్రంలో 1,87,000 కోట్లతో గ్రీన్ ఎనర్జీ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను చేపట్టనున్నది. ఇందుకోసం ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు జరిగాయి. 1,06,250 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. తొలిదశ పనులు 2027 మే నాటికి పూర్తవుతాయి.

పోలవరం సొరంగాలకు ముప్పు!

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాల మధ్య ఉన్న కొండను తొలచి జంట సొరంగాలను తవ్వారు. జంట సొరంగాల్లో మొదటిది తోటగొంది-మామిడిగొంది సొరంగాలు. వాటిలో ఎడమ సొరంగం 826 మీటర్ల పొడవు, కుడి సొరంగం 735 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పున తొలిచారు. మామిడిగొంది-దేవరగొంది గ్రామాల మధ్య కొండను తొలచి 735 మీటర్ల పొడవు 12 మీటర్ల వెడల్పున మరో జంట సొరంగాలను, అదే తరహాలో నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణ ఆరంభంలో జలవనరుల శాఖ అధికారులు 2005లో ఈ పనులను ప్రారంభించారు. 2018లో రాజకీయ, ఆర్థిక కారణాల వల్ల పర్యావరణ పరిరక్షణ కమిటీ బోర్డు అనుమతులు, కోర్టు అభ్యంతరాల నేపథ్యంలో కొంత జాప్యం జరిగింది. అనంతరం 2019లో అప్పటి సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడమే ధ్యేయంగా పనులను ముందుకు నడిపించారు. జంట సొరంగాల నిర్మాణం జాప్యం కాకూడదనే ఉద్దేశంతో పర్యావరణానికి ఎలాంటి ముప్పు లేకుండా, జర్మనీ నుంచి దిగుమతి చేసిన అధునాతన యంత్రాలతో రెండు జంట సొరంగాల తొలచే పనులు 2019 మార్చిలో ప్రారంభించి, పూర్తి చేశారు.

టన్నెళ్లకు నీళ్లు ఎలా చేరుతాయంటే..

పోలవరం ప్రాజెక్టు ప్రధాన రిజర్వాయర్ నుంచి ప్రాజెక్టు కుడి కాలువకు జలాల తరలింపు కోసం కుడి కాలువ కనెక్టివిటీ నిర్మాణంలో భాగంగా 5 మీటర్ల పొడవున 9 గేట్లతో హెడ్ రెగ్యులేటర్ నిర్మించారు. దీని ద్వారా విడుదలైన జలాలు మామిడిగొంది-దేవరగొంది గ్రామాల మధ్య నిర్మించిన జంట సొరంగాల ద్వారా 325 మీటర్ల పొడవు, 44 మీటర్ల ఎత్తున రిజర్వాయర్ కోసం నిర్మించిన ఎఫ్ శ్యాడిల్ డ్యాం ప్రాంతంలోకి చేరుకుని, అక్కడి నుంచి తోటగొంది-మామిడిగొంది గ్రామాల మధ్య 725 మీటర్ల పొడవున నిర్మించిన మరో ఇ-శ్యాడిల్ డ్యాం రిజర్వాయర్ ద్వారా జంట సొరంగాల్లోకి ప్రవేశించి.. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా దిగువకు ప్రవహించి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువలోకి ప్రవహించేలా ప్రణాళికలు రూపొందించారు. కుడి కాలువ ద్వారా విడుదలైన జలాలు 174 కిలోమీటర్లు పొడవునా ప్రవహించి మార్గమధ్యలో కొవ్వాడ, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు, ఎర్ర కాలువలను దాటి విజయవాడ వద్ద బుడమేరు నీటి ప్రవాహంలో కలిసి, వెలగలేరు డైవర్షన్ రెగ్యులేటర్ ద్వారా ఇబ్రహీంపట్నంలో కృష్ణానదికి అనుసంధానం అవుతాయి.

లైనింగ్ పనులకు మరో ఏడాది

గత ప్రభుత్వ హయాంలో జంట సొరంగాల వెడల్పు పనులు చేపట్టడం జరిగింది. తోటగొంది-మామిడిగొంది జంట సొరంగాల్లో ఎడమవైపు టన్నెల్ వెడల్పు పనులు 50 శాతం, కుడివైపు టన్నెల్ 90 శాతం, మామిడిగొంది-దేవరగొంది సొరంగాల్లో కుడివైపు టన్నెల్ 70 శాతం, ఎడమవైపు టన్నెల్ 30 శాతం పనులు పూర్తయ్యాయి. జంట సొరంగాలకు రక్షణ కల్పించే లైనింగ్ పనులు పూర్తి చేయడానికి మరో ఏడాది సమయం పడుతుంది.

\- బాలకృష్ణ, ప్రాజెక్టు ఈఈ

సొరంగాల ప్రస్తుత పరిస్థితి ఏంటి?

నాటి నుంచి నేటి వరకూ జంట సొరంగాల లైనింగ్ పనులు పూర్తి కాలేదు. తాజాగా ఇప్పుడు తోటగొంది-మామిడిగొంది జంట సొరంగాల్లో.. ఎడమ వైపు టన్నెల్‌లో కూలిన ప్రాంతంలో పైభాగం పూర్తిగా పడి, మార్గం మూసుకుపోయింది. ఆ ప్రాంతంలో కొండ పైనుంచి ఊట జలాలు కిందికి జలపాతంలా ప్రవహిస్తున్నాయి. కుడి సొరంగాన్ని 50 మీటర్ల మేర వెడల్పు చేసి పనులు నిలిపివేశారు. ఈ సొరంగాలకు రక్షణ కోసం లైనింగ్ ఏర్పాటు చేయకపోవడం వల్ల కొండపై నుంచి సొరంగాల్లోకి వస్తున్న ఊట జలాల ఉధృతికి రెండు టన్నెళ్లలో పలు చోట్ల మట్టి, కొండరాళ్లు భారీ స్థాయిలో కిందకు పడుతున్నాయి. లైనింగ్ ఏర్పాటు చేసి ఉంటే ఈ పరిస్థితులు ఉండేవి కావు. మామిడిగొంది-దేవరగొంది జంట గుహల పనులు సైతం అసంపూర్తిగా నిలిచిపోయాయి.

శిథిలావస్థలో మామిడిగొంది-దేవరగొంది సొరంగాలు



జగన్ ప్రభుత్వం చేసిందేంటి..?

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ టెండరింగ్ పేరిట కొంత కాలం జాప్యం చేయడం, ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానమైన పనుల పట్ల దృష్టి సారించకపోవడంతో జంట సొరంగాల పనులు ఐదేళ్ల పాటు పడకేశాయి. జంట సొరంగాలకు చేపట్టాల్సిన లైనింగ్ పనులను విస్మరించడంతో లైనింగ్ నిర్మాణం పూర్తి కాక 2021 అక్టోబరులో తోటగొంది-మామిడిగొంది గ్రామాల మధ్య నిర్మించిన జంట సొరంగాల్లో ఎడమవైపు ఉన్న సొరంగం.. మామిడిగొంది గ్రామం వైపు టన్నెల్ ప్రారంభం నుంచి 50 మీటర్ల దూరంలో సుమారు 30 మీటర్ల మేర కొండ పైభాగం కూలిపోయింది. అప్పట్లో ప్రసార మాధ్యమాల్లో ఈ వార్త హల్‌చల్ చేసింది.

41.15 మీటర్ల ఎత్తు ప్రతిపాదన జగన్‌దే!

- 2021లో పంపితే నిరుడు ఆమోదించాం
- పోలవరం కాంటూరుపై తేల్చిచెప్పిన కేంద్ర జలశక్తి శాఖ

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రధాన డ్యాం ఎత్తును తొలి దశలో 41.15 మీటర్లకు ప్రతిపాదించింది నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వమేనని కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేసింది. 2021లో పంపిన ప్రతిపాదనను 2023లో ఆమోదించామని తెలిపింది. ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు.. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 196.40 టీఎంసీల నుంచి 115 టీఎంసీలకు కూటమి ప్రభుత్వం కుదించిందని జగన్ తాజాగా ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆరోపణల్లో వాస్తవం లేదని అసెంబ్లీ సమావేశాల్లో జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధారాలు చూపించి మరీ తేల్చిచెప్పారు. నిజానిజాల నిర్ధారణ కోసం సమాచార హక్కు చట్టం కింద సీనియర్ జర్నలిస్టు ఇనగంటి రవికుమార్ కేంద్ర జలశక్తి శాఖను సమాచారం కోరగా అందజేసింది. కుంగిన గైడ్‌బండ్ సహా ఇతర మరమ్మతుల పనులను రూ.1,500 కోట్లకు కాంట్రాక్టు సంస్థకు అప్పగించామని తెలిపింది. వీటికి అదనంగా మరో తొమ్మిది అనుబంధ ఒప్పందాల వల్ల అంచనా వ్యయం రూ.2,077 కోట్లకు చేరినట్లు పేర్కొంది.

త్వరలో కలెక్టర్ల సదస్సు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పథకాలు, ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తోన్న సర్కారు త్వరలో జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించనుంది. ప్రభుత్వ ప్రాధాన్యాలు, భవిష్యత్ కార్యాక్రమాల అమలుపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనుంది. తొలుత ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించాలని అనుకున్నా పలు కారణాలతో ఆమోదించలేదు. డిసెంబరు 3, 4 తేదీల్లో విజయవాడలో నిర్వహించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. 150 రోజుల పాలనలో నిర్ణయాల అమలు, ఫలితాలు, భవిష్యత్ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించి కలెక్టర్‌లకు దిశానిర్దేశం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

రాయి తగిలితే ప్రాణం పోతుందా?

- 'నందిగామ' కేసులో పోలీసులకు న్యాయాధికారి ప్రశ్న
- రాళ్ల దాడి నిందితులకు సొంత పూచీకత్తుతో బెయిల్
- జిల్లా కోర్టులో అప్పీలుకు పోలీసుల నిర్ణయం

విజయవాడ/నందిగామ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'రాయి తగిలినంత మాత్రాన ప్రాణం పోతుందా? హత్యాయత్నం (ఐపీసీ 307) సెక్షన్ ఎలా చేర్చుతారు..? ఇంతకుముందు నమోదు చేసిన ఐపీసీ 120(బీ) సరైనది కదా?' అని నందిగామ సీనియర్ సివిల్ జడ్జి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి పోలీసులను ప్రశ్నించారు. నందిగామలో 2022 నవంబరు 4న 'బాదుడే బాదుడు' కార్యక్రమానికి వెళ్లిన అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై రాళ్లతో దాడి చేసిన నలుగురు నిందితులను పోలీసులు శనివారం రాత్రి ఆయన ఎదుట హాజరు పరిచారు. నిందితులు కన్నెగంటి సజ్జనరావు, బెజవాడ కార్తీక్, పరిమి కిశోర్, కంచికచర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ మార్త శ్రీనివాసరావు పథకం ప్రకారం దాడి చేశారని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. చంద్రబాబు నందిగామ రావడానికి గంట ముందు వైసీపీ కార్యాలయంలో దాడికి వ్యూహరచన జరిగిందని రాశారు. నిందితులు బెజవాడ కార్తీక్, పరిమి కిశోర్ ఒక జెండా స్తంభానికి వెనుక వైపు నిలబడి చీకట్లో రాళ్లతో దాడి చేశారని, చంద్రబాబు జడ్‌ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్నారని, ఈ రాళ్లు తగలరాని చోట తగిలితే ప్రాణం పోయేవని పేర్కొన్నారు. నిందితులకు రిమాండ్ విధించాలని అభ్యర్థించారు. రిమాండ్ రిపోర్టును చదివిన న్యాయాధికారి.. వారికి పై ప్రశ్నలు సంధించారు. 'రాయి తగిలితే ప్రాణం పోతుందా..? నిందితులు విసిరిన రాయి చూశారా..? ఘటన జరిగిన తర్వాత పోలీసులు 120(బీ) సెక్షన్ కింద కింద కేసు నమోదు చేయడం సబబే కదా.. కొత్తగా ఇప్పుడు సెక్షన్ 307 ఎలా చేరుస్తారు..' అని అడిగారు. 2022 నవంబరు 4న ఏం జరిగింది, ఆ తర్వాత పరిణామాలు ఎలా తిరిగాయనే విషయాలను పోలీసులు వివరించడంతో నిందితులను రిమాండ్‌కు పంపేందుకు అంగీకరించారు. అయితే వెంటనే సొంత పూచీకత్తుపై వారికి బెయిల్ మంజూరుచేశారు. 2-3 రోజుల్లో పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. ఈ ఆదేశాలపై మచిలీపట్నంలోని జిల్లా కోర్టులో అప్పీలు చేయాలని పోలీసులు నిర్ణయించారు. సోమవారమే అప్పీలుకు వెళ్లనున్నారు.

కల్తీ నెయ్యిపై కదిలిన సిట్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి? అవి ఎప్పటివి? వాటి సామర్థ్యం పరీక్షించే వారి ఉన్న అర్హతలు ఏమిటి? వారి అర్హతలు రుజువు చేసే సర్టిఫికెట్లు ఉన్నాయా? ల్యాబ్‌లో ఆహార కల్తీ నిరోధక విభాగానికి సంబంధించి నిపుణులున్నారా? ఏఆర్ డెయిరీ నెయ్యి సాంద్రత, నాణ్యతను గుర్తించిన నిపుణులు ఎవరు? ఎస్‌ఎంఎస్ ల్యాబ్ నుంచి బయట ఎక్కడికైనా నమూనాలు పంపించి టెస్టులు చేయించి రిపోర్టులు తెప్పిస్తున్నారా? తదితర ప్రశ్నావళిని రూపొందించుకుని వివరాలు సేకరించినట్టు సమాచారం. ఏఆర్ డెయిరీ నెయ్యి నాణ్యతను పరీక్షించి, సర్టిఫికెట్ జారీ చేసిన ల్యాబ్ నిపుణుల వివరాలు, చిరునామాలతో సహా సేకరించినట్టు తెలిసింది. సిట్ కీలక అధికారులు రంగప్రవేశం చేశాక దీనిపై సంబంధిత నిపుణులను లోతుగా ప్రశ్నించే అవకాశం ఉంది.

అధికారుల బృందాల్లో ఒకటి వైష్ణవి డెయిరీలో, మరొకటి దిండుగల్‌లోని ఏఆర్ డెయిరీలో తనిఖీలు చేపట్టాయి. ఈ రెండు డెయిరీల సామర్థ్యంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాయి. ఈ డెయిరీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి? ఎన్ని చిల్లింగ్ సెంటర్లు ఉన్నాయి? వాటి రోజువారీ పాల సేకరణ సామర్థ్యం ఎంత? ఆ పాలను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఆ డెయిరీలకు ఉందా? ప్రాసెస్ సమయంలో ఆవు పాలు, గేదె పాలు రెండూ కలిపి వెన్న తీస్తున్నారా? పాల నుంచి ఎంత శాతం వెన్న వస్తోంది? వచ్చే వెన్నలో కిలోకు ఎంత నెయ్యి వస్తోంది? పాల నుంచి వెన్న తీసే యంత్ర పరికరాలు ఎప్పటివి? టీటీడీకి ఈ డెయిరీలే స్వయంగా నెయ్యి తయారు చేసి సరఫరా చేస్తున్నాయా లేక ఇతర డెయిరీల నుంచి సేకరించి పంపుతున్నాయా? అనే కోణాల్లో వివరాలు సేకరిస్తున్నారు. కాగా, టీటీడీకి నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం వైష్ణవి డెయిరీకి లేదని సిట్ బృందం ప్రాథమిక పరిశీలనలో వెల్లడైనట్టు తెలిసింది. రెండు డెయిరీల రికార్డులు పరిశీలించి అవసరమైన పత్రాలను విచారణ నిమిత్తం స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. కాగా, ఏఆర్ డెయిరీలో శనివారం మధ్యాహ్నం 1గంట నుంచి ఆదివారం తెల్లవారుజాము 2గంటల వరకు సుమారు 13 గంటల పాటు తనిఖీలు కొనసాగాయి. ఈ సోదాల్లో తిరుపతికి చెందిన 11 మంది అధికారులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వే జోన్‌కు కదలిక

- 149 కోట్లతో కార్యాలయాలకు టెండర్లు
- డిసెంబరు 27 వరకు గడువు
- 29న ప్రధానితో శంకుస్థాపనకు చాన్స్
- ప్రహరీ నిర్మాణానికి పునాదులు

విశాఖపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇక్కడ కొత్తగా ఏర్పాటు చేయబోయే దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయాల నిర్మాణానికి శనివారం రాత్రి టెండర్ ప్రకటన జారీ అయింది. ప్రధాని నరేంద్ర మోదీ 2019లో ఎన్నికల ప్రచారానికి విశాఖపట్నం వచ్చినప్పుడు కొత్త రైల్వే జోన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే జోన్ కార్యాలయాలకు అవసరమైన భూముల కోసం అన్వేషించారు. విశాఖ మహా నగర పాలక సంస్థ, రైల్వే నుంచి గతంలో తీసుకున్న భూములకు ప్రత్యామ్నాయంగా ముడసర్లోవలో 52 ఎకరాలు ఇవ్వడానికి అంగీకరించింది. ఆ భూమిలో ఆక్రమణదారులు ఉండడంతో కొంతకాలం వివాదం సాగింది. ఇవన్నీ కాకుండా డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం వెనుకనున్న వైర్‌లెస్ కాలనీలో రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేయాలని 2022, నవంబరులో ఏర్పాట్లు చేశారు. అయితే, ఏం జరిగిందో ఏమో రాత్రికి రాత్రి నిర్ణయం మార్చుకుని కార్యక్రమాన్ని వాయిదా వేశారు. వైసీపీ ప్రభుత్వం భూముల అప్పగింతలో జాప్యం చేయడంతో జోన్ పనులు ప్రారంభించలేక పోతున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. భూములు ఇస్తే వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కూడా ప్రకటించారు. 2024లో మళ్లీ ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు దీనిపై దృష్టి పెట్టారు. రైల్వే శాఖకు వెంటనే భూములు అప్పగించాలని విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో ఆగస్టు నెలాఖరులో రైల్వేకి భూములు అప్పగించి రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ కూడా చేయించారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఈ ఏడాది డిసెంబరులో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయిస్తామని ప్రకటించారు. ఈ హామీ ప్రకారం డిసెంబరు నెల ఇంకా వారం రోజులు ఉండగానే జోన్ భవన నిర్మాణాలకు టెండర్ వెలువడింది. ఈ నెల 29న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం వస్తున్నారు. ఇక్కడికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న అచ్యుతాపురం సెజ్‌లో పూడిమడక వద్ద ఎన్‌టీపీసీ ఏర్పాటు చేయబోయే హైడ్రోజన్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే జోన్ భవనాల నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేసే అవకాశం ఉందని సమాచారం.


రైల్వే జోన్‌కు కేటాయించిన స్థలానికి ప్రహరీ నిర్మాణానికి పునాదులు తీసిన దృశ్యం

రూ.149.16 కోట్లు కేటాయింపు

విశాఖ నగరంలోని ముడసర్లోవలో రూ.149.16 కోట్ల వ్యయంతో రైల్వే జోనల్ కార్యాలయాలు నిర్మించనున్నారు. తొలుత దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయ భవన సముదాయాన్ని నిర్మిస్తారు. ఇది 11 అంతస్తుల్లో ఉంటుంది. రెండు బేస్‌మెంట్లు ఉంటాయి. దీంతోపాటు ఇతర భవనాలు కూడా నిర్మిస్తారు. టెండర్లు సమర్పించడానికి డిసెంబరు 27 వరకు గడువుంది.

కార్యకలాపాలకు ఓకే

రైల్వే జోన్ భవన నిర్మాణాలు పూర్తి చేయడానికి 24 నెలల గడువు విధించారు. అంటే రెండేళ్లు. అయితే, ఏయే నిర్మాణాలు ఎప్పటిలోగా పూర్తి చేయాలన్నది స్పష్టత లేదు. కాబట్టి నిర్మాణాలకు మరో ఏడాది అదనంగా పట్టే అవకాశం ఉంది. దీంతో అప్పటివరకు జోన్ కార్యకలాపాలు ప్రారంభించకుండా ఉండడం సమంజసం కాదు కాబట్టి, తాత్కాలికంగా ఖాళీగా ఉన్న భవనాల్లో తక్షణమే కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.


దర్శిలో 13వ శతాబ్దం నాటి శాసనాన్ని పరిశీలిస్తున్న చరిత్ర పరిశోధకుడు శ్రీనివాసప్రసాద్

దర్శిలో 13వ శతాబ్దం నాటి శాసనం

దర్శి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దర్శి పట్టణ సమీపంలోని అచ్చన్నచెరువు వద్ద 13వ శతాబ్దం నాటి శాసనం బయటపడింది. చరిత్ర పరిశోధకుడు దరిమెళ్ల శ్రీనివాసప్రసాద్, సంఘసేవకుడు జి.వి.రత్నం దీన్ని గుర్తించారు. క్రీస్తు శకం 1317 సంవత్సరంలో లభించిన ఈ శాసనాన్ని ఆనాటి దర్శి పాలకుడైన నాగవంశరాజు మహామండలేశ్వర అష్టదేవ మహారాజు ఏర్పాటు చేయించినట్లు గుర్తించారు. తెలుగు నేలను పాలించిన నాగవంశ రాజుల్లో ఆయన ప్రసిద్ధుడు. ఈ శాసనంలో వారికి సంబంధించిన ఏడు తరాల రాజుల వంశవృక్షం రాసి ఉంది. 1395లో అక్కడ చెరువు తవ్వించినట్టు, వేణుగోపాలస్వామి గుడి నిర్మించినట్లు అందులో ఉంది. వేణుగోపాలస్వామి ఆలయానికి దర్శి, పొతకమూరు, దేవవరం, సామంతపూడి, పూరివిట్ల, ఈదర గ్రామాల్లో మాన్యం ఉన్నట్లు దాని ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయాన్ని అష్టదేవ మహారాజు తల్లి ఆర్యమదేవి ఆధ్వర్యంలో నిర్మించినట్టు గుర్తించారు. ఈ మాన్యం భూములను ఆలయ సంరక్షణకు కేటాయించారు. దర్శి గ్రామంలో ఆంజనేయస్వామి గుడి, శివాలయంలో కూడా కాకతీయ రాజులనాటి శాసనాలు ఉన్నాయి. ఎంతో ప్రాచీనమైన శాసనాలు బయటపడటంతో దర్శికి ఎంతో ఘనచరిత్ర ఉందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోస్తాకు తుఫాన్ ముప్పు!

- బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం
- నేటి కల్లా వాయుగుండంగా మారే చాన్స్
- నేటి నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమలో వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది పశ్చిమ వాయువ్యంగా పయనిస్తూ ఈ నెల 25కల్లా దక్షిణ బంగాళాఖాతంలో ప్రవేశించి వాయుగుండంగా బలపడనున్నది. ఇది 27కల్లా తమిళనాడు, శ్రీలంక తీరాల దిశగా రానున్నదని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది తుఫాన్‌గా బలపడుతుందని పలు మోడళ్లు అంచనా వేస్తున్నాయి.ఐరోపాకు చెందిన ఈసీఎండబ్ల్యూఎఫ్ మోడల్ ప్రకారం తీవ్ర అల్పపీడనం 26 వరకు పశ్చిమంగా పయనించి తరువాత బలపడి వాయుగుండంగా మారేక్రమంలో ఉత్తర వాయవ్యంగా పయినించి 28 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుంది. తరువాత అల్పపీడనం/తీవ్ర అల్పపీడనంగా మారుతూ 30న రాత్రి కోస్తాంధ్రలో తీరం దాటుతుంది. ఎన్‌సీయూఎం మోడల్ ప్రకారం తీవ్ర అల్పపీడనం 26దీకల్లా నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించి, తరువాత వాయువ్యంగా పయనించి 28వ తేదీ రాత్రికి పుదుచ్చేరి వద్ద తీరం దాటుతుంది. ఈ రెండు మోడళ్ల ప్రకారం కోస్తాంధ్ర, రాయలసీమపై ఎక్కువ ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, ఐఎండీ, జీఈపీఎస్ ప్రకారం ఆదివారం రాత్రికి వాయుగుండంగా మారి, తరువాత 26 సాయంత్రానికి శ్రీలంక వద్ద నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో తుఫాన్‌గా బలపడుతుంది. తరువాత మయన్మార్ వైపుగా వెళుతుంది. ఎన్‌సీఈపీ మోడల్ ప్రకారం కూడా వాయుగుండంగా బలపడిన తరువాత 27 వరకు పశ్చిమ వాయవ్యంగా పయనించి, మయన్మార్ వైపు వెళ్లనుంది. సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలో పలుచోట్ల, ఉత్తరకోస్తాలో ఒకటి, రెండుచోట్ల వర్షాలు కురుస్తాయి. 27, 28 తేదీల్లో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో, 29న విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. 30న కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతాంగానికి గుబులు పట్టుకుంది. 27 నుంచి 30 వరకు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి దండిగా పండింది. కోతలు సాగుతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో పత్తి తీతలు పుంజుకున్నాయి. రబీ పంటలు మొలక, మొక్క దశలో ఉన్నాయి. ఈ తరుణంలో భారీ వర్షాలు కురిస్తే.. నష్టం ఖాయమని రైతులు చెబుతున్నారు.


తుఫాను గమనానికి సంబంధించి ఐఎండీ విడుదల చేసిన చిత్రం

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N. Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.